www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
19-07-2024
సంపుటి : 01 | సంచిక : 76 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD

## ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యంపై
# కోర్టు కీలక నిర్ణయం

డిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో పరీక్షలకు ఆదేశం

మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురైన కేసీఆర్ తనయ

తీవ్ర జ్వరం, ఇతర సమస్యలతో బాధపడుతున్న కవిత




**విశ్వంభర, ఢిల్లీ :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోగ్యంపై ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. కవితను మెడికల్ చెకప్ కోసం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేసింది.ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కవిత ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల కవిత అస్వస్థతకు గురికాగా.. ఆమెను ఢిల్లీలోని దీనదయాళ్ ఉపాధ్యాయ్ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర జ్వరం, మిగతా2లో...

## తూచ్..
# నేను అలా అనలేదు

- రాజీనామాపై హరీష్ రావు యూటర్న్
- 100 రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలుపై అన్నానంటూ తిరకాసు
- హరీష్ రావుపై సోషల్ మీడియాలో భారీగా ట్రోలింగ్
- రాజీనామాకు వేళైంది అంటూ.. సెటైర్లు


2



## దేశానికే ఆదర్శంగా
# తెలంగాణ ప్రభుత్వం
## రుణమాఫీతో 16 ఏళ్ల రాజకీయ జీవితంలో మరుపురాని రోజు

- రుణమాఫీకి పాసు బుక్‌నే కొలబద్ద...
- పదేళ్ల అధికారంలో ఉండి
- రూ.21 వేల కోట్లు మాఫీ చేయలేకపోయారు..
- సోనియా, రాహుల్ ఇచ్చిన హామీని నెరవేర్చాం...
- నెలాఖరున వరంగల్‌లో
- రాహుల్ గాంధీకి కృతజ్ఞత సభ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రైతులకు రుణమాఫీ చెక్కుల అందజేత
- వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల రైతులతో
- మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

“ఇప్పటి వరకు ఆ మోడల్, ఈ మోడల్ అని పలువురు చెప్పకున్నారు.... రూ.2 లక్షల రైతు రుణమాఫీతో ఇక నుంచి తెలంగాణ ప్రభుత్వం దేశానికి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా, నమూనాగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జడ్పీటీసీ సభ్యునిగా, శాసనమండలి సభ్యునిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పార్లమెంట్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పని చేశానని తెలిపారు. తన 16 ఏళ్ల రాజకీయ జీవితంలో ఈ రోజు మరుపురాని రోజని ముఖ్యమంత్రి భావోద్వేగానికి గురయ్యారు. రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించిన కార్యక్రమాన్ని రాష్ట్ర సచివాలయంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.



**విశ్వంభరా, హైదరాబాద్:**
రాష్ట్రంలోని 577 రైతు వేదికల్లోని అన్నదాతలు, రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆయా రైతు వేదికల వద్దనున్న రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ 2002, మే 6వ తేదీన వరంగల్లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని, నాడే రూ.2 లక్షల రుణమాఫీకి హామీ ఇచ్చామని గుర్తు చేశారు. 2023, సెప్టెంబరు మిగతా2లో...


2

## కృత్రిమ మేధ వినియోగంపై
# 20 ఏళ్ల రోడ్ మ్యాప్ రూపొందించాలి

- 200 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు
- బ్రిటిష్ హై కమిషన్, ఎర్నెస్ట్ సంస్థలు భాగస్వాములు కావాలి
- ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## అసెంబ్లీ సమావేశాలకు
# ముహూర్తం ఫిక్స్
## ఈ నెల 23 నుంచి తెలంగాణ బడ్జెట్ సెషన్స్




- 24 నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్
- 25న బడ్జెట్ ప్రవేశపట్టనున్న ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క
- రైతు భరోసా, జాబ్ క్యాలెండర్, రైతు రుణమాఫీ చర్చ
- అసెంబ్లీకి కేసీఆర్ హాజరుపై తీవ్ర ఉత్కంఠ

**విశ్వంభర,హైదరాబాద్:**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈనెల 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 11 గంటలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మరోవైపు ఈ నెల 24 నుంచి శాసన మండలి సమావేశాలు ప్రారంభంకానున్నాయి. 24న ఉదయం 10 గంటలకు కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం అవుతాయి. ఇకపోతే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఏపీ అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మిగతా3లో...

## రుణమాఫీకి
# సైబర్ నేరగాళ్ల బెడద

- ఏపీకే లింక్స్ పంపించి డబ్బులు లూటీ
- అప్రమత్తమైన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- వివిధ బ్యాంకుల లోగోతో వచ్చే లింక్స్ క్లిక్ చేయొద్దని విజ్ఞప్తి
- సైబర్ నేరగాళ్లు డబ్బులు కొట్టేస్తే #1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచన



**విశ్వంభర, హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ చేసిన నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు ఏదో బ్యాంకు పేరిట వాట్సాప్ ప్రొఫైల్ బ్యాంకు పేరు, పిక్చర్ బ్యాంకు లోగో తో వాట్స యాప్ లో మిగతా3లో...



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 105 | ₹ 127 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 184 | ₹ 210 |


3

## అశ్వరావుపేట మండలంలో
# పోటెత్తిన వరద

- బ్రిడ్జిపై చిక్కుకున్న కూలీలు
- గ్రామాలను చుట్టుముడుతున్న పెద్దవాగు వరద
- కలెక్టర్, ఎస్పీతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్

## రైతు రుణమాఫీ నిధులను
# వాటికే వినియోగించాలి

- ఇతర అప్పులకు ఎట్టి పరిస్థితుల్లో జమ చేసుకోవద్దు
- బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క ఆదేశం


2


2

# రైతుబంధు నిధులే దారి మళ్లింపు

- వాటితోనే రుణమాఫీ చేస్తున్నమని పోజులు
- రూ.లక్ష రుణం తీసుకున్న రైతులు 40 లక్షల మంది
- కానీ 11 లక్షల మంది రైతులనే ఎలా ఎంపిక చేశారు?
- ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

## వీధి కుక్కల నివారణకు ఎలాంటి చర్యలు
# తీసుకుంటున్నారు?
## వీధికుక్కల దాడుల నేపథ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



- జీహెచ్ఎంసీలో 3.79 లక్షల వీధి కుక్కలు ఉన్నాయన్న అడ్వకేట్ జనరల్
- కుక్కల దాడులను నివారించేందుకు స్టేట్ లెవెల్ కమిటీలు ఏర్పాటు
- ఆరు కేంద్రాల వద్ద కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నామని వెల్లడి
- షెల్టర్ హోమ్స్‌కు తరలించాలన్న యానిమల్ వెల్ఫేర్ అసోసియేషన్
- వచ్చే వాయిదాకు పరిష్కార మార్గాలతో రావాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

2

# ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యంపై కోర్టు కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఇతర సమస్యలతో బాధపడుతున్న కవితకు ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించారు. అనంతరం తిరిగి తీహార్ జైలుకు తరలించారు. అయితే కవిత ఆరోగ్య పరిస్థితి నేపథ్యంలో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కవితను మెడికల్ చెకప్ కోసం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కవిత ఆరోగ్యంపై రిపోర్ట్ ఢిల్లీ ఎయిమ్స్‌కు సూచించింది. ఇక, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను మార్చి 15న హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు ఢిల్లీకి తరలించిన సంగతి తెలిసిందే. కవిత తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో సీబీఐ కూడా ఆమెను అరెస్ట్ చేసింది. దీంతో కవిత దాదాపుగా 4 నెలల నుంచి తీహార్ జైలులో ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ కోసం కవిత తరపు న్యాయవాదులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

# కృత్రిమ మేధ వినియోగంపై 20 ఏళ్ల రోడ్ మ్యాప్ రూపొందించాలి

**విశ్వంభరా, హైదరాబాద్ :** కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీల్లో బ్రిటిష్ హై కమిషన్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ (E&Y) సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వాములు అవడం పట్ల ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. గురువారం బ్రిటిష్ హై కమిషన్, ఇ&వై ప్రతినిధులతో ఆయన సచివాలయంలో భేటీ అయ్యారు. గ్లోబల్ సామర్థ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంలో సహకరించాలని ఈ సందర్భంగా ఆయన వారిని కోరారు. వచ్చే 20 ఏళ్లకు సంబందించి ప్రభుత్వ పాలన, పారిశ్రామిక రంగాల్లో కృత్రిమ మేధ వినియోగంపై ఒక రోడ్ మ్యాప్ ను రూపొందించాలని ఆయన సూచించారు. తెలంగాణా ప్రభుత్వం 200 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఏఐ సిటీలో బ్రిటిష్ హై కమిషన్, ఎర్నెస్ట్ సంస్థలు కీలక భాగస్వాములు కావాలని శ్రీధర్ బాబు అభిలషించారు. సైబర్ సెక్యూరిటీలో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి హై కమిషన్ ముందుకు రావడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. సమావేశంలో బ్రిటిష్ హై కమిషన్ కు చెందిన లారా బాల్డ్ విన్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ ప్రతినిధులు వికాస్ అగర్వాల్, నవీన్ కౌల్, కిరణ్ వింజమూరి, రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ డైరెక్టర్ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీ నిధులను వాటికే వినియోగించాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** రైతు రుణమాఫీపై హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసే రైతు రుణమాఫీ నిధులను వాటికే వినియోగించాలని చెప్పారు. ఇతర అప్పులకు ఎట్టి పరిస్థితుల్లో జమ చేసుకోవద్దని ఆదేశించారు. ఆగస్టు నెల దాటకముందే 31 వేల కోట్ల రూపాయలు రైతు రుణమాఫీ కింద విడుదల చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం 11 లక్షలకు పైబడి రైతులకు 6000 కోట్ల రూపాయలకు పైబడి నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. అంతేగాక, ఈ నెలలోనే రెండోదఫా లక్షన్నర వరకు బకాయి ఉన్న రైతుల రుణాలకు నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ నిధులను విడుదల చేస్తామని అన్నారు. రైతు రుణమాఫీ దేశ చరిత్రలోనే చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. ఒకేసారి 2 లక్షల రుణమాఫీ పథకం ద్వారా 31 వేల కోట్లు ఏ రాష్ట్రంలోనూ మాఫీ చేయలేదని చెప్పారు. అధికారంలోకి వచ్చే ముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేతగా తాను రైతు రుణమాఫీ గ్యారెంటీ కార్డు పై సంతకం చేసి ప్రచారంలోకి వెళ్లామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద ప్రోత్సాహమని చెప్పారు.

# రూ.లక్ష రుణమాఫీలో అందోల్ దే అగ్రభాగం...

- రెండు, మూడు స్థానాల్లో హుస్నాబాద్, కల్వకుర్తి నియోజకవర్గాలు

**విశ్వంభర హైదరాబాద్:** రూ.లక్ష రుణమాఫీలో రాష్ట్రంలో మొదటి స్థానంలో అందోల్ నియోజకవర్గం నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో హుస్నాబాద్, కల్వకుర్తి రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. రూ.రెండు లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో రూ.లక్ష వరకు రుణాలను రాష్ట్ర ప్రభుత్వం గురువారం మాఫీ చేసింది. రాష్ట్రంలోని 110 నియోజకవర్గాల పరిధిలోని (9 నగర నియోజకవర్గాల్లో రైతు రుణాలు లేవు) 10,84,050 రైతు కుటుంబాలకు చెందిన 11,50,193 మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6,098.93 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. దీంతో ఆ కుటుంబాలన్నీ రుణవిముక్తం అయ్యాయి. రుణమాఫీ జరిగిన 110 నియోజకవర్గాల్లో అత్యధికంగా అందోల్ నియోజకవర్గంలో 19,186 రైతు కుటుంబాలకు చెందిన 20,216 మంది రైతులకు చెందిన రూ.107.83 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. తర్వాత హుస్నాబాద్ నియోజకవర్గంలో 18,101 రైతు కుటుంబాలకు చెందిన 18,907 మంది రైతులకు చెందిన రూ.106.74 కోట్లు, కల్వకుర్తి నియోజకవర్గంలో 17,270 రైతు కుటుంబాలకు చెందిన 18,196 మంది రైతులకు చెందిన రూ.103.02 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి.

# ఇండియాలో ఇదే ప్రథమ రుణమాఫీ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



**విశ్వంభర, బాన్సువాడ:** దేశ చరిత్రలోనే ఒకేసారి రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ ఎప్పుడు జరగలేదని.. ఇదే తొలిసారి అని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు.అది కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. గురువారం దేశాయిపేట రైతు వేదికపై ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ముఖాముఖి కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇదో గొప్ప సంఘటనని.. రైతుల జీవితంలో ఇంత వరకు జరగని సంఘటన ఇప్పుడు జరుగుతుందని అన్నారు.తాను 2014 నుంచి 2018 వరకు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో రూ. లక్ష వరకు రుణాలను మాఫీ చేశామని, అదీకూడా రూ.25 వేలు చొప్పున నాలుగు విడతలుగా చేశామని అన్నారు. అందుకోసం నాడు రూ.16,170 కోట్లు ఖర్చు అయిందని, అయితే 2018 అనంతరం రెండో విడత ప్రభుత్వంలో రూ. 20 వేల కోట్ల రుణాలు ఉండగా.. రూ.12 వేల కోట్ల వరకు మాత్రమే అందించారని తెలిపారు. ఇంకా రూ. 8 వేల కోట్లు రైతుల ఖాతాలలో జమ కాలేదని ,కానీ నలబై లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్లు.. రెండు లక్షల రూపాయల వరకు ఒకేసారి అందించడం మాత్రం ఇండియాలో ఇదే ప్రథమం అని అన్నారు.ఇలాంటిది గతంలో ఎప్పుడు జరగలేదని... అందుకే సంబురాలు చేసుకుంటున్నామని ఎమ్మెల్యే పోచారం తెలిపారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

17వ తేదీన కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ ఆరు గ్యారంటీలతో పాటు రైతు రుణమాఫీ హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నేతల హామీ ప్రకారం.. మంత్రి వర్గ సహచరులు, అధికారుల సహకారంతో రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. కాంగ్రెస్ మాట ఇస్తే శిలా శాసనమని రుణమాఫీతో మరోసారి నిరూపణ అయిందని ముఖ్యమంత్రి అన్నారు. అరవై సంవత్సరాల ప్రజల ఆకాంక్షను గుర్తించి 2004లో కరీంనగర్ సభలో సోనియా గాంధీ తెలంగాణ ఏర్పాటుకు హామీ ఇచ్చారని, ఎక్కువ ఎంపీ సీట్లున్న ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా తీవ్రంగా నష్టపోతామని తెలిసినా ఇచ్చిన మాట మేరకు తెలంగాణ ఇచ్చారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. మాట తప్పని, మడమ తిప్పని నాయకురాలిగా, తెలంగాణ ప్రజలు శాశ్వతంగా గుర్తుపెట్టుకునేలా సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని ముఖ్యమంత్రి కొనియాడారు. రైతుల అనుమతితో తాను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలుపుతామన్నారు. ఏ వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో రుణమాఫీ హామీ ఇచ్చామో అక్కడే కృతజ్ఞత సభ పెడతామని, ఆ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించి రాష్ట్ర రైతుల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

**పదేళ్లలో రూ.21 వేల కోట్లను మించలే...**

మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రుణమాఫీ విషయంలో రెండు సార్లు మాట తప్పారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. రూ.లక్ష రుణమాఫీతో తొలిసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రూ.16 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని, అయిదేళ్లలో దఫాదఫాలుగా కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని మండిపడ్డారు. రూ.లక్ష రుణమాఫీతో రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రూ.12 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి దఫాదఫాలుగా కేవలం రూ.9 వేల కోట్లు మాత్రమే చేశారని, మొత్తంగా పదేళ్లలో రూ.21 వేల కోట్లకు మించి రుణమాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఒకే సారి రుణమాఫీ చేయకపోవడంతో వడ్డీలు మిగిలిపోయి రైతుల అప్పులు తీరలేదన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉన్నా కేసీఆర్ ప్రజలకిచ్చిన మాటను నెరవేర్చలేదని విమర్శించారు. తాము ఒకేదఫా రూ.2 లక్షల మేర రుణాలను మాఫీ చేస్తున్నామన్నారు. తొలి విడతగా 0 నుంచి రూ.1 లక్ష వరకు ఉన్న రుణాలకు రూ.6,098 కోట్లను విడుదల చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. రెండో విడతగా 0 నుంచి రూ.1.50 లక్షల వరకు ఉన్న రైతులకు, మూడో విడతగా 0 నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆగస్టు నెల పూర్తికాక ముందే రూ.31 వేల కోట్లను రైతు రుణ ఖాతాల్లో వేసి రుణ విముక్తులను చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం డిసెంబరు ఏడో తేదీనే ప్రమాణ స్వీకారంచేసినా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించిన డిసెంబరు 9వ తేదీని పరిగణనలోకి తీసుకొని రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. డిసెంబరు 9న మరో పండుగ ఉందని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ పుట్టిన రోజు డిసెంబరు 9వ తేదీనేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అందుకే 2018 డిసెంబరు 12 నుంచి 2023, డిసెంబరు 9 వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.



**అపోహలు సృష్టించేందుకు యత్నాలు...**

రుణమాఫీకి రేషన్ కార్డు ఉండాలనే అపోహను కొందరు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రేషన్ కార్డు అనేది కేవలం కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమేనన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రాతిపదిక కాదని, రుణమాఫీకి పాస్ బుక్‌నే కొలబద్ద అని ముఖ్యమంత్రి తెలిపారు.భూమి ఉండి, ఆ భూమికి పాసు బుక్ ఉండి, పాసు బుక్‌పై రుణం తీసుకుంటే దానిని మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ విషయంలో కొందరు దొంగలు చేసే దొంగ మాటలను నమ్మొద్దని, దీనిపై అవగాహన కల్పించాలని ఆయన అధికారులు, రైతు వేదికల్లోని రైతులను కోరారు. రుణమాఫీకి సంబంధించి విద్యలేని, సాంకేతిక నైపుణ్యం లేని రైతులెవరికైనా సమస్యలు తలెత్తితే బ్యాంకు అధికారులను సంప్రదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆ సమస్యలు పరిష్కరించి రుణమాఫీ చేయాలని తాము బ్యాంకు అధికారులను కోరామని, అందుకు వారు అంగీకరించారని, అలా అంగీకరించినందుకు బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు ఖాతాల్లోకి రుణమాఫీ సొమ్ము చేరేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు.

**వ్యవసాయ శాఖ మంత్రి స్వయంగా రైతు...**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా మంచి రైతు అని, ఆయన స్వయంగా వ్యవసాయం చేస్తారని, ఏ సమయం వచ్చినా, సందర్భం వచ్చినా రైతు సమస్యలపైనే మాట్లాడుతుంటారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసి రైతు సమస్యలను తెలుసుకున్నారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడినప్పుడు ఏడాదికి రూ.6,500 కోట్ల వడ్డీలు కట్టాల్సి ఉంటే, గత ప్రభుత్వం చేసిన రూ.ఏడు లక్షల కోట్ల అప్పులతో ఇప్పుడు నెలకు రూ.7 వేల కోట్లు వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం జీతాలు సరిగా ఇవ్వలేకపోయిందని, ఆర్థిక ఇబ్బందులున్నా ఎనిమిది నెలల కాలంలోనే రూ.29 వేల కోట్ల విలువైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. రుణమాఫీ చేయలేమంటూ మాకు సవాల్ విసిరిన వారిని రాజీనామా చేయమని తాము అడగమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే తప్పదని సవాళ్లు విసిరిన వారు గుర్తు పెట్టుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**కృతజ్ఞత తీర్మానం...**

రైతు రుణమాఫీ హామీ ఇచ్చి నిలుపుకున్నందున సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే లకు ధన్యవాదాలు తెలుపుదామా అని ముఖ్యమంత్రి రైతు వేదికల్లో ఉన్న రైతులను అడిగారు. అందుకు సమ్మతిస్తూ అంతా చప్పట్లతో ఆమోదం తెలపడంతో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలకు కృతజ్ఞత తీర్మానాన్ని ఆమోదించారు. త్వరలోనే మంత్రివర్గ సహచరులతో కలిసి ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీని వరంగల్ కృతజ్ఞత సభకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన రైతులు....**

రుణమాఫీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు వేదికల వద్ద ఉన్న రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఖమ్మం జిల్లా వి. వెంకటాయపాలెం నుంచి కుతుంబాక సీతారాం, నాగర్ కర్నూల్ జిల్లా రామాపురం నుంచి రాములమ్మ, నల్గొండ జిల్లా నుంచి తిప్పర్తి రాజు, సంగారెడ్డి నుంచి కర్రోళ్ల శివయ్య, నారాయణపేట జిల్లా ధన్వాడ నుంచి కురువ లక్ష్మి, నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి రవి, ఆదిలాబాద్ జిల్లా తాంసీ నుంచి గుర్రి మహేందర్ తదితరులు సీఎంతో మాట్లాడారు.రుణమాఫీ చేసినందుకు సంతోషం వ్యక్తం చేసిన రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

**పది మంది రైతులకు రుణమాఫీ చెక్కుల అందజేత...**

రూ.లక్ష రుణమాఫీ అయిన పది మంది రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలానికి చెందిన మలిపెద్ది చెన్నమ్మ (తొమ్మిదిరేకుల గ్రామం), జర్పుల శంకర్ (చౌలపల్లి), కందుకూరు మండలానికి చెందిన చింతకింది భిక్షపతి (లేమూరు), బండి జగదాంబ (గూడూరు), ఎర్రా అండాలు (ముచ్చెర్ల), క్యాతరమోని మల్లయ్య (పెద్ద ఎల్కచర్లజిల్లేడ్ చౌదరిగూడ మండలం), గౌడుగు చెన్నయ్య (అగిర్యాల కొందుర్గ్ మండలం), మారమోని యాదమ్మ (తుమ్మలూరుమహేశ్వరం మండలం), అరకోటం శారద (ముక్తమదారంకడ్తాల్ మండలం), విట్యాల అండాలు (కృష్ణ నగర్‌ఫరూఖ్ నగర్ మండలం), మల్లిగారి మాణిక్య రెడ్డి (గోపులారంశంకర్‌పల్లి మండలం) రుణమాఫీ చెక్కులు అందుకున్నారు.

# తూచ్.. నేను అలా అనలేదు



**విశ్వంభర, హైదరాబాద్ :** ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 11 లక్షల మంది రైతులను ఋణాలను ఒక్క క్లిక్ తో మాఫీ చేశారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.ఆగస్ట్ నెలాఖరులోపు విడతల వారీగా రుణాలను మాఫీ చేయనున్నారు రేవంత్. అయితే ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా మాజీమంత్రి హరీష్ రావు ని టార్గెట్ చేస్తూ సెటైర్లు పేలుస్తున్నారు కాంగ్రెస్ కార్యకర్తలు. సీఎం రేవంత్ చెప్పినట్లుగా గడువులోగా రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఛాలెంజ్ విసిరిన బీఆర్ఎస్ నేత ఏమయ్యారంటూ కౌంటర్లు పెడుతున్నారు. సవాల్ ప్రకారం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా హరీష్ రావు రాజీనామాకు వేళైంది అంటూ డిఫెన్స్ లో పడేసేందుకు రెడీ అయ్యారు.

**తూచ్.. నేను అలా అనలేదు..**

అయితే దీనిపై హరీష్ రావు క్లారిటీ ఇచ్చారు.తాను కేవలం రుణమాఫీ గురించి మాత్రమే సవాల్ చేయలేదని చెప్పుకొచ్చారు.ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తే రాజీనామా చేస్తానని చెప్పినట్లుగా మాట మార్చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండు లక్షల రుణాలను మాఫీ చేస్తానని రేవంత్ భద్రాద్రి రామయ్య సాక్షిగా హామీ ఇవ్వడంతో.. హరీష్ రైతుల ఓటు బ్యాంక్ చేజారిపోకుండా ఉండేలా రేవంత్ కు సవాల్ చేశారు. ఆగస్ట్ 15 లోపు రేవంత్ రుణమాఫీ చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానంటూ ఛాలెంజ్ చేశారు. రాజీనామాకు సిద్దంగా ఉండు హరీష్ అంటూ అప్పట్లోనే రేవంత్ స్పష్టం చేశారు. అయితే ఇప్పుడు రుణమాఫీ ప్రక్రియ మొదలు కావడంతో రాజీనామాపై తాను అలా అనలేదని నాలుక మడతేశారు.

**మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్**

రైతు రుణమాఫీ విషయంలో గతంలో కేసీఆర్ సర్కార్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. లక్ష రుణమాఫీ కూడా ఏడాదికి 25వేల చొప్పున నాలుగు సార్లు చేస్తామని, వడ్డీతో సంబంధం లేదని కండీషన్లు పెట్టడంతో రైతులంతా తిట్టిపోశారు. కానీ, కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు ఏకకాలంలో మాఫీ చేస్తోంది. అవి రైతుబంధు డబ్బులా, ఇంకోటా అనేది తర్వాత విషయం. రైతును అప్పు నుండి విముక్తి చేయటమే ముఖ్యం. బీఆర్ఎస్ నేతలు అన్నట్లు అవి రైతుబంధు డబ్బులే అనుకున్నా రోడ్లకు, వెంచర్లకు,పెద్ద పెద్ద భూస్వాములకు ఇవ్వము అని రేవంత్ రెడ్డి సర్కార్ ఎప్పుడో స్పష్టం చేసింది. రైతుబంధు కూడా అమలు చేస్తామని మరోవైపు సీఎం చెప్తున్నారు. కేసీఆర్ మాదిరి సాకులు వేతకలేదని క్లారిటీ ఇచ్చారు. ఏదిఏమైనా రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు మాట నిలబెట్టుకుంది. దీనిని అందరూ స్వాగతిస్తున్నారే తప్ప డబ్బులు ఎక్కడి నుంచి తెచ్చారు అని అడగడం లేదు. బీఆర్ఎస్ నేతలు ఇకనైనా మారాలి అని రైతులు అంటున్నారు.

**మీరెలాగూ పారిపోతారని మాకు తెలుసు..**

తెలంగాణలో రైతు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైంది. సీఎం రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ఈ పథకంను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏక కాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసి తీరుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావుపై పరోక్షంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెటైర్లు వేశారు. పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తానని సవాలు విసిరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'సవాలు చేసిన వారిని రాజీనామా చేయమని మేం అడగం. మీరెలాగూ పారిపోతారని మాకు తెలుసు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుంది అని అన్నారు. సోనియా, రాహుల్ గాంధీ మాట ఇస్తే అది శిలాశాసనం. దాన్ని తప్పరు. గాంధీ కుటుంబం రాజకీయ ప్రయోజనాలకోసం మాట ఇవ్వదు' అని ఆయన స్పష్టం చేశారు.

# రైతుబంధు నిధులే దారి మళ్లింపు

**విశ్వంభర, హైదరాబాద్ :** రుణమాఫీ పేరిట మరోసారి రాష్ట్ర రైతులను రేవంత్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. గురువారం ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.రైతుబంధు కింద జూన్ లో ఇవ్వాల్సిన నిధులలోంచే రూ.7000 కోట్లు రుణమాఫీకి దారిమళ్లించారని , హక్కుగా రావాల్సిన రైతుబంధు డబ్బు నుండి కొంతమొత్తం విదిల్చి, రుణమాఫీ చేస్తున్నమని పోజులు కొడుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 40 లక్షల కంటే ఎక్కువ రైతులు లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందినే ఎట్లా ఎంపిక చేస్తారని కేటీఆర్ ప్రశ్నించారు. 2014, 2018లో కేసీఆర్ ప్రభుత్వం రుణమాఫీతో పోలిస్తే పావు వంతు రైతులకే అర్హతనా అంటూ నిలదీశారు. 2014లోనే కేసీఆర్ ప్రభుత్వం లక్షలోపు రుణాలను మాఫీ చేయడానికి రూ.16,144 కోట్లు వెచ్చించి సుమారు 35 లక్షల రైతులకు లబ్ధి చేకూర్చిందని అన్నారు. 2018లో అదే లక్షలోపు రుణమాఫీకి రూ.19,198 కోట్లు అంచనా కాగా మొత్తం లబ్దిదారుల సంఖ్య సుమారు 37 లక్షలు అని తెలిపారు.కాంగ్రెస్ మానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలు అన్ని వెంటనే మాఫీ చేయాలని ,అర్హులందరి రైతులకూ రైతుబంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# వీధి కుక్కల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?



**విశ్వంభర, హైదరాబాద్ :** వీధి కుక్కల దాడి ఘటనపై గురువారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. గతకొంతకాలంగా రాష్ట్రంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. కుక్కలదాడి ఘటనల్లో కొంతమంది చిన్నారులు మృత్యువాత పడగా, అనేకమంది తీవ్రగాయాలపాలైన దాఖలాలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం వీధికుక్కల దాడిలో హైదరాబాద్ జవహర్ నగర్ కి చెందిన సంవత్సరంన్నర బాలుడు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం అయింది. దీనిపై నేడు హైకోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వీధి కుక్కల దాడి ఘటనలను నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అడ్వకేట్ జనరల్ సమాధానమిస్తూ... జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 3.79 లక్షల వీధి కుక్కలు ఉన్నాయని, కుక్కల దాడి ఘటనలు నివారించేందుకు ప్రభుత్వం స్టేట్ లెవెల్ కమిటీలు ఏర్పాటు చేసిందని తెలిపారు. హైదరాబాద్ లో ఆరు కేంద్రాల వద్ద కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నారని, ఒక్కో కేంద్రం వద్ద సుమారు రోజుకు 200 కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నారని కోర్టుకి వెల్లడించారు. అయితే, స్టెరిలైజేషన్ ద్వారా దాడి ఘటనలను ఎలా ఆపుతారని హైకోర్టు మరో ప్రశ్న వేసింది. షెల్టర్ హోమ్స్ కి తరలిస్తే సమస్య పరిష్కారం అవుతుందని యానిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపు న్యాయవాది తెలిపారు. నాగ్ పూర్ లో దాదాపు 90 వేల కుక్కలను షెల్టర్ హోమ్ లో పెట్టినట్టు హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలతో యానిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భేటీ అయ్యి పరిష్కారం చూపాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వచ్చే వాయిదాకు పరిష్కార మార్గాలతో రావాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# అశ్వరావుపేట మండలంలో పోటెత్తిన వరద

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** అశ్వరావుపేట మండలంలో వరద పోటెత్తింది. నారాయణపురం బ్రిడ్జిపై పలువురు చిక్కుకున్నారు. చీకటి పడిపోయి వాతావరణం అనుకూలించకపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. దీంతో ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ బృందాలు రంగంలోకి దిగాయి. బ్రిడ్జిపై చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అశ్వరావు పేట మండలం కట్టమైసమ్మ ఆలయం వద్ద వరదలో చిక్కుకున్న 31 మందిని రెండు హెలికాప్టర్ల సాయంతో రెస్క్యూ టీమ్ బయటకు తీసుకొచ్చింది. మేకలబండ సమీపంలో బ్రిడ్జిపై మరో 9 మంది చిక్కుకుపోయారు. చీకటి పడి వాతావరణం అనుకూలించకపోవడంతో హెలికాప్టర్లు వెనుదిరిగాయి. వారిని కాపాడటానికి ఎయిర్ బోట్లతో ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ బృందాలు రంగంలోకి దిగాయి. 9మందిని సురక్షితంగా బచ్చువారి గూడెం తరలించారు. ఇప్పటివరకు వరదలో చిక్కుకున్న 41 మందిని అధికారులు సురక్షితంగా కాపాడారు.



**ప్రమాదకరంగా పెదవాగు ప్రాజెక్టు**

మరోవైపు పెదవాగు ప్రాజెక్టుకు ప్రమాదకరంగా 69 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ప్రాజెక్ట్ కట్ట ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు కట్ట తెగినట్లయితే ఆంధ్రాలోని వేలేరుపాడు మండలంలో కమ్మరి గూడెం, వసంత వాడ సహా 5 గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉందన్నారు. పరిస్థితిని జిల్లా కలెక్టర్ జితేష్ పటేల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దగ్గరుండి సమీక్షిస్తున్నారు. పెదవాగు ప్రాజెక్టు కట్టపై నుండి వరదనీరు పొంగుతుండటంతో లోతట్టు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పెదవాగు ప్రాజెక్ట్ కట్టలు తెగి వరదనీరు పొంగటంతో..గుమ్మడవల్లి, కొత్తూరు, కోయరం గాపురం, బచ్చువారి గూడెం గ్రామాల ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు అధికారులు.

**పెద్ద వాగు వరద పరిస్థితిపై సి.ఎస్ శాంతి కుమారి టెలీకాన్ఫరెన్స్**

**విశ్వంభరా హైదరాబాద్ :** అశ్వరావుపేట పెద్దవాగుకు గేట్లు ఎత్తడంతో దిగువ భాగంలోని గ్రామాల రైతులు వరద నీటిలో చిక్కుకున్న సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్.పి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో గురువారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సహాయ పునరావాస చర్యలను సమీక్షించారు. డీజిపి జితేందర్, విపత్తుల నిర్వహణ శాఖ డీజీ , నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ లు కూడా పాల్గొన్న ఈ టెలీకాన్ఫరెన్స్ లో సి.ఎస్ మాట్లాడుతూ, ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రాణ నష్టం కలగవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. పెద్ద వాగు కు చెందిన మూడు గేట్లు ఎత్తడంతో సమీపంలోని నాలుగు గ్రామాలలోకి వరద నీరు ఒక్క సారిగా చేరడంతో వ్యవసాయ భూముల్లో నీటిలో చిక్కుకున్న 28 మందిని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ బృందాలు వెంటనే రంగంలోకి దిగి రెండు హెలికాప్టర్ల సహాయంతో రక్షించి సురక్షింత ప్రాంతాలకు తరలిచామని జిల్లా కలెక్టర్ తెలిపారు. మరో 20 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికీ ఎన్డీఆర్ఎఫ్, రాష్ట్ర రెస్క్యూ బృందాలు సహాయ పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్నాయని అన్నారు. గుమ్మడివెల్లి, కోయగూడెం, కొత్తూరు, గాజుల పల్లి గ్రామాల ప్రజలను పునరావాస శిబిరాల్లోకి తరలించే ప్రక్రియ కొనసాగుతుందని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు అత్యంత ప్రధానమని, సహాయ పునరావాస కార్యక్రమాలకు సంబంధించి హైదరాబాద్ నుండి ఏవిధమైన సహాయ సహకారాలు కావాలన్న అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సి.ఎస్ స్పష్టం చేశారు. పరిసర గ్రామాల్లోని చెరువులు, కుంటలు తెగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సి.ఎస్ సూచించారు. భారీ వర్షాలు, వరదల వల్ల సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించామని డీజీపీ జితెందర్ తెలిపారు. భారీ వర్షాల వల్ల ఒక్కసారిగా 40 వేల క్యూసెక్కుల వరద రావడంతో గేట్లు ఎత్తాల్సివచ్చిందని, ప్రస్తుతం వరద తగ్గిందని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా వివరించారు. సిఇ తో పాటు ఇతర సీనియర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుంటున్నారని అన్నారు.

# వారసత్వ అర్చకత్వాన్ని పునరుద్ధరించండి

**డిప్యూటీ సీఎంకు రంగరాజన్ వినతి**

**విశ్వంభర, హైదరాబాద్ :** వారసత్వ అర్చకత్వాన్ని పునరుద్ధరించాలని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. వంశపారంపర్యంగా అర్చకత్వాన్నే నమ్ముకున్నామని, కావున అర్చకుల సమస్యలను తీర్చాలంటూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు గురువారం వినతులు ఇచ్చారు. ఈ మేరకు భద్రాద్రి, వేములవాడ, బాసర వంటి ప్రాచీన దేవాలయాల్లో వారసత్వ అర్చకుల సమస్యలు పెండింగ్ లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వారసత్వ అర్చకత్వానికి సంబంధించి 1996లో డాక్టర్ ఎంవీ సౌందరరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై సుప్రీం కోర్టు సానుకూలంగా స్పందించిన విషయాన్ని గుర్తు చేశారు.వారసత్వ అర్చకత్వానికి తిలోదకాలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలతో పాటు కొన్ని ఆలయాలు మూతపడే ప్రమాదం ఉందని రంగరాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2007లో వారసత్వ





అర్చకత్వాన్ని పునరుద్ధరించాలని చట్టం చేసినప్పటికీ.. 16 ఏళ్లు గడుస్తున్నా తెలంగాణలో ఆ చట్టం అమలు కాలేదని చెప్పారు. ఏపీలో 2019లో GO Ms 439ను విడుదల చేసి వేలాది మంది అర్చకుల కుటుంబాలకు బాసటగా నిలిచిని విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో ఆ చట్టాన్ని అమలు చేయకపోగా దేవాదాయ శాఖ వారసత్వ అర్చకుల బదిలీకి పూనుకోలేదన్నారు. పే స్కేల్ అమలు చేయడమే పరిష్కారం అని చెబుతూ ప్రభుత్వాన్ని కొందరు అధికారులు తప్పదోవ పట్టించి అర్చకులు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను తెరమరుగు చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వివరించారు.




# అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్



**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వ విప్ లు, సీఎస్, డీజీపీ, అధికారులు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించి ముహూర్తం ఫిక్స్ చేశారు. ఇకపోతే ఈ అసెంబ్లీ సమావేశాలకు అయిన గులాబీ బాస్ హాజరవుతారా?లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

**జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన వెలువడే ఛాన్స్**

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్‌పై తీవ్రస్థాయిలో పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జాబ్ క్యాలెండర్ ప్రకటనపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు రైతు భరోసా విధివిధానాల ఖరారు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం జిల్లాల వారీగా పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కమిటీ సేకరించిన వివరాలపై అసెంబ్లీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పూర్తి స్థాయి బడ్జెట్‌ను కూడా అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే జాబ్ క్యాలెండర్‌ను సైతం ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాల నుంచి సమాచారం అందుతుంది.

**ఫిరాయింపులపై నిలదీయాలనే యోచనలో బీఆర్ఎస్**

ఇకపోతే అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతారా అన్న చర్చ జరుగుతుంది. గతంలో కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదు. అనారోగ్యం కారణాలతో కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రాలేదని బీఆర్ఎస్ వెల్లడించింది. అయితే ఈసారి మాత్రం అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారని తెలుస్తోంది. ఇటీవలే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈసారి అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీని గట్టిగా నిలదీసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైతే నిరసనలకు సైతం దిగే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. మరోవైపు జాబ్ క్యాలెండర్, అమలు కానీ గ్యారెంటీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది.

**బీఆర్ఎస్ఎల్పీ విలీనంపై కాంగ్రెస్ ఫోకస్**

ఇదిలా ఉంటే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యే సరికి బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ లాగేసింది. ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తంది. ఇప్పటికే కొంతమంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు సీపీఐ ఒక సీటుతో కలిపి 65 మంది ఎమ్మెల్యేల బలంగా ఉంది. అయితే బీఆర్ఎస్ చేరికలతో ప్రస్తుతం ఆ బలం 76కు చేరింది. పది మంది కాంగ్రెస్ కండువా కప్పుకోగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందిన సంగతి తెలిసిందే.

# రుణమాఫీకి సైబర్ నేరగాళ్ల బెడద

**(మొదటి పేజీ తరువాయి)**

ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని సైబర్ పోలీసులు గుర్తించారు. ఈ సైబర్ నేరగాళ్ల ఫైల్స్ ఆమోదిస్తే మన వాట్స్ యాప్ వాళ్ళ కంట్రోల్ కీ వెళ్లి పోతుందని ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని సైబర్ పోలీసులు గురువారం హెచ్చరికలు జారీ చేశారు. రైతుల వాట్సాప్ నంబర్లే కాకుండా వారి కాంటాక్ట్స్ లో ఉన్న ప్రతి ఒక్కరికి సైబర్ నేరగాళ్ల మెసేజ్ వెళుతుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ నూకల వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. ఈ లింక్ ద్వారా సైబర్ నేరస్థులు గూగుల్ పే, ఫోన్ పే,యూపీఐ నెట్ వర్క్ ద్వారా సైబర్ నేరగాళ్లు డబ్బులు దోచేస్తున్నారు. ట్రేండింగ్ లో ఉన్న టాపిక్ ద్వారా ఏపీకే ఫైల్స్ పంపి సైబర్ నేరగాళ్లు డబ్బులు కొట్టేస్తున్నారు.





**ఏపీకే ఫైల్స్ ఒపెన్ చేయొద్దు : సైబర్ సెక్యూరిటీ బ్యూరో**

ఏపీకే ఫైల్స్ ఒపెన్ చేయొద్దు అని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కోరింది. ఏవైనా ఏపీకే ఫైల్స్ మీకు వాట్సాప్ లో లేదా మెయిల్ లో వస్తే మీరు ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చెయ్యకూడదని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ నూకల వేణుగోపాల్ రెడ్డి సూచించారు. మీ వాట్సాప్ పనిచేయకుంటే వెంటనే రీఇన్ స్టాల్ చేసి రిపోర్టు ఆప్షన్ లో రిపోర్ట్ చేయాలని ఆయన కోరారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే ఎలాంటి ఆలస్యం చెయ్యకుండా #1930 నంబర్‌కు కాల్ చెయ్యండి లేదా www.cybercrime.gov.in లో రిపోర్ట్ చేయాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కోరారు.

**పేట్రేగిపోతున్న సైబర్ స్కామర్లు**

ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల మోసాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా గత సంవత్సరం ఒక ట్రిలియన్ డాలర్ల డబ్బును అమాయక ప్రజలు కోల్పోయారని గ్లోబల్ స్టేట్ స్కాం రిపోర్టు తేటతెల్లం చేసింది. 12 నెలల్లోనే సైబర్ స్కామర్లు ఒక ట్రిలియన్ డాలర్లను కొల్లగొట్టారంటే సైబర్ నేరాలు ఏమేర పెరిగాయో విదితమవుతోంది.

**దేశంలో రూ.1750 కోట్లు స్వాహా**

భారత దేశంలో ఈ ఏడాది మొదటి నాలుగు నెలల కాలంలో సైబర్ నేరగాళ్లు 1750 కోట్ల రూపాయలను కొల్లగొట్టారని తాజాగా వెల్లడైంది. సైబర్ నేరగాళ్లు రోజుకో రకం కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారు. దేశంలో 7.4 లక్షల సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదైనట్లు నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ లో వెల్లడైంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు కేవలం నాలుగు నెలల్లోనే సైబర్ కేసుల సంఖ్య అనూహ్యంగా పెరగడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

**రోజుకు 7వేల సైబర్ నేరాల ఫిర్యాదులు**


దేశంలో రోజుకు 7వేల సైబర్ నేరాల ఫిర్యాదులు రిజిస్టరు అవుతున్నాయని నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ తేటతెల్లం చేసింది. 2021 నుంచి 2023 మధ్య సైబర్ నేరాల పెరుగుదల అనూహ్యంగా పెరిగింది. 2022 నుంచి 2023 మధ్య 60.9 శాతం సైబర్ నేరాలు పెరిగాయి. నమోదైన సైబర్ నేరాల్లో 85 శాతం కేసులు ఆన్ లైన్ ఆర్థిక నేరాలేనని సైబర్ పోలీసులు చెప్పారు. తెలంగాణలోనూ ఇటీవల సైబర్ కేసుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో తెలంగాణ సైబర్ పోలీసులు అప్రమత్తమయ్యారు.



# కైలాసం.. పరమపదసోపానం

## "ప్రాచీనమైన వైకుంఠపాళీ ఆట నేటికీ మన జీవితాలకు ఆదర్శం"

"పాములపటం" అని రకరకాలుగా పిలుస్తారు. చిన్నాపెద్దా, ఆడామగా తేడా లేకుండా అందరూ ఆడుతూ సంతోషించే పాతకాలం సాంప్రదాయకమైన వినోదాత్మక ఆటనే ఈ వైకుంఠపాళి. తెలుగు ప్రాంతంలో దీనిగురించి తెలియనివారు, ఆడని వారు లేరు. కానీ నేటి తరానికి అందడం లేదు. ఈ రోజుల్లో చిన్నారులు మరియు యువత కేవలం ఆన్లైన్ గేమ్స్ తో కాలం గడుపుచున్నారు. వైకుంఠఏకాదశి రోజు రాత్రి జాగారం చేస్తూ ఈ ఆట ఆడడం వల్ల మరియు నియమనిబంధనలు జీవితానికి అనుకూలంగా ఉండడం వల్ల ఈ ఆట చాల కాలం క్రితం ఎంతో ఆదరణకు నోచుకుంది. దీనిలో వినోదం తో పాటు విజ్ఞానం,ఆద్యాత్మికం,తత్వచింతన దాగి ఉండటం వలన ఎవరి వయసుకు మేధాశక్తికి తగ్గట్టు వారు ఆస్వాదించ గలిగేలా ఉండడం వల్ల అంత ప్రసిద్ధి చెందింది.




వైకుంఠపాళి ఆట క్రీ.పూ 2వ శతాబ్దములో నుండి ఈ ఆట భారతదేశములో ఉన్నదని చరిత్రకారులు భావిస్తున్నారు. సాధారణంగా ఇద్దరు మనుషులు నీడపట్టున కూర్చొని ఆడే ఒక సాంప్రదాయపు ఆటగా ప్రసిద్ధి చెందింది.ఈ ఆట ఒక చదరము పై ఆడతారు. ఈ చదరములో సాధారణంగా 10 అడ్డవరుసలు, 10 నిలువువరుసలతో మొత్తం 100 గదులుంటాయి. అయితే కొన్ని రూపాంతరాలలో 8 అడ్డ నిలువు వరసలు, 12 అడ్డ నిలువు వరుసల చదరాలు కూడా ఉంటాయి. చదరంపై చిత్రించబడి ఉన్న పాములు, నిచ్చెనలు అమరిక ప్రతీ చదరాన్ని బట్టి మారుతుంటుంది. పాములు, సోపానాలు నిర్ధిష్టమైన గదులలో ఉండనవసరం లేదు. చదరంలో యొక్క పరిమాణము, చదరంలో పాములు, సోపానాల అమరికపై ఆట యొక్క ముగింపు సమయం ఆధారపడిఉంటుంది.

వైకుంఠపాళీ తెలుగు వారికి ప్రత్యేకమయిన ఆట. వైకుంఠపాళీ పటాన్ని పరమపదసోపానమటమని కూడా వ్యవహరిస్తారు. వైకుంఠపాళీ పటంలో 132 గళ్ళు ఉంటాయి. ఈ గళ్ళు రకరకాలయిన బొమ్మలతో అంకెలు వేసి ఉంటాయి. ఈ గళ్ళకు దిగువన పాములు, ఏనుగులు ఉంటాయి. అది పాతాళమనీ, ఆ ఏనుగులు అష్టదిగ్గజాలనీ పైనున్న అంకెలు ఉన్న గళ్ళ ను భూమి

ని ఆ ఎనిమిది ఏనుగులూ మోస్తున్నాయనీ కొందరు భావిస్తారు.ఆట ప్రారంభములో దేవుడికి దండం పెట్టుకొని ప్రారంభించడం నాటి ఆనవాయితీ.

ఆట ప్రారంభించే ముందు ఆటగాళ్ళు తమ తమ ఆటకాయలను పాతాళంలో ఉంచి పందెం వేస్తూ పందాన్ని బట్టి ఆటకాయలను నడుపుతూ ఉంటారు. ఆరు గవ్వలుగాని లేదా పాచికలుగాని పందెం వేస్తూ ఆడుతారు. ఈ ఆటను ఎందరైనా ఆడవచ్చు. అయితే ఆడే వాళ్ళు మాత్రం ఒక్కొక్కరు ఒక్కొక్క రకం ఆటకాయలను ముందుగా ముందే నిర్ణయించుకోవాలి.

వైకుంఠపాళీ పటంలో 16, 19, 30, 41, 52, 63, 74, 79, 87 సంఖ్యలు గల గళ్ళల్లో నిచ్చెనలు ఉన్నాయి. ఏ పందానికైనా ఆటకాయ ఆయా గళ్ళలోనికి వచ్చినప్పుడు అక్కడ ఉన్న నిచ్చెన సాయంతో పై గడికి చేరుకోవచ్చు. ఉదాహరణకు 16 వ గడిలో ఉన్న నిచ్చెన దగ్గరకు ఆటకాయ వచ్చినప్పుడు ఆ నిచ్చెన సాయంతో 28 వ గడిని చేరుకుంటుంది. అలా చేరుకోవడాన్ని 'నిచ్చెన ఎక్కడం' అంటారు. పుణ్యం చేసిన వారికి పుణ్యం దక్కి నిచ్చెనెక్కడమవుతుందని చెబుతారు. అప్పుడు పై పందెం వేసుకునే అవకాశం ఇస్తారు. పై పందెంవల్ల మళ్ళీ నిచ్చెన ఎక్కినట్లయితే మళ్ళీ మరో పై పందెం ఇలా ఆట కొనసాగుతూ ఉంటుంది.

ఈ పటంలో నిచ్చెనలు ఉన్నట్లుగానే అక్కడక్కడ పాములు కూడా ఉన్నాయి. ఆటకాయ నిచ్చెన పాదం దగ్గరికి వచ్చినప్పుడు పైకి వెళ్ళినట్లే పాము తల దగ్గరికి ఆటకాయ వచ్చినప్పుడు పాము కరిచి/మింగి ఆటకాయ పాము తోక చివరి వరకూ కిందికి దిగిపోతుంది. కాగా 26 వ గడిలో ఉన్నది పాము కరచినప్పుడు దాని తోక ఉన్న 3వ గడికి వచ్చి అక్కడ ఉన్న చిన్న పాము మూలంగా ఆటకాయ పాతాళం చేరుకుంటుంది. ఇట్లు పాముతోక దగ్గరకు రావడాన్ని 'పాము మింగడం' అంటారు. ఇక 106వ గదిలో ఉన్న పెద్ద పాము మింగిందంటే ఆటకాయ ఒకేసారి 1వ గడిని చేరుకుంటుంది. చివరకు 121 గడిలో ఉన్న పామును తప్పించుకుని 122వ గడికి ఆటకాయ చేరుకున్నట్లయితే పుణ్యపథంలో పడ్డట్టే. అలా, ఆ తరువాతనున్న 132వ గడిని దాటి పైనున్న స్వర్గధామన్ని ఆటకాయ చేరుకుంటుంది. అక్కడినుండి చివరివరకూ వెళ్ళి తిరుగుముఖం పట్టి మధ్యనున్న విరాట్ స్వరూపాన్ని చేరుకోవాలి. తిరుగు ముఖం పట్టి, వచ్చేటప్పుడు ఏ పందెంలో సరిగ్గా విరాట్ స్వరూపాన్ని చేరుతుందో ఆ పందెం పడినప్పుడే ఆటకాయ పండినట్లు చెప్పవచ్చును. అంతవరకూ ఆ వరుసలో ముందరికీ వెనుకకూ ఆటకాయను నడుపుతూ ఉండాలి. విరాట్ రూపానికి ఆ వైపూ ఈ వైపూ ఉన్న బొమ్మల్ని ద్వారపాలకులనీ, వారు విరాట్ దర్శనం కాకుండా అడ్డగిస్తూ ఉంటారనీ, అందువల్ల వాళ్ళ చుట్టూ తిరిగిన తర్వాతనే ఆఖరికి విరాట్ దర్శనం అవుతుందని ఆనాటి ప్రజల నమ్మకం.అయితే నేడు ఇదే ఆటను కొద్దిగా మార్చుతూ మన జీవన శైలికి అనుకూలంగా పెర్లను పెడుతూ పౌష్టికాహారం తీసుకుంటే కలిగే లాభాలను సూచిస్తూ,పండ్లు కూరగాయలు తినవలేనని,న్యాయంగా ఉండవలెనని విధంగా బొమ్మలతో కూడిన చదరాలు విద్యార్థులకు ఉపయోగిస్తున్నారు. అంతే కాక కుడికాలు,తీసివేతలు, గుణకారాలు బాగహారలు నేర్పించడం కోసం ఈ ఆటను మార్పు చేసి చిన్నారులకు అందిస్తున్నారు.ఏది ఏమైనా ప్రాచీన ఆటలు మన జీవితాలకు ఆదర్శం అనేది మరువ లేనిది.



-గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282
raghupatiraog@gmail.com

# అజరామరాలు.. చందమామ శంకర్ చిత్రాలు

## నేడు చందమామ భేతాళ కథల చిత్రకారుడు శంకర్ జయంతి



మన తెలుగు సంస్కృతికి ప్రతీక, భారతీయ సనాతన సంప్రదాయానికి పతాక, చక్రపాణి మానస పుత్రిక బీ నాగిరెడ్డి పిల్లల పత్రిక.. చందమామ. దాదాపు ఆరున్నర దశాబ్దాల క్రితం, 1947 జూలై నెలలో తొలిసారిగా 'చందమామ' ఆవిష్కృతం అయింది. సరళమైన భాష, చక్కటి శైలి, చిన్న చిన్న పదాలు అర్థవంతమైన భాష, ఆకర్షణీయ మైన బొమ్మలు. చందమామ అనిర్వచనీయ కథలన్నీ ఆ బాల గోపాలాన్నా మరో ప్రపంచానికి తీసుకెళ్ళే వశీకరణ రూపాలే. చందమామ గురించి కవిసమ్రాట్, 'చందమామ నా చేత కూడా చదివిస్తున్నారు. పత్రిక రావడం ఆలస్యమైతే కొట్టువాడితో దెబ్బలాడతా' అని ఒక సందర్భంలో అన్నారంటే చందమామ ఎంత ప్రసిద్ధి పొందిందో, పిల్లల పెద్దల మనసులో ఎంత స్థానం సంపాదించుకుందో అర్థం చేసుకోవచ్చు.

చందమామతో ప్రత్యేక సంబంధం అనుబంధం కలిగిన అసమాన చిత్రకారుడు శంకర్. చందమామ తాతయ్యగా గుర్తింపు పొందిన శంకర్ పేరు తీయగానే గుర్తొచ్చేవి భేతాళ కథలు. ప్రతినెలా శవంలోకి బేతాళుడు ప్రవేశించి కథచెప్పి, ప్రశ్నలడిగి, హెచ్చరించి, విక్రమార్కుడికి మౌనభంగం చేసి, అతను వచ్చిన పని కాకుండా చేసేవాడు. బాలల పత్రిక చందమామలో చిత్రకారునిగా "విక్రం, భేతాళ" కథలలో చిత్రాలు వేయడం ద్వారా శంకర్ గుర్తించ బడ్డారు. ఆయన చిత్రాలలో "శంకర్" అనే సంతకం ఉంటుంది. ఆయన వేసిన బొమ్మలు అన్నీ ఒక ఎత్తు, బేతాళ కథలకు శీర్షిక బొమ్మగా వేసిన బొమ్మ ఒక ఎత్తు. బేతాళ కథలకు ప్రత్యేక శీర్షిక బొమ్మగా విక్రమార్కుడు చేతిలో కరవాలం భుజాన శవాన్ని మోసుకుంటూ వెడుతూ ఉంటే, శవంలోని బేతాళుడు కథ చెప్పటం ఆయన వేసిన బొమ్మ ప్రపంచ ప్రసిద్ధి పొందింది. తెలుగు పత్రికా చరిత్రలో అతి ఎక్కువకాలం ధారావాహికగా కొనసాగిన శీర్షిక చందమామలో బేతాళ కథలే. చందమామలో చివరివరకూ ఆయన వేసిన బేతాళ బొమ్మనే కొనసాగించారు.

చందమామ పత్రికతో 60ఏళ్లకు పైగా మమేకమై, మొట్ట మొదట పనిచేసిన చిత్రకారులైన వడ్డాది పాపయ్య, తోడా వీర రాఘవన్ (చిత్రా) లతో పాటు కలిసి పని చేశారు.1955లో చక్రపాణి, కుటుంబరావు తెలుగులో బేతాళ కథలకు అప్పటివరకు వస్తున్నవాటిని మార్చి కొద్దిగా మార్పులు చేర్పులు చేసి బొమ్మలు గీయమని సూచించగా, 2012 చివరి వరకు ఆయన చిత్రాలు గీస్తూనే వచ్చారు. చందమామలో శంకర్ బొమ్మలు వాటిని అనుసరించిన పిల్లలకు పౌరాణిక పాత్రలు ఇలా ఉంటాయని చెరగని ముద్రలు వేసిన గొప్పదనం శంకర్ కే దక్కింది. చందమామలో వచ్చిన రామాయణం, మహా భారతం సీరియల్స్‌కి వేసిన బొమ్మలతో పౌరాణిక పాత్రలకు దివ్యత్వం కలిగించిన గొప్ప ఆర్టిస్టు శంకర్. పురాణాల పాత్రలను పిల్లలకే కాదు పెద్దలకు కూడా కళ్ళకు కట్టిన ఘనత ఆయనది.

సుపరిచితుడైన చిత్రకారుడైన కరతొలువు చంద్రశేఖరన్ శివ శంకరన్ (కె.సి.శివశంకరన్) "శంకర్" గా 1924 జూలై 19న తమిళనాడు లోని ఈరోడ్ సమీపంలోని గ్రామంలో జన్మించారు. శంకర్ తన బాల్యం నుండే కళ పట్ల మక్కువ పెంచుకున్నారు. తన చరిత్ర పరీక్షలలో అతను చారిత్రక పాత్రల చిత్రాలను గీసేవారు. నాగిరెడ్డి కూడా చదువుకుంటున్న కుతియాల్ పేట్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాద్యాయుడు శంకర్ లోని ప్రతిభను గుర్తించారు. ఆదివారాలలో అతని వద్దకు వచ్చేటట్లు చేసారు. అక్కడ శంకర్ ఇతర విద్యార్థులు గీచిన చిత్రాలను సదిదిద్దడం ద్వారా తన డ్రాయింగ్ ఉపాధ్యాయునికి సహాయం చేస్తూ అందుకు బదులుగా చిత్రలేఖనానికి ఆవసరమైన సామాగ్రి అయిన డ్రాయింగ్ పుస్తకాలు, పెన్సిల్స్, ఎరేజర్లను సంపాదించారు.1946లో తమిళ పత్రిక కలైమగై లో చిత్రకారునిగా నెలకు 85 రూపాయల వేతనంతో చేరారు. 1952 లో అతని సంపాదన 150 రూపాయలు. తన పెద్ద కుటుంబానికి పోషించడానికి సరిపోని స్థితిలో ఆయన మరొక 150 సంపాదించడానికి ఇతర పత్రికలను ఆశ్రయించారు. ఆ సంవత్సరం నాగిరెడ్డి చందమామ పత్రికలో చిత్రకారునిగా 350 రూపాయల నెల జీతంతో నియమించారు. కానీ రికార్డులలో వేతనం 300 మాత్రమే చూపించేవారు. ఎందుకంటే అప్పటికే పనిచేస్తున్న ప్రధాన చిత్రకారుడు చిత్రాకు కూడా జీతం 350 రూపాయలు. చిత్రా, శంకర్ లు ప్రత్యర్థులుగా వృత్తిజీవితంలో ఉన్నా, 1978లో చిత్రా మరణించే వరకు మంచి స్నేహితులుగా ఉన్నారు. నాగిరెడ్డి ఒక సందర్భంలో చిత్రా, నాగిరెడ్డి చందమామ పత్రికకు రెండు ఎద్దులు. రెండూ లేకుండా ఎద్దుల బండి గ్రామానికి చేరుకోలేదు అని వ్యాఖ్యానించారు. చందమామ పత్రికలో శంకర తో పాటు రాజి, వడ్డాది పాపయ్య కూడా కలిసి పని చేశారు. శంకర్ 2020, సెప్టెంబరు 29న చెన్నై సమీపంలోని పోరూర్ లోని స్వగృహంలో మరణించారు.




-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# ఫిరాయింపుల నిరోధక చట్టం-1985ను

# కఠిన తరం చేయాలి

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకొని ప్రజా మన్ననలు పొందుతూ మెజార్టీ సీట్లు పొందినవారే ప్రభుత్వం ఏర్పాటుకు రాజ్యాంగం కల్పించిన హక్కు. రాజకీయ పార్టీలు విలువలకు, నిబద్ధతకు కట్టుబడి ఉండేవి. స్వాతంత్ర పోరాటాల కాలం నుంచి 1967 వరకు పార్టీలు, ప్రభుత్వాలు కొంత వరకు నిబద్ధతకు కట్టబడి ఉంటూ పాలన అందించేందుకు కృషి చేసిన దాఖలాలు చూశాం.1967 ఎన్నికల తర్వాత రాజకీయాలు రాను రాను కలుషితమై నేరపూరితమైపోయాయని ప్రజాస్వామికవాదులు ఆందోళన వెలిబుచ్చున్నారు. ఎన్నికైన సభ్యులలో " ఆయారాం గాయారాం " సంస్కృతి ఉధృతంగా సాగింది. ప్రొద్దున ఒక పార్టీలో ఉంటే మధ్యాహ్నానికి మరొక పార్టీలో చేరి సాయంత్రానికి తిరిగి గూటికి చేరిన ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. హర్యానా, పంజాబ్, యూపీ బీహార్ తదితర రాష్ట్రాలలో 1984 వరకు రాజకీయ ఫిరాయింపులు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో 1985 లో రాజ్యాంగంలోని 10 వ షెడ్యూల్డు ప్రకారం "రాకీయ ఫిరాయింపుల నిరోధక చట్టము "తీసుకురావడం జరిగింది.



వలసలు నివారించలేని ఫిరాయింపుల చట్టం:

ఈ చట్టం వలన పార్టీ గుర్తులతో గెలిచి ఇస్టాను సారంగా పార్టీ మారడం కొంతమేరకు తగ్గింది. ఈ చట్టం రాకీయ పార్టీల నుంచి ఫిరాయింపులు కట్టడి చేయాటానికి, ఎన్నికైన ప్రభుత్వాలను తరచుగా అస్థిరతకు గురిచేయకుండా, ఫిరాయింపులను ప్రోత్సహించకుండా, ప్రజాస్వామ్య విలువలను, పరిరక్షించడానికి ఈ చట్టాన్న రూపొందించడం జరిగింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 101, 102,190,191లు కూడా పార్టీ ఫిరాయింపుల గురించి తెలుపుతాయి. ఈ చట్టం వచ్చి నాలుగు దశబ్దాలు చేరువవు తున్నప్పటికీ ఫిరాయింపులు భారత ప్రభుత్వ ప్రజాస్వామ్యాన్ని కుదిపివేస్తున్నాయి. కానీ ఎన్నికైన సభ్యులు మూడింట ఒక వంతు పార్టీ మారి ఒక గ్రూప్గా ఉంటే ఈ చట్టం వర్తించదని వెలుసుబాటు కల్పించారు. 2003 లో కేంద్ర ప్రభుత్వం 91వ రాజ్యాంగ సవరణ ద్వారా మరి కొన్ని సవరణలు తీసుకొచ్చి 2004 నుంచి ఈ చట్టం అమలులోనికి వచ్చింది. శాసనసబాధిపతులు పార్టీ ఫిరాయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నప్పటికీ.. ఈ చట్టం అమలు పరచడం లేదని సుప్రీంకోర్టుకు వెళితే ఫిర్యాదు అందిన మూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని శాసనసభాపతులకు ఆదేశించింది. అదేవిధంగా ఒక రాజకీయ పార్టీ మరొక రాజకీయ పార్టీలో విలీనమైనప్పుడు ఆ పార్టీకి చెందిన సభ్యుల్లో మూడులో రెండవ వంతు(2/3) గ్రూపుగా ఏర్పడి విలీనానికి అంగీకరించాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అలయన్స్‌లో గెలిచిన 26 మంది టీఆర్ఎస్ సభ్యులలో కేసీఆర్‌ను దిక్కరించి 10 మంది సభ్యులు కాంగ్రెస్‌లో చేరకుండా ఫిరాయింపుల చట్టంలో ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకొని ఒక గ్రూపుగా ఏర్పడి అసెంబ్లీలో కొనసాగారు.

తెలంగాణలో రాజకీయ ఫిరాయింపులకు ఆద్యుడు కేసీఆర్

తెలంగాణ విషయానికి వస్తే ఉద్యమ పార్టీ టీఆరెస్ 2014 ఎన్నికల్లో 63 స్థానాలు పొంది అధికారంలోకి వచ్చి.. రాజకీయ నైతిక విలువలకు పార్టీలు రాయింపులకు ప్రోత్సహించి.. ఆనాడు ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ, సీపీఐల నుంచి ఎన్నికైన 35 మంది సభ్యులను దఫా దఫాలుగా ధనరాజకీయాలకు, పదవులకు ప్రలోభ పెట్టి ఫిరాయింపులకు ప్రత్సహించి టీఆర్ఎస్‌లో చేర్చుకొని నలుగురికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ లేకుండా చేయగలిగినారు.. దీనిపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని స్పీకరును కోరినప్పటికీ, అధికార పార్టీకి చెందిన స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేసినారు. తిరిగి 2018 ఎన్నికల్లో 84 స్థానాల మెజార్టీతో ఉన్నప్పటికీ ఆనాటి 19 మంది కాంగ్రెస్ సభ్యులలో మూడులో రెండవవంతు 12 మంది సభ్యులను టిఆర్ఎస్ లో చేర్చుకొని ముగ్గురికి మంత్రి పదవులు కట్టబెట్టారు. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష పార్టీ గుర్తింపు లేకుండా చేసినారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీని రెండుసార్లు ఘన విజయాలు సాధించినప్పటికీ తెలంగాణ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తారనికోలేదు. తెలంగాణకు ఫిరాయింపుల అంటురోగం అంటిస్తాడనుకోలేదు. 10 ఏండ్ల లో 61 మంది ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను లాగేసుకొని అవినీతి, రాజకీయాలకు తెర లేపాడు. ప్రజా క్షేత్రంలో ప్రజల మన్ననలను పొందడంలో సఫలీకృతం కాలేకపోయింది. పార్టీ ఫిరాయింపులద్వారా ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు రాజకీయాలకు తెరలేపారు. ఇవాళ్ళ వారే తన పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై అంగలారస్తుంటే.. ప్రజలు నవ్వుకునే పరిస్థితి.

బీఆరెస్ బాటనే ప్రస్తుత కాంగ్రెస్ అనుసరిస్తుంది

2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 64 స్థానాలు పొంది తగిన మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ.. 39 స్థానాల్లో విజయం సాధించిన బీఆర్ఎస్, 8 స్థానాలు పొందిన బీజేపీ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మూడు మాసాలు, ఆరు మాసాల కంటే అధికారంలో ఉండదని శాపనార్థాలు పెడుతుంటే.. కాంగ్రెస్ పార్టీ గతంలో బీఆర్ఎస్ అనుసరించిన రాజకీయ వ్యూహంనే చేపడుతు ఆ పార్టీ నుంచి ఫిరాయింపులకు ప్రోత్సహిస్తుంది. జూన్ జూలై నెలలో పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెసులో చేరడం.. అసెంబ్లీ సమావేశాల వరకు ఇంకా కొంతమంది చేసుకునే విధంగా పావులు కదుపుతున్నారు. దీంతో బీఆర్ఎస్‌లో అలజడి.. మాపార్టీ మారిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ను కోరడంతో పాటు, సుప్రీంకోర్టును ఆశ్రయిస్థామని ప్రకటిస్తున్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి :

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన మెజార్టీ రాజకీయ పార్టీల ప్రతినిధులే అధికారం చేపడుతున్నారు. అందుకోసం ప్రజలలో రాజకీయ చైతన్యం కల్పించి, నైతిక విలువలను కలిగిన వారిని, నీతి, నిజాయితీపరులుగా ప్రజల కోసం ప్రజల మధ్య ఉండి ప్రజల సేవ చేసేవారిని ఆదరించి ప్రజా ప్రతినిధులుగాఎన్నుకోవాలి. పార్టీలు ఫిరాయించే, రాజకీయ అవినీతిపరులను వెలివేయాలి. రాజకీయ ఫిరాయింపుల నిరోధక చట్టానికి మరిన్ని సవరణలు తీసుక రావాలి, కఠిన తరం చేయాలి..ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలి.



- ఉజ్జిని రత్నాకర్ రావు
సెల్ :9490952646
ఏఐటీయుసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి



# మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ డ్రగ్స్ కు బానిస అవడం వలన కలిగే ప్రమాదాలు మరియు డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, డ్రగ్స్ తీసుకున్నవారు చేసే చెడు ప్రవర్తన గురించి అవగాహన కల్పించారు. మారుతున్న టెక్నాలజీ ప్రకారం పిల్లలు చేసే నేరాలు, నైతిక విలువలు, విద్యార్థి దశలో క్రమశిక్షణ, చట్టం గురించి అవగాహన, సైబర్ నేరాల గురించి, కుటుంబ బాధ్యత గురించి, మరియు భవిష్యత్తులో క్రమశిక్షణతో చదివితే వచ్చే ఉద్యోగుల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వరప్రసాద్, కానిస్టేబుళ్లు, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దరఖాస్తులలో తప్పుల సవరణకు అవకాశం




**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల్లో జరిగిన తప్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీవో సి.సుజాత తెలిపారు. జనవరి మాసంలో ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం విధితమే. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కల్పించిన ప్రజా పాలన కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఆరు గ్యారంటీలకు సంబంధించిన అర్జీలను ప్రజల నుంచి అధికారులు తీసుకున్నారు. అయితే దరఖాస్తు ఫారాలను పూరించడంలో పలు తప్పులు జరిగాయని లబ్ధిదారులు తెలియజేశారు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడం కొరకు ప్రస్తుతం గృహజ్యోతి పథకం, ఎల్పీజీ రూ.500 సబ్సిడీ మంజూరు కావడం కొరకు దరఖాస్తులు సక్రమంగా పూరించని కారణంగా ఈ యొక్క పథకాలు ప్రజలకు అందడంలేదు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దరఖాస్తుల సవరణలకు ఒక అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా మండల పరిషత్, కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేశామని మండల ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని వినిగించుకోవాలని ఆమె ప్రజలకు తెలియజేశారు.

### రైతు నేస్తం రైతు రుణ మాఫీ

# నిధుల విడుదల

### సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్




**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ 2024 నిధుల విడుదల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం రైతు వేదిక ఎదుట సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఎన్ బిక్షంరెడ్డి, తహసీల్దార్ లాల్ బహదూర్, ఏఓ, తాజా మాజీ జడ్పీటీసీ పున్న లక్ష్మీ జగన్మోహన్, తాజా మాజీ ఎంపీపీ పూస బాలమణి బాలనర్సింహ, తాజా మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు, వివిధ పార్టీల సీనియర్ నాయకులు గంగుల రాజిరెడ్డి, మేక అశోక్ రెడ్డి, తాళ్ళపేల్లి సత్తిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు,రైతులు పాల్గొన్నారు.

## విరిగిన బారికేడ్లు, స్ట్రీట్ లైట్ అమర్చరేమి

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణ చౌరస్తాలో బస్టాండ్ ఎదురుగా ఉన్న బారికేడ్లు, స్ట్రీట్ లైట్ విరిగిపోయి రెండు నెలలైనా ఇంకా అమర్చలేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రింద జరిగిన ఒక ప్రమాదంలో బస్సు భారీకేడ్లను ఢీకొనడంతో రెండు బారికేడ్లు విరిగిపోయి. స్ట్రీట్ లైట్ స్తంభంతో సహా కింద పడిపోయాయి అధికారులు బారికేడ్లు తొలగించి స్ట్రీట్ లైట్ స్తంభాన్ని పడుకోబెట్టారు కానీ కొత్తవి అమర్చడం మాత్రం మర్చిపోయారు నిత్యం వేలమంది నడిచే రహదారిలో ప్రమాదాలు జరుగుతున్న చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఇప్పటికే జాతీయ రహదారి రోడ్డు పై సిగ్నల్ వ్యవస్థ పని చేయకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చౌరస్తాలో మరియు పోస్ట్ ఆఫీస్ దగ్గర సిగ్నల్ లైటింగ్ వ్యవస్థ లేని కారణంగా గురువారం ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారని ఇప్పటికైనా బారికేడ్లు మరియు సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పట్టణ వాహనదారులు అధికారులను కోరుతున్నారు.




### మన దేశంలో...

# నిమిషానికి 3 బాల్య వివాహాలు

**విశ్వంభర, ఢిల్లీ :** మనిషి ఆధునిక కాలంలో జీవిస్తున్నాడు. ఆకాశాన్ని తరచి చూస్తున్నాడు.. జాబిలమ్మ మీద అడుగు పెట్టాడు.. సముద్రం లోతులు కొలుస్తున్నాడు. అయినప్పటికీ కొన్ని మూఢాచారాలను నేటికీ కొనసాగిస్తున్నాడు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. ఎన్ని కొత్త చట్టాలను తీసుకోస్తున్నా తాము నమ్మిన దానిని కొంతమంది అమలు చేయడంలో ఎటువంటి వెనకడుగు వేయడం లేదు. అలాంటి మూఢాచారాల్లో ఒకటి బాల్య వివాహం. మన దేశంలో ప్రతి నిమిషానికి ముగ్గురు ఆడపిల్లలకు బలవంతంగా పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. దేశంలో జరిగే బాల్య వివాహాల గురించి దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బలవంతపు పెళ్ళిళ్ళ విషయంలో 2022 లెక్కల దేశవ్యాప్తంగా రోజుకు మూడు కేసులు మాత్రమే నమోదవుతున్నాయి. అయితే వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉందని కొత్త అధ్యయనం ద్వారా తెలుస్తోంది. పౌర సమాజ సంస్థల 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా' నెట్‌వర్క్‌లో భాగమైన 'ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్' రీసెర్చ్ టీమ్ చేసిన కొత్త అధ్యయనంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB), నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే5 (201921) డేటాను విశ్లేషించి ఈ నివేదికను తయారు చేసింది. ఈ నివేదిక ప్రకారం 2018 నుంచి 2022 మధ్య సంవత్సరాల్లో 3,863 బాల్య వివాహాలు జరిగినట్లు NCRB నమోదు చేసింది. అయితే ఈ అధ్యయనం ఎత్తి చూపినట్లుగా.. జనాభా లెక్కల అంచనాల ప్రకారం చూస్తే ప్రతి సంవత్సరం 16 లక్షల బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

**ఒక కేస్ స్టడీ అస్సాం**

అయితే గత 3 సంవత్సరాలలో ఈ బాల్య వివాహాలు జరగడంలో తగ్గుదల కనిపిస్తోంది. 81% తగ్గుదలని చూపిస్తోంది. బాల్య వివాహాలను అరికట్టడంలో అస్సాం ఒక కేస్ స్టడీగా NCRB సంస్థ ఎన్నుకుంది. NFHS5 అంచనాల ప్రకారం ప్రస్తుతం 20 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల స్త్రీలలో 23.3% స్త్రీలు 18 సంవత్సరాల వయసు కంటే ముందే వివాహం చేసుకున్నారు. NFHS నివేదిక ప్రకారం, 202122 మరియు 202324 మధ్య అస్సాం రాష్ట్రంలోని 20 జిల్లాల్లోని 1,132 గ్రామాల్లో బాల్య వివాహాలు 81% మేర తగ్గాయి.

202120 22 ఏడాదిలో బాల్య వివాహాలకు సంబంధించిన కేసులు 3,225 నమోదు కాగా.. 2023 - 2024లో ఈ బాల్య వివాహాల సంఖ్య 627లుగా నమోదయింది. గత ఏడాది బాల్య వివాహం జరిపించిన నేరానికి సంబంధించి 3,000 మందికి పైగా అరెస్ట్ అయ్యారు. ఈ గ్రామాలలో నిర్వహించిన ఒక సర్వేలో 98% మంది ప్రజలు బాల్య వివాహాల సంఖ్య తగ్గుముఖం పట్టడానికి ముఖ్య కారణం రాష్ట్రంలోని కఠినమైన చట్టాల అమలు చేయడం అని అభిప్రాయపడ్డారు.

**బాల్య వివాహాలపై ఎప్పటి నుంచి నిషేధం అంటే..**

భారతదేశంలో బాల్య వివాహాలు మొదటిసారిగా 1929లో నిషేధించబడ్డాయి. అనేక సందర్భాల్లో ఈ చట్టం మరింత మెరుగు పడుతూ వచ్చింది. అయినప్పటికీ ఈ డేటా ఆధారంగా చూస్తే నేటికీ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ఇది జాతీయ అవమానంగా కొంతమంది భావించడమే కాదు.. తీవ్ర ఆందోళనను కూడా వ్యక్తం చేస్తున్నారు. బాల్య వివాహాలను అరికట్టడం వలన మాతాశిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. అంతేకాదు మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం, లింగ సమానత్వాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. బాల్య వివాహాల నిషేధ చట్టం 2006ను సవరించేందుకు ఉద్దేశించిన 2021 బిల్లును మళ్ళీ కొత్తగా చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే దీనిని వాస్తవ దృష్టితో చూస్తే.. నిజం ఏమిటంటే సామాజిక అనుమతి లేకుండా ఎటువంటి చట్టాలు మనుగడ సాగించలేవు. అందుకే ప్రజలకు అవగాన కలిగేలా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు బాల్య వివాహాలను అరికట్టే మిషన్‌లో పనిచేయాలి.

దేశంలో వివిధ ప్రాంతాల్లో బాల్య వివాహాలకు గల కారణాలు భిన్నంగా ఉన్నాయి. అదే విధంగా కేసు విచారణ విషయంలో కూడా కోర్టు పని తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. 2022లో బాల్య వివాహాల నిషేధ చట్టం కింద కోర్టుల్లో విచారణ కోసం మొత్తం 3,563 కేసులు కోర్టు మెట్లు ఎక్కాగా.. వీటిల్లో కేవలం 181 కేసుల విచారణను మాత్రమే కోర్టు విజయవంతంగా పూర్తి చేసింది. అంటే కేసు పెండెన్సీ రేటు 92% ఉండగా నేరారోపణ రేటు 11%. ఉంది. వివిధ NGO సంస్థలు బాల్య వివాహాల డేటాను విశ్లేషిస్తూ "బాల్య వివాహాలలో ఎక్కువ భాగం ఆడపిల్లల దుర్బలత్వాన్ని ఉపయోగించుకునే సందర్భాలు ఎక్కువ అని చెప్పాయి. అంతేకాదు వృద్ధులు తమ అధికారాన్ని అమ్మాయిల దుర్బలత్వాన్ని ఉపయోగించుకుంటున్నారని వెల్లడించాయి.



### బ్యాంకర్లు నిబంధనలు పాటించాలి

# రైతు ఇబ్బందులు పడకుండా చూడాలి

- జిల్లాలో 35,686 రైతు కుటుంబాలకు రుణమాఫీ కింద 194.64 కోట్లు జమ
- రుణమాఫీ అంశంపై బ్యాంకర్లతో సమన్వయ సమావేశం కలెక్టర్ పమేలా సత్పతి






**విశ్వంభర, కరీంనగర్ :** రైతు రుణమాఫీ అంశంలో బ్యాంకర్లు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కరీంనగర్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో రైతు రుణమాఫీ అంశంపై బ్యాంకర్లతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతు రుణమాఫీకి సంబంధించిన అంశాలపై బ్యాంకర్లతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో 35,686 రైతు కుటుంబాలకు సంబంధించిన 37,745 బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం 194.64 కోట్లు జమ చేయనుందని తెలిపారు. రేషన్ కార్డును కేవలం రైతు కుటుంబాల గుర్తింపు కోసమే ప్రభుత్వం తీసుకుంటున్నదని చెప్పారు. రైతు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని రైతు రుణమాఫీని వర్తింపజేస్తుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బ్యాంకర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా బ్యాంకుల్లో రైతుల అనుమానాలను నివృత్తి చేసేందుకు ఎంక్వయిరీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రైతులతో మర్యాదగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా సిబ్బంది సమాధానాలు ఇవ్వవద్దని సూచించారు. లేనిపోని అపోహలు సృష్టించేలా వ్యవహరించవద్దని పేర్కొన్నారు. కలెక్టరేట్లో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాల యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రుణమాఫీపై రైతుల అనుమానాలను వృత్తి కల్పించేందుకు, సూచనలు, సలహాలు అందించేందుకు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ అధికారులు సైతం రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు సలహాలు అందించాలని చెప్పారు. రైతుల రద్దీ ఏర్పడనున్న దృష్ట్యా బ్యాంకుల్లో తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎల్డీఎం ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి బత్తుల శ్రీనివాస్, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణ రావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పొట్ట కొట్టొద్దు

- పోలీస్ బెటాలియన్‌కు వేరే భూములు కేటాయించాలి
- ధర్నాలో అఖిలపక్ష




**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని 255 సర్వేనెంబర్ భూములను పోలీస్ బెటాలియన్‌కు కేటాయించవద్దని భూ బాధితులు, అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. గురువారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట భూ బాధితులు ధర్నా చేసి తహసిల్దారు కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్ నేతలు పాల్గొని మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా 130 కుటుంబాలకు చెందిన పేదలు 255 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేస్తూ.. పశువులు గొర్రెలు, మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు కొందరికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని, మరికొందరికి ఇవ్వలేదని ఆరోపించారు. పాసుబుక్కుల కోసమే ఈ భూమిని అధికారులు పలుమార్లు సర్వే చేయించారన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న ఈ భూములను ఇటీవల ప్రభుత్వం పోలీస్ బెటాలియన్‌కు ఇవ్వడానికి సిద్ధం అవుతోందని ఆరోపించారు. ఇప్పటికే పలుమార్లు పోలీస్ అధికారులు ఈ ప్రాంతాన్ని పర్యటించి రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు సేకరించారని తెలిపారు. పోలీస్ బెటాలియన్ ఏర్పాటుకు ఎవరు కూడా వ్యతిరేకం కాదని, కానీ ఈ ప్రాంతంలో కాకుండా రాచకొండ కాని, ఇతర ప్రాంతాలలో కానీ ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా పేదల వైపు నిలబడాలని, పోలీస్ బెటాలియన్ ను ఇతర ప్రాంతాలకు మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో పాటు అఖిలపక్షం నాయకులు పోరాటాలకు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు కే శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, పట్టణ కార్యదర్శి చిలువేరు అంజయ్య, సిపిఎం జిల్లా నాయకుడు గుంటూరు శ్రీనివాసచారి, మండల కార్యదర్శి దూడ యాది రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్రి నరసింహ, గ్రామ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం, ఎడ్ల సత్తయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు వలిగొండ యాదయ్య, భూ బాధితులు మెగావత్ నరసింహ నాయక్, నేనావత్ లక్ష్మణ్, చిలువేరు పెంటయ్య, చిలువేరు నరసింహ, చెలివేరు నారాయణ, చెలివేరు సత్తయ్య, ఉబ్బు రాములు, నేనా వత్ రవి, చిలువేరు కృష్ణయ్య, చిలువేరు రాములు, బొమ్మగోని రమేష్, జంగయ్య ,వెంకటేశం, ముత్యాలు, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఏకకాలంలో రుణమాఫీ.. దేశ చరిత్రలోనే మొదటిసారి

### 70 లక్షల మంది రైతు లకు మేలు

### టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్

**విశ్వంభర, హైదరాబాద్ :** ఏకకాలంలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ దేశ చరిత్రలోనే మొదటిసారి అని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీలో ప్రక్రియ ప్రారంభించి, ఇందులో భాగంగా గురువారం రూ.లక్ష రుణమాఫీ చేపట్టడం పై హర్షం వ్యక్తం చేస్తూ గాంధీభవన్లో నిర్వహించిన సంబరాలలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపా దాస్ మున్షి గారితో పాటు మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు తమ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రైతు డిక్లరేషన్ లో భాగంగా రాహుల్ గాంధీ గారు ఇచ్చిన మాట ప్రకారం.. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామన్నారు. ఏ రాష్ట్రంలోనూ ఇప్పటివరకు లేని విధంగా 70 లక్షల మంది రైతులకు రూ. 31వేల కోట్ల రుణాలు మాఫీ అవుతుండడం రాష్ట్ర చరిత్రలోనే గొప్ప విషయం అన్నారు. రైతులంతా సంతోషంతో పండగ చేసుకుంటున్నారని.. రుణమాఫీ ప్రారంభించిన జులై 18 రైతుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కేంద్రంలో పదేళ్ల పాలన పూర్తి చేసుకున్న మోడీ ప్రభుత్వం.. రైతులు అడిగిన కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా, రైతుల గొంతు నొక్కిందన్నారు. రాష్ట్రంలో పదేళ్లు పాలించిన కేసీఆర్ ప్రభుత్వం.. రూ.28 వేల కోట్ల రుణమాఫీ చేయలేక, ఇచ్చిన మాట నిలుపుకోలేక చేతులేత్తేశాడని విమర్శించారు. తమ ప్రభుత్వం రుణమాఫీ ప్రారంభించటంతో.. కెసిఆర్, కేటీఆర్ , హరీష్‌రావులకు తల తిరిగిపోయి ఏం చేయాలో అర్థం కావట్లేదు అన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేలకోట్లు దోపిడీ తప్పా.. కెసిఆర్ పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు.రాష్ట్రం అప్పుల్లో ఉన్నా, ఆర్థిక వనరుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్న.. ఇచ్చిన మాటకు కట్టుబడి తమ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తుందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మాచారెడ్డిలో 20 ఏళ్ల క్రితం రైతుల ఆత్మహత్యలపై చలించి.. వారిని వ్యక్తిగతంగా ఆదుకున్నానని, రైతులకు మేలు చేకూర్చాలని తాను రాజకీయాల్లోకి వచ్చినట్టు మధుయాష్కీ గౌడ్ వివరించారు. ఆనాడు యూపీఏ ప్రభుత్వంలో దేశవ్యాప్తంగా రు. 74వేల కోట్ల రుణమాఫీ చేశామని, అదే స్ఫూర్తితో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతుల సంక్షేమ ప్రభుత్వమని పునరుద్ఘాటించారు. రుణమాఫీ సంబరాల్లో రాష్ట్ర రైతాంగమంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ యజమాని, డ్రైవర్ అరెస్ట్



**విశ్వంభర, ఆమనగల్లు/ మాడ్గుల :** మాడుగుల మండలం ఇర్విన్ గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌నీ సీజ్ చేసి యజమానిని మరియు డ్రైవర్‌ని అరెస్టు చేసినట్టు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. బుధవారం రాత్రి 9 గంటల గంటల సమయంలో మాడ్గుల్ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది ఇర్విన్ గ్రామంలో అనుమానాస్పదంగా వచ్చిన ట్రాక్టర్( TS05EW2215)ను తనిఖీ చేయగా దాని ట్రాలీ నెంబర్ లేదు, ఎటువంటి పరిమితులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టుగా తెలుసుకొని ట్రాక్టర్ డ్రైవరు మాదాసు అనిల్ తండ్రి యాదయ్య, యజమాని బాతుక కొండల్‌ను అరెస్టు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశామని అలాగే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా

# రైతు ఋణ మాఫీ పూర్తి చేయాలి

○ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఋణ మాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో రైతు రుణమాఫీ ప్రక్రియపై అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపైవ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16,502 మంది రైతులకు రైతు రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి విడత రుణమాఫీలో భాగంగా ఒక లక్ష రూపాయలు లోపు బకాయిలు ఉన్న రైతుల ఖాతాలలో డబ్బు జమ అవుతుందని తెలిపారు. రెండవ విడత ఈ నెల 31 నుండి ప్రారంభం అవుతుందన్నారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా రుణమాఫీ ప్రక్రియ కొనసాగించాలన్నారు. రైతుల పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ నంబర్, బ్యాంక్ వివరాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన రుణ వివరాలు, రుణమాఫీ జరిగిన తరవాత మిగిలిన రైతుల వివరాలు కూడా సేకరించాలని, ఋణ మాఫీ వచ్చిన వారి వివరాలు, రాని వారి వివరాలు పక్కగా ఉండాలన్నారు. బ్యాంకులలో ప్రత్యేక సమయం, ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతు ఋణ మాఫీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు పాల్గొనాలని సూచించారు. బకాయిలు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రెండులక్షల రూపాయల రుణమాఫీ జరుగుతుందని, రైతులు రుణమాఫీకి దరఖాస్తు చేసేప్పుడు తప్పకుండా పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంక్ పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను జతపరచాలని ఆయన పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 09 వ తేది వరకు బ్యాంకుల్లో పంట ఋణాలు తీసుకుని ఇప్పటి వరకు తిరిగి చెల్లించని రైతులకు ఋణ మాఫీ ఉంటుందని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి లో ఋణ మాఫీకి సంబంధించి అర్హుల యొక్క జాభితా వ్యవసాయ శాఖ ద్వారా బ్యాంకులకు తెలియపరచడం జరుగుతుందన్నారు. రుణమాఫీలో సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయిలో గ్రీవెన్స్ పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ఇబ్బందులు తలెత్తితే గ్రీవెన్స్ పోర్టల్‌లో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, లీడ్ బ్యాంక్ అధికారి తిరుపతి, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంక్ బ్రాంచి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



## సేవ చేయాలన్నదే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి లక్ష్యం

**ఆయన బాటలోనే మేము నడుస్తామంటూ యువకుల రక్తదానం**

**విశ్వంభర, సూర్యాపేట :** మనిషై పుట్టిన ప్రతి ఒక్కరూ ఉన్నంతలో తమకు తోచినంత సమాజ సేవ చేయాలన్నదే మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీష్ రెడ్డి లక్ష్యమని బీఆర్ఎస్ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ కీసర వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ చేతులమీదుగా ప్రారంభింపజేసి మాట్లాడారు. మాజీమంత్రి జగదీష్ రెడ్డి చూపిన బాటలో నడుస్తూ ఈరోజు రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం చేయడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ఉపయోగపడి వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని సూచించారు. మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సుమారు 50 మంది యువకులు రక్తదానం చేయాగా బ్రైట్ ఫ్యూచర్ స్వచ్ఛంద సంస్థకు అప్పగించామన్నారు. వారు ఈ రక్తాన్ని ఆపదలో ఉన్నవారికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మట్ట రాజు యాదవ్, దేశగాని శ్రీనివాస్, ఎలుగురి రాంబాబు, రాము, ప్రవీణ్, ముదిరెడ్డి అనిల్ రెడ్డి, కేక్కిరేణి శివ, ప్రభాకర్, వేణు తదితరులు ఉన్నారు.

## వనమహోత్సవం పనులను పరిశీలించిన ఎంపీడీఓ



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం వనమహోత్సవం కార్యక్రమానికి సరైన స్థలం ఎంపిక చేశారు. అనంతరం కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటటానికి రెండు పడగ గదుల ఇండ్ల వద్ద నాటటానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ నిరంజన్ వలీ, ఉపాధి హామీ ఏపీఓ బోడిగే రమేశ్‌గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్లు జమాండ్ల యాదిరెడ్డి, దంతూరీ శ్రీశైలం గౌడ్, పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనంద్ కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది సుదర్శన్, కిష్టయ్య, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, చివ్వేంల :** ఇటీవల అకాల మరణం చెందిన మండలంలోని గుంజలూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పెదపోలు శ్రీనివాస్ కుటుంబానికి ఆ పార్టీ కార్యకర్తలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సంతాప సభలో శ్రీనివాస్‌ను స్మరించుకొని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ అధ్యక్షులు అమరారపు శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు దొనకొండ శ్రీనివాస్, సుంకరి ఉపేందర్, బొల్లికొండ సైదులు, పెద్ది అంజయ్య, దొనకొండ మహేష్, పందిరి శోభన్, కొప్పు రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య



**విశ్వంభర, భీమారం :** మండలంలోని కమ్మరిపేట గ్రామంలో పండగ పూట విషాదకరమైన సంఘటన చోటు చేసుకుంది. శ్రావణి అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. శ్రావణి ఇంట్లో పురుగుల మందు తాగింది. అది గమనించిన భర్త నరేష్ స్థానికుల సహాయంతో హుటాహుటిన జగిత్యాలలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కానీ అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కొరకు కరీంనగర్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు శ్రావణికి ఇద్దరు కుమారులు శ్రాహన్స్( 4), రుద్రాన్స్(1) ఉన్నారు. క్షణికా ఆవేశంలో తీసుకున్న నిర్ణయానికి ఇద్దరు పిల్లలకు కుటుంబ సభ్యులకు తీరని ఆవేదన మిగిల్చింది.



**యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి ఇటీవల గుండెపోటుతో మరణించారు. గురువారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రా రెడ్డి మరియు మాజీ జడ్పీటీసీ మందడి రామక్రిష్ణ రెడ్డి పరామర్శించారు.**

**- విశ్వంభర, ఆత్మకూరు(ఎం)**

## అర్హులందరికీ

# రెండు లక్షల రుణమాఫీ ఖాయం

○ నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**విశ్వంభర, నారాయణఖేడ్ :** ఇచ్చిన మాట ప్రకారం రైతులు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గురువారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని శివాయపల్లి గ్రామ శివారులోని రైతు వేదికలు నిర్వహించిన రైతు రుణ మాఫీ సంబురాల్లో పాల్గొని సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం వరకు రైతులందరికీ లక్ష రూపాయలు రుణమాఫీ జరుగుతుందని. ఆగస్టు 15వ తేదీలోపు ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి విడత రుణమాఫీలో భాగంగా ఒక లక్ష రూపాయలలోపు బకాయిలు ఉన్న రైతుల ఖాతాలలో డబ్బు జమ అవుతుందని తెలిపారు. రెండవ విడత ఈ నెల 31 నుండి ప్రారంభం అవుతుందన్నారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా రుణమాఫీ ప్రక్రియ కొనసాగించాలని అన్నారు. బ్యాంకులలో ప్రత్యేక సమయం, ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. 2023 డిసెంబర్ 09 వ తేదీ వరకు బ్యాంకుల్లో పంట ఋణాలు తీసుకుని ఇప్పటి వరకు తిరిగి చెల్లించని రైతులకు ఋణ మాఫీ వర్తిస్తుందని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఋణ మాఫీకి సంబంధించి అర్హుల జాబితా వ్యవసాయ శాఖ ద్వారా బ్యాంకులకు తెలియపరచడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిని మధు, సురేందర్ రెడ్డి, నారా గౌడ్ అలుగుల సత్యనారాయణ, వేణుగోపాల్ గౌడ్, ఆర్యన్ సంతోష్ కుమార్, దాచ సంగమేశ్వర్, రాజేందర్ గౌడ్, బాసాడ రాజు, అంజిరెడ్డి, రాజు, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులకు ప్రభుత్వం ఇచ్చిన

# హామీలను వెంటనే నెరవేర్చాలి

○ తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేసిన ముదిరాజ్ కుల నాయకులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మండల తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నాగారపు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అభయా హస్తంలో ఇచ్చిన హామీల మేరకు ముదిరాజులను బీసీడీ నుంచి బీసీఏ లోకి తక్షణమే చేర్చాలని ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు 1000 కోట్లు నిధులు విడుదల కేటాయించాలన్నారు. 50 సంవత్సరాల వయసు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు ఆసరా పింఛన్ సౌకర్యం అందించాలని ముదిరాజుల కోసం 10 కోట్ల నిధులు ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం 100% మత్స్యకారులకు మాత్రమే చేరే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముదిరాజ్ కులస్తుల ప్రాధాన్యం పెంచడానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని శాసనమండలిలో మూడు స్థానాలు రాజ్యసభలో ఒక స్థానం కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మండల కమిటీ మండల అధ్యక్షుడు నాగారపు రమేష్, మండల యూత్ అధ్యక్షులు యాట రాజు, ఉపాధ్యక్షులు గడుగు నర్సింహ్మా, కమిటీ సభ్యులు లక్ష్మయ్య, అంజయ్య, మల్లయ్య సత్తయ్య శీను మధు సందీప్ పాల్గొన్నారు.

## రుణమాఫీకి మద్దతుగా బైక్ ర్యాలీ



**విశ్వంభర, ఆమనగల్లు :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ.. ఆమనగల్లు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్లమల్ల జగన్, పట్టణ అధ్యక్షులు వస్పూల మానయ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి విచ్చేసి సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణ నాయక్, వస్పుల శ్రీశైలం, మాజీ మండల అధ్యక్షులు దావ ధనుంజయ, మంగ్లీ రాములు, మాజీ ఎంపీపీ అనిత విజయ్, ఎంగలి ప్రసాద్, అబ్దుల్ ఖాదర్, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ అలీం, ఎన్ఎస్యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, సోషల్ మీడియా కన్వీనర్లు నాజర్, మహేష్, బాబా, సురేష్, వెంకటేష్, కరీం, మైసయ్య, శేఖర్ గౌడ్, కాలే మల్లయ్య మహేష్, సురేష్, రామకృష్ణ, శ్రీను, కుమార్ గౌడ్, రహీం, శివ, శీను నాయక్, హరిలాల్, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్**



**విశ్వంభర, షాద్‌నగర్ :** గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటీ 20వ వార్డులో పర్యటిస్తూ మురికి కాలువలు, డ్రైనేజీ పనులను పరిశలించిన మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చు అన్నారు. వర్షాకాలంలో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా సానిటేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురిసిన సమయంలో వర్షం నీరు నిలవకుండా, డ్రైనేజి నిండిన వెంటనే తొలగించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండేందుకు చర్యలు చెప్పడతామన్నారు. వార్డుల్లో దోమలు, ఈగలు నివారించేందుకు కృషి చేస్తామని అన్నారు. బ్లీచింగ్ పౌడర్, చెత్త వేసిన కుండీల వద్ద ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో పరిశుభ్రతను పాటించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పినమోని గోపాల్, మున్సిపల్ సిబ్బంది సాయిబాబా, వెంకట్రాంరెడ్డి, జవాన్ ఆంజనేయులు బాబా తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్ వాడీ బాట



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలం పల్లేర్ల గ్రామంలో అంగన్ వాడీ సెంటర్లలో అమ్మ మాట అంగన్ వాడీ బాట కార్యక్రమలో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రులుతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం సిడిపివో జ్యోష్ణ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల నిండిన పిల్లలని అంగన్ వాడీ సెంటర్లలో చేర్పించాలని గ్రామ ప్రజలకు తెలిపారు. అంగన్ వాడీ సెంటర్లలో నర్సరీ తరగతులను నిర్వహించడం జరుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలని ప్రైవేటు పాఠశాలలకు కాకుండా అంగన్ వాడీ సెంటర్లకు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జ్యోతి అంగన్ వాడీ సెంటర్ల టీచర్లు మాధవి, అండాలు ఆయాలు, ఆశ వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో వన మహోత్సవం

**విశ్వంభర, మెట్‌పల్లి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమం గురువారం మెట్‌పల్లిలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక మొక్కలు నాటిన రాష్ట్రంగా తెలంగాణ ముందు వరుసలో ఉందని బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారానికి వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటడం చాలా ఆనందదాయకమని, ప్రతి ఒక్కరూ పుట్టినరోజు నాడు లేదా పెండ్లి రోజు నాడు ఒక మొక్కను నాటి పొల్యూషన్ లేకుండా భావితరాలకు మార్గదర్శకులు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా చెట్లు నాటాలని పిలుపునిచ్చారు. అవగాహన లోపంతో కొందరు చెట్లను కొట్టివేయడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రణవీని సుజాత సత్యనారాయణ, వైస్ చైర్మన్ బీ చంద్రశేఖర రావు, వార్డు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ మోహన్, మున్సిపల్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్(RP)లు, మెప్మా విభాగం పాల్గొన్నారు.



## చిన్నారుల భవిష్యత్తు కోసం

# మహిళా , శిశు సంక్షేమ శాఖ కృషి



**విశ్వంభర, ముషీరాబాద్ :** ప్రయివేటు పాఠశాలల కు దీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ విద్యను అందించాలని సర్కారు నిర్ణయించింది. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం వినూత్న కార్యక్రమాలతో పాటు సులభతరమైన పద్ధతుల ద్వారా వారిలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఈ ఏడాది పూర్వ ప్రాథమిక విద్యను అందించనుంది. ఇందుకోసం జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ప్రీ ప్రైమరీ విద్యను మరింత పటిష్ట పరుస్తూ ప్రవేశాల పెంపు లక్ష్యంగా సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని బండ మైస మ్మ1అంగన్వాడీ కేంద్రలో 'అమ్మ మాట.. అంగన్వాడీ బాట' అనే ప్రత్యేక కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ హాజరయ్యారు. ఇందులో భాగంగా ఈనెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. బడిబాట కార్యక్రమం పూర్తయిన తర్వాత బస్తీలు, కాలనీలు, వార్డుల్లో బడికి రాకుండా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి వారిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించనున్నారు. వారికి అక్షరాలు, అంకెలు, పాటలతో కూడిన విద్యను బోధించనున్నారు. ఇందుకోసం జిల్లాలో ఇప్పటికే పూర్వ ప్రాథమిక విద్యపై ఒక్కో బ్యాచ్కు మూడు రోజుల పాటు 24 బ్యాచ్లో 801 మంది ఉపాధ్యాయులకు ట్రైనింగ్ ఇచ్చారు. పిల్లలకు పుస్తకాలతో పాటు యూనిఫాంలు అందించనున్నారు. పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈనెల 15, 16 తేదీల్లో అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, బాలికలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, యువకులు, ఎన్జీవోలు, తల్లితండ్రుల సాయంతో బస్తీలు, వార్డుల్లో ర్యాలీలు నిర్వహించి చిన్నారులను అంగన్వాడీల్లో చేర్పించాలని అన్నారు. అదే విధంగా పాఠశాల, కళాశాల విద్యకు దూరంగా ఉన్న బాలికలను గుర్తిస్తారు. స్థానిక ప్రజా ప్రతి నిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారు. అంగన్ వాడీలో చిన్నారుల వివరాలు నమోదు చేయడం, బోధనా పద్ధతుల గురించి సిబ్బంది చిన్నారులకు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రీ అండ్ ప్రైమరీ విద్య గురించి వివరించి చైతన్యపరుస్తారు. అయిదేండ్లు పూర్తయిన పిల్లల కు అంగన్వాడీ నుంచి ప్రీ స్కూల్ ధ్రువపత్రాన్ని అందజేయనున్నారు. 19న అంగన్వాడీ కేంద్రాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఇందులో భాగంగా మొక్కలు నాటడం, కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు, చిన్నారులకు మరుగుదొడ్ల సదుపా యం కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 20న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ డెవలప్మెంట్ డే. ఆరోజు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాత, నానమ్మ, అమ్మమ్మలను అంగన్వాడీ కేంద్రాలకు ముఖ్య అతిథులుగా ఆహ్వానించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆట వస్తువులను ప్రదర్శిస్తారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం అయిదు ఐసీడీ ఎస్ ప్రాజెక్టులు ఉండగా.. ఇందులో చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్లో ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 970 అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వీటిల్లో గర్భిణీ, బాలింతలు 10,670 మంది.. 7 నెలల నుంచి మూడేండ్ల వయసు పిల్లలు 55, 449 మంది, మూడు నుంచి ఆరేండ్ల వయసు చిన్నారులు 12,550 మంది ఉండగా.. వారికి విద్యతో పాటు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. ఈ కార్యక్రమంలో బస్తి వాసూలు వీరమ్మ, పి.ఎల్లయ్య, బి.రాజు, బి.రాములు, జీ.గీత, ఉమ రాణీ, అనిత, టి. వసంత, అంజమ్మ, యాదమ్మ, పి.ఎల్లయ్య, రాములు, అంగన్వాడి టీచర్లు టి.ధనమ్మ, స్వప్న, కవిత, పి.శారద, రఫీయ, సంతోషిణి, అయాలు జీ.వనమాల, శ్రీలత, మీనాక్షి, సుశీల, ఏ.ఎన్.ఎంలు నాగమణి, పద్మ పాల్గొన్నారు.



## ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యేమాధవరం కృష్ణారావుకు వినతి

**విశ్వంభర, కూకట్ పల్లి :** కూకట్ పల్లి ఆశావర్కర్లు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లేందుకు గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను, డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదని ఆశావర్కర్లు వినతి పత్రంలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు, మాజీ మంత్రి హరిశరావు దృష్టికి తీసుకువెళ్లి అసెంబ్లీలో, బీఆర్ఎస్ పార్టీ తరపున చర్చించి, తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ప్రమాదకరంగా ప్రధాన రహదారులు భారీ గుంతలతో వాహనదారుల ఇక్కట్లు



**విశ్వంభర, ముషీరాబాద్ :** ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి ఎక్కడ చూసినా భారీ స్థాయిలో గుంతలు ఏర్పడి వాహనదారులకు ప్రాణ సంకటంగా తయారయ్యాయి. నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ స్టీల్ బ్రిడ్జి దగ్గరలో ఉన్న సాయివాణి హాస్పిటల్ ఎదురుగా గల ప్రధాన రహదారిపై భారీ స్థాయిలో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ వాహనాలు గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై మద్దెల ప్రభాకర్, అఫిజ్, సాయి, శివ కాంత్, నరసింహ జీహెచ్ఎంసీ మరియు వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులపై మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

## ఘట్కేసర్ యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్

**విశ్వంభర, ఘట్కేసర్ :** హైదరాబాద్ యాదగిరిగుట్ట వెళ్లే భక్తులకు శుభవార్త. ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఘట్కేసర్‌యాదరిగుట్ట వయా రాయగిరి స్టేషన్ల మధ్య ఎంఎంటీఎస్ రైలుమార్గం పనుల్లో కీలక ముందడుగు పడింది. 33 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ మార్గం కోసం 60 ఎకరాలు అవసరం అవుతాయని భావిస్తున్నరైల్వేశాఖ త్వరలోనే భూ సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఈక్రమంలో భూ సేకరణ కోసం త్వరలోనే టెండర్లు పిలవాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ రైతులకు లక్ష లోపు రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కడ్తాల్ మండల కేంద్రంలో పాలాభిషేకం చేశారు. పట్టణ చౌరస్తాలో బాణాసంచా పేల్చి బైక్ ర్యాలీ నిర్వహించారు. దశాబ్దపు అతి పెద్ద వేడుక రైతులకు రుణమాఫీ అన్నారు. పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర రైతన్నలకు రూ. 2 లక్షల వరకు రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ ఏకకాలంలో చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిఖ్య నాయక్, డిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, అమంగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, తెలంగాణ రాష్ట్ర గిరిజన సేవ సంఘం అధ్యక్షుడు వడ్త్యావత్ హనుమ నాయక్, తెలంగాణ రాష్ట్ర గిరిజన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లక్పతి నాయక్, కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్చ నాయక్, కార్యకర్తలు, రైతులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు గడ్డిఅన్నారం కార్పొరేటర్ వినతి

**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్ :** హాస్టల్స్ యాజమాన్యాల్తో సమావేశం నిర్వహించడానికి జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోన్ సరూర్నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. గడ్డిఅన్నారం డివిజన్ లోని హాస్టల్స్ యాజమాన్యాలతో సమావేశము నిర్వహించుట కొరకు గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోన్ సరూర్నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాతకి వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్లో ఉన్న హాస్టల్స్ వల్ల స్థానిక కాలనీలో నివసిస్తున్న ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వివిధ కాలనీల్లో అక్రమంగా హాస్టల్స్ నడుపుతున్న విషయం విదితమే. ఈ అక్రమ హాస్టల్స్ వల్ల స్థానికంగా సానిటేషన్, డ్రైనేజీ, లా అండ్ ఆర్డర్ మరియు పార్కింగ్ వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలన్నిటినీ పరిగణంలోకి తీసుకొని వీలైనంత తొందరగా అన్ని హాస్టల్స్ కి సమచారం ఇచ్చి అన్ని విభాగాల అధికారులతో ముఖ్యంగా పోలీస్ విభాగం అధికారులతో కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేసి హాస్టల్స్ యాజమాన్యాలకు కొన్ని నిబంధనలు పాటించాలని హెచ్చరిస్తే ఎంతో కొంత స్థానిక ప్రజలకు ఇబ్బందులు నుండి ఊరట కలిగించవచ్చని అన్నారు. అధికారులు చొరవ తీసుకొని వీలైనంత తొందరగా సమావేషం నిర్వహించాలని కోరారు.

## బీరు బాటిల్లో సిగరెట్

**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీ సరళ మైసమ్మ వైన్స్ లో గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సాయంత్ర సమయంలో బీర్లు తాగేందుకు వైన్స్ వద్దకు వెళ్లి కొనుగోలు చేయగా, తాగే సమయానికి బీరు బాటిల్ పరిశీలించి చూడగా అందులో సిగరెట్ తాగి పడేసిన సిగరెట్ భాగం కనిపించడంతో షాక్కు గురయ్యారు. బీర్ బాటిల్‌లో దుమ్ము ధూళి రావడానికి కారణమేంటి అసలు ఎలాంటి మద్యాన్ని అమ్ముతున్నారని వైన్స్ యజమాన్యాన్ని ప్రశ్నించగా.. నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ పైనుంచి వచ్చిన వాటికి మేమెం చేయాలి మాకేం సంబంధం అని జవాబు ఇస్తున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం తెలపడంతో ఆ యువకులు వైన్స్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తూన్న, సరళ మైసమ్మ వైన్స్ లో నాసిరకపు మద్యంను కొనుగోలు చేయవద్దని వెంటనే వైన్స్ మూయించాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా నారాయణపురం వైన్స్ లో నకిలీ మద్యం అమ్మకాలు జరిగాయి అనేది బహిరంగ రహస్యమే అయినప్పటికీ, మళ్లీ ఇప్పుడు బీర్ బాటిల్‌లో సిగరెట్ ముక్క రావడంతో పైనుంచి వచ్చిందా ? లేదా రహస్యంగా ఇక్కడే నకిలీ మద్యం తయారవుతుందా అనేది మద్యం ప్రియుల్లో అనుమానం వ్యక్తమవుతుంది. దీన్ని బట్టి చూస్తే ఎక్సైజ్ శాఖ అధికారుల తనిఖీలు జరుగుతున్నట్టేనా ? మద్యం ప్రియులే ఆలోచన చేసుకోవాలె.



# అక్రమ నిర్మాణాలకు అడ్డేది..

- అక్రమ నిర్మాణాలపై కనిపించని చర్యలు
- రెచ్చిపోతున్న నిర్మాణదారులు



విశ్వంభర, కూకట్ పల్లి : అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా.. కూకట్ పల్లి సర్కిల్ మారింది. అనుమతులు ఉన్నా లేకున్నా అండగా మేముంటాం అంటూ నిర్మాణదారులకు ప్రోత్సహిస్తున్న తీరు కళ్ళ కట్టినట్టు కనిపిస్తుంది. నిర్మిస్తున్న వారి వద్ద అక్రమంగా సొమ్ము చేసుకుంటూ, జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్నారు. కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని పలు కాలనీలో అక్రమ నిర్మాణాలు, అక్రమ షెడ్లు నిర్మిస్తున్న, గత ఆరు నెలలుగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నిర్మాణదారులను ప్రోత్సహించడమే కాకుండా అధికారులు వారికి ఉచిత సలహాలు ఇస్తూ పబ్బం గడుపుతున్నారు. సర్కిల్ పరిధిలో దాదాపు 50కి పైగా నిర్మాణాలు నిర్మిస్తున్నా.. ఫ్లోర్ కి ఓరేటు మాట్లాడుకుని అధికారులు జేబులు నింపుకుంటున్నారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ తతంగం నడుపుతున్నట్టు అక్కడక్కడ గుసగుసలు వినిపిస్తున్నాయి. హైదర్ నగర్, శ్రీనివాస్ కాలనీలో అక్రమంగా ఎఫ్.టి.ఎల్ ల్యాండ్‌లో నిర్మాణం చేపడుతున్నా.. అధికారులు దానిని పట్టించుకోవడమే మానేశారు. ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాలు మా పరిధిలోకి రావంటూ, ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ మాట దాటేస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా.. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అని కాలనీవాసులు నిందిస్తున్నారు. ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకొని, అక్రమంగా నిర్మించిన వాటిని కూల్చివేయాలని కోరుతున్నారు.

## కాలనీ స్థలాన్ని పరిరక్షించాలని వినతి

**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురి డివిజన్‌లోని భవానినగర్ కాలనీలోని 350 గజాల కాలనీ స్థలం కబ్జాకు గురైందని కాలనీ వాసులతో చైతన్యపురి కార్పొరేటర్ రంగనరసింహగుప్త జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిసనర్ సుజాతకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కబ్జాదారుడు అప్లై చేసిన పర్మిషన్ రద్దు చేయాలని, జీహెచ్ఎంసీ అధికారులు దానిని డెవలప్మెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జీ సొంతోష్, లక్ష్మీనారాయణ, చిన్నా, రవీందర్ రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షులు వినోద్ యాదవ్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## రెస్టారెంట్, బార్‌లలో సమస్యలను పరిష్కరించాలి

- మంత్రులను కలిసిన బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్

**విశ్వంభర, బషీర్ బాగ్:** రాష్ట్రంలోని రెస్టారెంట్, బార్‌లలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లను వారి కార్యాలయాల్లో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర రెస్టారెంట్, బార్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డిలు తమ సమస్యలను మంత్రుల వద్ద ఏ కరువు పెట్టారు.. వైన్ షాప్ ఫర్మిట్ రూమ్ రూల్స్ మార్చాలని వారు బారుకు మధ్య దూరం పెంచాలని బార్ లైసెన్స్ రెన్యువల్ విధానాన్ని ఆటో రెన్యువల్ గా కాకుండా ఐదు సంవత్సరాలకు ఒకసారి ఉండేలా చూడాలని కోరారు. వైన్ షాపులో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. వైన్ షాపుల సమయాన్ని ఉదయం 11 గంటలకు రాత్రి 10 గంటల వరకు ఉండేలా చూడాలని కోరారు. బార్ షాపులో పక్కన బెల్ట్ షాపులను లేకుండా చూడాలని సెలవు దినాలను తగ్గించి లైసెన్స్ ఫీజును బందుల సమయాల్లో రిఫండ్ ఇచ్చేలా చూడాలని కోరారు.



## కాంగ్రెస్ నాయకుల సంబురాలు

**విశ్వంభర, చంద్రుగొండ :** చంద్రుగొండ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇచ్చిన మాట ప్రకారం రైతుల రుణ మాఫీ పక్రియను అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోవింద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సేవ దళ్ స్టేట్ సెక్రెటరీ కొదుమూరి దయాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేసు బోయిన నరసింహారావు, మాలోత్ బొజ్జ నాయక్, అంకిరెడ్డి, కృష్ణారెడ్డి, ఉప్పునూతల ఏడుకొండలు, సారేపల్లి శేఖర్, మండల నాయకులు కిసాన్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సేవాదళ్ నాయకులు, బీసీ మైనార్టీ, ఎస్సీ ఎస్టీ, అన్ని అనుబంధ సంఘాలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






యూకే(UK) లోని వార్విక్ యూనివర్సిటీ నుంచి పట్టభద్రుడైన తన కుమారుని స్నాతకోత్సవానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరైన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి.

- విశ్వంభర, హైదరాబాద్



## ఘనంగా మాజీ మంత్రి జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

**విశ్వంభర, సూర్యాపేట :** ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి వర్యులు, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథులుగా తుంగతుర్తి మాజీ శాసనసభ్యుడు డా.గాదరి కిశోర్ కుమార్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ హాజరై కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## రైతు రుణ మాఫీ నిధుల విడుదలపై రైతు వేదికలో వీడియో వీక్షణ



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని స్థానిక రైతు వేదికలో గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క లక్ష రూపాయల రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని లైవ్ ప్రోగ్రాం ద్వారా వీడియోలో ఆమనగల్ వ్యవసాయ అధికారి అరుణకుమారి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు చూపించారు వీడియోలో ముఖ్యమంత్రి లబ్ధిదారులకు చెక్కులను అందించి రైతులతో డైరెక్ట్ గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక్కో రైతుతో మాట్లాడిన సన్నివేశాలను చూపిస్తూ వివరించారు ఈ సందర్భంగా రైతులు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపి బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** వాతావరణ శాఖ సూచన మేరకు భూపాలపల్లి జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అత్యవసర సేవలకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనలు మేరకు రానున్న ఐదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ సమయంలో వర్షం వస్తుందో తెలీదు కాబట్టి ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొంగి పొర్లే నది నాలాలు దాటకుండా గ్రామాలలో టాం టాం ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.పొంగిపొర్లే వాగులు, రహదారుల్లో ప్రజలు రవాణా చేయకుండా భారీ కేడింగ్ ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ప్రజలు అత్యవసర సేవలకు తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.



సూర్యాపేట జిల్లా అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదిన సందర్భంగా సూర్యాపేట 15 వార్డులో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఉప్ప శ్రీకాంత్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు గుర్రం సత్యనారాయణ రెడ్డి, కీసర వేణుగోపాల్ రెడ్డి, మట్ట రాజు యాదవ్, కొమ్ము ప్రవీణ్, మరియు బీఆర్ఎస్ కార్యకర్తలు వార్డు సభ్యులు హాజరై విజయవంతం చేశారు.

- విశ్వంభర, సూర్యాపేట



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు రుణ మాఫీ 2024 నిధుల విడుదల సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్న స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు అన్నదాతలు, అనంతరం రైతు వేదిక ఎదుట సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

- విశ్వంభర, ఆత్మకూరు(ఎం)

# గ్రూప్- 2, 3 పరీక్షలను నెలరోజులు వాయిదా వేయాలి

**○ ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ**




**విశ్వంభర, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్ పరీక్షలను వాయిదా వేయాలని, నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నారని వారి పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించి, చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ అభిప్రాయపడింది. డీఎస్సీ పరీక్షలు ఈనెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ప్రభుత్వ నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ రాసే వారిలో గ్రూప్ 2 మరియు గ్రూప్ 3 అభ్యర్థులు కూడా ఉన్నారు. గ్రూప్ 2 పరీక్షలు ఆగస్టు 7, 8 తేదీల్లో ఉన్న నేపథ్యంలో డీఎస్సీ రాసేవారికి ప్రిపరేషన్ కోసం సమయం సరిపోదు. ఈ కారణం చేత నిరుద్యోగులు గ్రూప్ 2 మరియు గ్రూపు 3 లను కనీసం నెల రోజులైనా వాయిదా వేయాలని కోరుతున్నారు. ఈ డిమాండ్ కూడా సరైనదే, గతంలో పేపర్ లీకేజీలు, టీజీ పీఎస్సీ తప్పిదాల వలన రాష్ట్రంలో నిరుద్యోగులు చాలా కాలాన్ని నష్టపోయారు. కాబట్టి ఈ నోటిఫికేషన్ దాకనైన ప్రభుత్వ కొలువులు సాధించాలనుకుంటున్న ఈ పరిస్థితుల్లో ప్రిపరేషన్ కోసం సమయం సరిపోదు. అందులోనూ డీఎస్సీ సిలబస్ వేరు గ్రూప్స్ సిలబస్ వేరు కావున ప్రభుత్వం ఈ సున్నితమైన అంశంపై అభ్యర్థులతో చర్చించి సానుకూలంగా పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ తరపున కోరుతున్నాము అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం సానుకూలంగా వివరించకుండా వారి పట్ల అహంకార భావంతో మాట్లాడడం సరైనది కాదు. ఈ సమస్యను పరిష్కారం చేయాలని పోరాడుతున్న నిరుద్యోగులను అరెస్టులు చేసి కేసులు పెట్టడం, నిర్బంధించడం సరైన చర్య కాదని ఎస్ఎఫ్ఐ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ భావిస్తున్నది. గత ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్ 1 నోటిఫికేషన్ లో గ్రూప్ 1 పోస్టుల కంటే అదనంగా 63 పోస్టులు పెంచి మళ్లీ గ్రూప్ 1 నిర్వహించిన ప్రభుత్వం, గ్రూప్ 2, గ్రూప్ 3 లలో కూడా పోస్టులు పెంచే ఆలోచనను, పరిశీలన చేసి రాష్ట్రంలో పోటీ పరీక్షలు నిర్వహించాలని, అరెస్టు చేసిన నిరుద్యోగులను విడుదల చేయాలని, ఈ సమస్యలతో పరీక్షలను నెలరోజులు వాయిదా వేసి పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్, జిల్లా కమిటీ సభ్యులు స్వామి, హాస్టల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుని రాజు చేయడమే లక్ష్యం



### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి


**విశ్వంభర, పరిగి :** రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో గురువారం పరిగి పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని రైతుల శ్రేయస్సు కోసం సంక్షేమం కోసం కృషి చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. పరిగి మండలానికి సుమారు 16 కోట్ల రూపాయలు నేడు రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ‌రావు రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ వన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్థసారథి, డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు, డిసిసి ఉపాధ్యక్షులు లాలూ కృష్ణ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరశురాం రెడ్డి, డిసిసి కార్యదర్శి కృష్ణారెడ్డి, జగన్, మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్, చిన్న నరసింహులు, శ్రీనివాస్ గుప్తా, రాధాకృష్ణారెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సురేఖ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై కాళేశ్వరం పోలీసుల అవగాహన



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కాళేశ్వరం ఎస్సై చక్రపాణి, హెడ్ మాస్టర్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు రాజేందర్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి ఎస్సై చక్రపాణి విద్యార్థులకు వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని, కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, గుట్కాలు యువత అలవాటు చేసుకోని ఆరోగ్యం పాడుచేసుకోవద్దని ఎస్సై తెలిపారు. ఒక వ్యక్తి డ్రగ్స్‌కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందిచాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలియజేశారు. విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని తెలిపారు. మంచికి దగ్గరగా, చెడుకు దూరంగా ఉండాలని, విద్యార్థులు మంచి ఆలోచనలతో చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఎస్సై చక్రపాణి అన్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పాటించవలసిన రహదారి నియమ నిబంధనలను విద్యార్థులకు వివరించారు.

## అర్హులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ




**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా ఘనపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ 2024 నిధుల విడుదల కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు జిల్లాలలోని రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి రుణమాఫీపై రైతుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 16502 మంది రైతులకు రైతు రుణమాఫీ జరుగుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతీ రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ అవుతుందన్నారు. మొదటి విడత రుణమాఫీలో భాగంగా ఒక లక్ష రూపాయలు లోపు బకాయిలు ఉన్న రైతుల ఖాతాలో డబ్బు జమ అవుతుందన్నారు. రెండవ విడత ఈ నెల 31 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. రైతులకు రైతు రుణమాఫీలో ఇబ్బందులు ఎదురవకుండా గ్రీవెన్స్ పోర్టల్ సైతం ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారని రైతును రాజును చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఒకేసారి రెండు లక్షలు రుణమాఫీ చేయలేదని, 2022 మే 06 న వరంగల్‌లో రైతులకు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల ఋణ మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. రైతు రుణమాఫీ రైతులకు పండగలాంటిదని, రైతులకు రుణ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం గొప్పనిర్ణయం తీసుకుందని అన్నారు. మొదటి విడతలో ఒక లక్ష రూపాయలు రుణమాఫీ రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. మీ రుణం జీరో అవుతుందని అన్నారు. రైతులు రుణమాఫీ కాలేదని అధైర్య పడవద్దని విడతల వారిగా అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. వర్షాలు కురుస్తున్నందున సాగు కొరకు రైతులు రుణాల కోసం రెన్యువల్ చేసుకోవాలన్నారు. రైతులకు ఏమన్నా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి జిల్లా వ్యవసాయ, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. రైతులకు ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ చేయడం పట్ల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీతో ఆనందంలో రైతన్నలు రైతు వేదిక వద్ద బారులు తిరిన రైతులు



**విశ్వంభర, చింతపల్లి :** లక్ష రుణమాఫీ పొందిన రైతులు రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు జరుపుకుంటున్నారు. సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు అన్ని రైతువేదికల వద్ద సంబురాలు, ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. గాంధీ భవన్‌లోనూ భారీగా సంబురాలు నిర్వహిస్తున్నారు. రైతు రుణమాఫీ చేస్తున్న సందర్భంగా టపాకులు కాల్చి, మిఠాయిలు పంచుకొని రైతులు సంబురాలు జరుపుకున్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మండల వ్యవసాయ అధికారిని శ్రావణ కుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష రుణమాఫీ కార్యక్రమానికి రైతులు బారి ఎత్తున తరలివచ్చి బాణ సంచా కాలుస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. గత భారాస ప్రభుత్వం 10 ఏళ్ల పరిపాలనలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని పలువురు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. మొదటి విడతగా రూ. లక్షలోపు రుణమాఫీకి శ్రీకారం చుట్టారని హర్షం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఎరుకల వెంకటయ్య గౌడ్, సంజీవరెడ్డి, రవీందర్ గౌడ్, నర్సిరెడ్డి, ఊజ్జిని నరేందర్ రావు, గోవిందు రవికుమార్, నేరటి వెంకటయ్య, దాసరి రాజు, కృష్ణారెడ్డి, వారాల రామచంద్రం, పూల్ సింగ్, మధు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు, వివిధ పార్టీల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

**విశ్వంభర, భూపాలపల్లి :** ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం.. భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయం మరియు జిల్లా పోలీస్ కార్యాలయంలలో సెక్యూరిటీ గార్డ్స్ మరియు స్వీపర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పని చేయుటకు కాంట్రాక్టు తనకి వస్తుందని నమ్మబలికి కరీంనగర్ టౌన్‌కు చెందిన గుర్రం శ్రీనివాసరావు అను అతను, అతని కింద పని చేసే సన్నాయిల సుభాష్, మోకిడి అశోక్ కలిసి భూపాలపల్లి జిల్లాలోని నిరుద్యోగులు మరియు ఆశావాహుల ఒక్కొక్కరి వద్ద నుంచి లక్ష నుండి రెండు లక్షల రూపాయల వరకు మొత్తం దాదాపు 50 నుంచి 60 లక్షలు వసూలు చేశారు. కొన్ని రోజులు జాబు కల్పించినట్లు వారిచే డ్యూటీలు చేయించి, జీతాలు ఇవ్వకుండా తప్పించుకు తిరిగేసరికి వారికి అనుమానం రావడంతో గుర్రం శ్రీనివాసరావును నిలదీసారు. దాంతో కొంత మందికి డబ్బులు తిరిగి ఇచ్చి మిగతా బాధితులకు చెక్కులు రాసి ఇవ్వగా శ్రీనివాసరావు అకౌంట్‌లో డబ్బులు లేకపోయేసరికి డబ్బులు చెల్లించిన నిరుద్యోగులు శ్రీనివాసరావును నిలదీసారు. అతడు మరియు అతని కింద పని చేసే వ్యక్తులు అందరు కలిసి భూపాల్పల్లి కలెక్టరేట్ కార్యాలయం పక్కన వారిని కొట్టి వారి వద్ద గల చెక్కును లాక్కుని చంపుతానని బెదిరించగా ఇట్టి విషయమై భాదితుడైన దొంగల చందు భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో శ్రీనివాసరావు, అతని కింద పనిచేసే సుభాష్, అశోక్ పై ఫిర్యాదు చేసాడు. వారిపై కేసు నమోదు చేసి నిందితులను పట్టుకొని వారి నుంచి అట్టి చెక్కును, మరియు వారి వద్ద గల ఒక కారును స్వాధీనపరచుకొని రిమాండ్ కు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. ఎవరైనా నిరుద్యోగుల మరియు ఆశావహులను ఆసరాగా చేసుకుని ఉద్యోగాలు పెట్టిస్తామని డబ్బులు వసూలు చేసి మోసం చేస్తే చట్ట పరంగా వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కేసు చేధనలో ఉత్తమ విధులు నిర్వర్తించిన డిఎస్పీ సంపత్ రావు, భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, భూపాలపల్లి, సిసిఎస్ ఎస్ఐ లు ప్రసాద్, సుధాకర్, రమేష్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ సదానందం, భూపాలపల్లి పి ఎస్ కానిస్టేబుళ్ళు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, రాంబాబులను ఎస్పి కిరణ్ ఖరే అభినందించారు.



# మరణం అనివార్యం.. విధి నుంచి ఎవరూ తప్పించుకోలేరు..

### తొక్కిసలాట ఘటనపై భోలేబాబా



**విశ్వంభర, హత్రాస్:** హత్రాస్ తొక్కిసలాట ఘటనపై స్వయం ప్రకటిత బాబా నారాయణ్ శంకర్ హరి అలియాస్ భోలేబాబా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనలో 121 మంది ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేస్తూనే.. మరణం అనివార్యమని, విధిరాతను ఎవరూ తప్పించలేరని పేర్కొన్నారు. ముందో, వెనకో ప్రతి ఒక్కరూ తప్పక మరణించాల్సిందేనని వ్యాఖ్యానించారు. "జులై 2 నాటి హత్రాస్ ఘటన తర్వాత మనమందరం తీవ్రమైన డిప్రెషన్‌లో ఉన్నాం. అయితే విధిని ఎవరూ తప్పించుకోలేరు. ఎవరొచ్చినా రాకున్నా సరే, ఏదో ఒకరోజు ముందో, వెనకో వెళ్లిపోవాల్సిందే" అని వ్యాఖ్యానించారు. కొందరు వ్యక్తులు తమ సంస్థ నిర్వహిస్తున్నఆధ్యాత్మిక విధానాల పరువు తీసేందుకు ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే తొక్కిసలాట జరిగిందని భోలే బాబా పేర్కొన్నారు. దీనివెనక కుట్ర ఉందని ఆరోపించారు.

# ఫాస్టాగ్‌ను అమర్చని వాహనదారుల నుంచి రెట్టింపు టోల్ వసూలు




**విశ్వంభర, ఢిల్లీ:** టోల్‌గేట్ల వద్ద రద్దీ నియంత్రణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అద్దం పై 'ఫాస్టాగ్'ను అమర్చని వాహనదారుల నుంచి రెట్టింపు టోల్ వసూలు చేయాలని నిర్ణయించింది.ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది. ఫాస్టాగ్‌ను ఉద్దేశపూర్వకంగా విండ్‌స్క్రీన్‌పై అతికించక పోవడం వల్ల టోల్ ప్లాజాల వద్ద జాప్యం ఏర్పడుతోందని, తద్వారా తోటి వాహనదారులకు అసౌకర్యం కలుగుతోందని పేర్కొంది.

**మార్గదర్శకాలివే..**

ముందు అద్దంపై ఫాస్టాగ్ అతికించకుండా టోల్ దాటే వాహనాలకు విధించే జరిమానాకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ప్లాజాల ప్రవేశ మార్గాల్లో ప్రదర్శించాలి.ఫాస్టాగ్ లేని కేసుల్లో ఆ వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్‌తో కూడిన సీసీటీవీ ఫుటేజీలను భద్రపరచాలి.దీంతో టోల్ లైనులో వాహనం వెళ్లినట్లు నిర్ధరించుకునేందుకు అవకాశం ఉంటుంది.నిబంధనల ప్రకారం ఫాస్టాగ్‌ను అతికించని వాహనాలకు రెట్టింపు టోల్ విధించడంతోపాటు బ్లాక్‌లిస్ట్‌లో వెళ్లిపోయే అవకాశం ఉంటుంది.ఫాస్టాగ్‌లను జారీ చేసే బ్యాంకులు కూడా వాహనంపై నిర్దేశించిన చోట వాటిని అతికించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

# నీట్ యూజీ పేపర్ లీక్.. నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు అరెస్ట్




**విశ్వంభర, పాట్నా:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన సీబీఐ అధికారులు..తాజాగా బిహార్‌లోని పాట్నా ఎయిమ్స్‌లో చదువుతున్న నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థుల్ని అదుపులోకి తీసుకున్నారు.అరెస్టయిన వారిలో ముగ్గురు (చందన్ సింగ్, కుమార్ షా,రాహుల్ అనంత్‌ను) ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతుండగా.. మరొకరు (కరన్ జైన్) మొదటి సంవత్సరం చదువుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నలుగురు విద్యార్థుల్ని విచారించాల్సి ఉందని ..ఎయిమ్స్ సీనియర్ ఫ్యాకల్టీ సభ్యుల సమక్షంలో హాస్టల్ గదుల నుంచి తీసుకెళ్లారు. అనంతరం వారి హాస్టల్ గదుల్ని సీల్ చేశారు. వీరిని డీన్, హాస్టల్ వార్డెన్, డైరెక్టర్ ఓఎస్‌డీ సమక్షంలో సీబీఐ అదుపులోకి తీసుకున్నట్లు ఎయిమ్స్ పట్నా డైరెక్టర్ జీకే పాల్ పేర్కొన్నారు. కాగా, నీట్ పరీక్ష జరగడానికి ముందు ఝార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఎన్టీఏ కి చెందిన ట్రంక్ పెట్టె నుంచి నీట్ పేపర్‌ను తస్కరించాడన్న కేసులో 2017 బ్యాచ్ ఎన్ఐటీ జంషెడ్‌పుర్ సివిల్ ఇంజినీర్ పంకజ్ కుమార్ అలియాజ్ ఆదిత్యను అరెస్టు చేసిన రెండు రోజుల తర్వాత వీరిని అదుపులోకి తీసుకోవడం గమనార్హం.

# అమెజాన్ అడవుల్లో అరుదైన తెగ..



**విశ్వంభర, అమెజాన్:** అమెజాన్ అడవుల్లో సంచరించే అరుదైన తెగకు సంబంధించిన ఫొటోలు, వీడియో తొలిసారి వెలుగులోకి వచ్చాయి. పెరువియన్ అమెజాన్‌లో సంచరిస్తున్న ఈ తెగను మాష్కో పైరోగా గుర్తించారు. సర్వైవల్ ఇంటర్నేషనల్ అనే స్వదేశీ హక్కుల అడ్వకసీ గ్రూప్ ఈ ఫొటోలను విడుదల చేసింది. బాహ్య ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా నివసించే గిరిజన తెగల్లో ఇదే అతిపెద్దదని చెబుతున్నారు. పెరు సమీపంలోని Las Piedras River లాస్ పీడ్రాస్ నదికి సమీపంలో వీరు సంచరిస్తూ కనిపించారు. ఈ ప్రాంతంలో మాష్కో పైరోలు సంచరిస్తున్నారని చెప్పేందుకు ఇది తిరుగులేని సాక్ష్యమని స్థానిక దేశీయ సంస్థ పెనామడ్ అధ్యక్షుడు ఆల్ఫ్రెడో వర్గాస్ పియో తెలిపారు. ఈ ప్రాంతాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమవడమే కాకుండా లాంగింగ్ కంపెనీలకు ఈ ప్రాంతాన్ని విక్రయించిందని ఆయన ఆరోపించారు. మారుమూల గ్రామాలైన మోంటే సాల్వడో, ప్యూర్టో న్యూవో సమీపంలో ఈ తెగ ఆహారం కోసం అన్వేషిస్తూ ఇలా కెమెరా కంటికి చిక్కింది. ఈ తెగవారు బయటకు రావడంతో స్థానికులకు, వారికి మధ్య పోరాటాలు జరిగే అవకాశం ఉందని పియో ఆందోళన వ్యక్తం చేశారు.

# పట్టాలు తప్పిన చండీగఢ్ దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్



**విశ్వంభర, గోండా:** చండీగఢ్ దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు (15904) గురువారం ప్రమాదానికి గురైంది. ఉత్తరప్రదేశ్ లోని గోండా సమీపంలో పట్టాలు తప్పింది. గోండా, జిలాహి మధ్య ఉన్న పికౌరా ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం ధాటికి 12 బోగీలు పట్టాలు తప్పాయి. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ ఆదేశించారు. గాయపడిన వారికి వెంటనే వైద్యసహాయం అందించాలని సూచించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణకి రైల్వే శాఖ ఆదేశించింది.ప్రమాదంలో ఇద్దరు చనిపోగా, 60 మంది వరకు గాయపడినట్టు సమాచారం.పట్టాలు తప్పిన బోగీల నుంచి ప్రయాణికులను కాపాడేందుకు స్థానికుల సహాయంతో అధికారులు ప్రయత్నిస్తున్నారు. 15 అంబులెన్స్‌లతో 40 మంది సభ్యుల వైద్య బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ కూడా ప్రమాదంపై స్పందించారు. అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల సహాయార్థం రైల్వేశాఖ హెల్ప్ లైన్ నంబర్లను ప్రకటించింది.

# ముంబై డబ్బావాలాను కాపీ కొట్టిన బ్రిటన్ కంపెనీ



**విశ్వంభర, ముంబై :** ముంబై డబ్బావాలాల ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ఓ మీడియా ఛానల్ రూపొందించిన డాక్యుమెంటరీతో డబ్బావాలాలు విదేశాలకు పరిచయమయ్యారు. ఈ కాన్సెప్ట్ ను కాపీ కొట్టి బ్రిటన్ లో ఓ కంపెనీయే వెలిసింది. గడిచిన ఆరేళ్లుగా లండన్ వాసులకు విజయవంతంగా సేవలందిస్తోంది. కంపెనీ పేరును కూడా డబ్బావాలాను గుర్తుచేసేలా 'డబ్బాడ్రాప్' అంటూ పెట్టడం విశేషం. తాజా ఆహారాన్ని కస్టమర్లకు చేర్చడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణే లక్ష్యంగా డబ్బాడ్రాప్ కంపెనీని స్థాపించారట. కంపెనీ స్థాపించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా డబ్బాడ్రాప్ కంపెనీ ఇన్ స్టాలో ఓ వీడియో పోస్ట్ చేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఆ వీడియోలో తమ కస్టమర్లకు అందించే సేవల గురించి కంపెనీ చక్కగా చూపించింది. డబ్బాలో ఆహార పదార్థాలను సర్దడం మొదలుకొని కస్టమర్ వాటిని ఆరగించే వరకూ ఈ షార్ట్ వీడియోలో డబ్బాడ్రాప్ నిర్వాహకులు చూపించారు. స్టీల్ టిఫిన్ క్యారేజీలో ఓ డబ్బాలో అన్నం, మరో డబ్బాలో పన్నీర్ కర్రీ, మిక్స్ డ్ వెజిటబుల్ కర్రీని సంస్థ సిబ్బంది నీట్ గా ప్యాక్ చేశారు. ఆపై డబ్బాను ఓ రుమాలుతో కడతారు. డబ్బాడ్రాప్ సిబ్బంది వీటిని ఎలక్ట్రిక్ సైకిల్ తో వాటి చిరునామాలకు చేరుస్తారు. ఈ పద్ధతి ద్వారా గడిచిన ఆరేళ్లలో లండన్ లో 3.75 లక్షల ప్లాస్టిక్ కంటెయినర్ల వాడకాన్ని తప్పించినట్లు డబ్బాడ్రాప్ పేర్కొంది. డబ్బాడ్రాప్ కు ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందని, ప్రస్తుతం లండన్ కే పరిమితమైన సేవలను త్వరలోనే దేశమంతటా విస్తరిస్తామని కంపెనీ పేర్కొంది.

# అమూల్ మజ్జిగ ప్యాకెట్‌లో పురుగులు




**విశ్వంభర, ముంబై :** అధిక ప్రొటీన్ మజ్జిగతో పాటు అమూల్ కంపెనీ పురుగులను కూడా ఫ్రీగా పంపించిందంటూ ఓ కస్టమర్ తీవ్ర నిరసన వ్యక్తం చేశాడు. తను అందుకున్న బటర్ మిల్క్ ప్యాకెట్ ను, వాటిలో తిరుగుతున్న పురుగులను ఫొటోలు, వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. దీంతో ఈ పోస్టు వైరల్ గా మారింది. గంటల వ్యవధిలోనే లక్షలాది మంది ఈ పోస్టును చూశారు. అమూల్ కంపెనీ తీరుపై నెటిజన్లు కామెంట్లలో దుమ్మెత్తిపోస్తున్నారు. ఇలాంటివి మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలంటూ ఫుడ్ సేఫ్టీ అధికారులను కోరుతున్నారు. అమూల్ కస్టమర్ ఒకరు తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ట్విట్టర్ లో నెటిజన్లతో పంచుకున్నారు. ఇటీవల తాను ఆన్ లైన్ వేదికగా అమూల్ బటర్ మిల్క్ ఆర్డర్ చేశానని చెప్పారు. అయితే, కంపెనీ నుంచి వచ్చిన ప్యాకెట్ ను విప్పిచూశాక షాక్ కు గురయ్యానని వివరించారు. ప్యాకెట్ లో పురుగులు కనిపించడమే కారణమని చెప్పారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. తమకూ ఇలాంటి అనుభవమే ఎదురైందని, అమూల్ ఉత్పత్తులు ఎవరూ కొనొద్దని కామెంట్లు పెడుతున్నారు. ఈ వీడియోను ఏకంగా నాలుగున్నర లక్షల మంది చూశారు. వీడియో వైరల్ కావడంతో అది అమూల్ కంపెనీ దాకా చేరింది. దీంతో సదరు కంపెనీ వివరణ ఇచ్చింది. కస్టమర్ కు క్షమాపణలు చెబుతూ మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కస్టమర్ కు హామీ ఇచ్చింది.

## నక్సలైట్ల ఘాతుకం.. ఇద్దరు భద్రతా సిబ్బంది మృతి..

# మరో నలుగురికి గాయాలు



**విశ్వంభర, బీజాపూర్ :** జిల్లాలో నక్సల్స్ దారుణానికి పాల్పడ్డారు. ఐఈడీని పేల్చి ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రాణాలు తీశారు. మరో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారని బస్తర్ పోలీసులు తెలిపారు. బీజాపూర్, దంతేవాడ, సుక్మా సరిహద్దు ప్రాంతంలో దర్భా డివిజన్, వెస్ట్ బస్తర్ డివిజన్ నక్సల్స్ ఉన్నట్లు సమాచారం అందడంతో భద్రతా సిబ్బంది సోదాలు నిర్వహించింది. ఇందులో ఎస్టీఎఫ్, డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. నక్సలైట్ల దాడిలో మృతి చెందిన జవాన్లను రాయ్‌పూర్‌కు చెందిన కానిస్టేబుల్ భరత్ సాహు, నారాయణపూర్‌కు చెందిన కానిస్టేబుల్ సత్యర్ సింగ్ కాంగేగా అధికారులు గుర్తించారు. భద్రతా సిబ్బంది సెర్చ్ ఆపరేషన్ ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగిందని వివరించారు. గాయపడిన జవాన్లకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాగా, బుధవారం కూడా నక్సలైట్ల వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించిన భద్రతా సిబ్బంది మహారాష్ట్రఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని వండోలి గ్రామం వద్ద 12 మంది నక్సల్స్‌ను హతమార్చిన విషయం తెలిసిందే. అలాగే. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాతి రోజే నక్సలైట్లు ఐఈడీ పేల్చి జవాన్ల ప్రాణాలు తీయడం గమనార్హం.

# గాజాలో తక్షణమే కాల్పుల విరమణ చేపట్టండి: భారత్



**విశ్వంభర, గాజా :** ఇజ్రాయెల్ హమాస్ల మధ్య యుద్ధం భీకరంగా సాగుతోంది. ముఖ్యంగా ఇజ్రాయెల్ గాజాలో వరుస దాడులకు పాల్పడుతూ పౌరుల ప్రాణాలకు హాని కలిగిస్తోంది. ఆ దేశం చేస్తున్న దాడులతో గాజా విలవిలలాడుతోంది. ఇప్పటికే వేల సంఖ్యలో పౌరులు మృతి చెందారు. వారిలో ఎక్కువగా మహిళలు, చిన్నారులే ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఈ యుద్ధానికి వీలైనంత త్వరగా ముగింపు పలకాలని ఐక్యరాజ్య సమితితో పాటు ప్రపంచ దేశాలు ఇజ్రాయెల్, హమాస్లకు సూచిస్తున్నాయి. అయినా అవి పట్టించుకోవడం లేదు.హమాస్ ఉగ్రవాదుల అంతమే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల్లో ఎంతోమంది అమాయక ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో గాజాలో కాల్పుల విరమణను పాటించాలని భారత్ మొదటి నుంచి పిలుపునిస్తోన్న సంగతి తెలిసిందే. ఐక్యరాజ్య సమితి వేదికగా తాజాగా మరోసారి తక్షణమే పూర్తి స్థాయి కాల్పుల విరమణకు భారత్ పిలుపునిచ్చింది. అలాగే బేషరతుగా బందీలను విడుదల చేయాలని హమాస్‌ను మన దేశం డిమాండ్ చేసింది.



# రత్నభాండాగారం మూడో గదిని తెరిచిన అధికారులు

**విశ్వంభర, పూరి :** ఒడిశాలోని పూరీ జగన్నాథుడి ఆలయ రత్న భాండాగారం మూడో గదిని తెరుస్తున్నారు. శ్రీ క్షేత్రం పూరీ జగన్నాథ్.. ముఖ ద్వారానికి సాష్టాంగ నమస్కారం చేసి లోనికి వెళ్లారు జస్టిస్ విశ్వనాద్ రథ్, జగన్నాథ్ ట్రస్ట్ ఏవో అరవింద్ పాడీ, జిల్లా కలెక్టర్. దాన్ని తెరవాలని ఇప్పటికే పూరీలోని ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయం తీసుకున్న విషయం తెలసిందే. నేటి ఉదయం 9.51 నుంచి 12.15 గంటల మధ్య తెరవాలని జగన్నాథ్ ట్రస్ట్ ఆలయ పండితులు ముహూర్తం ఫిక్స్ చేశారు. పాత ఆభరణాలు, విలువైన వస్తువులు ఖట షేజా గదికి తాత్కాలికంగా తరలించారు. విలువైన సంపదను భద్రపరిచిన తరువాత రత్న భాండాగారం గదిని పూరీ కలెక్టర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐకి అప్పజెప్పారు. రత్న భాండాగార మూడవ గది పరిశరాలపై ఇప్పటికే ఆర్కియాలజీకల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు అధ్యయనం చేశారు. రత్న భాండాగారం నిర్మాణం శిథిలావస్థలో ఉందని వారు చెప్పారు. గోడల నుంచి నీళ్లు కారడం, కొన్ని రాళ్లు కదలడం వంటివి చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. జగన్నాథ ఆలయ ట్రస్ట్, ఉన్నతస్థాయి తనిఖీ కమిటీ, ఒడి సర్కారుతో చర్చల అనంతరం మరమ్మతు పనుల కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసీజర్ సిద్ధం చేయనుంది.

# పోలీసుల అదుపులో ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ తల్లి మనోరమ



**విశ్వంభర, రాయ్‌ఘుడ్ :** భూవివాదంలో రైతులను గన్‌తో బెదిరించిన కేసులో వివాదాస్పద ట్రైయినీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్ తల్లి మనోరమను పుణే పోలీసులు అరెస్ట్ చేశారు. రాయ్‌ఘడ్ హోటల్‌లో నక్కిన మనరోమను పోలీసులు అరెస్ట్ చేశారు. మనోరమపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆమెతో పాటు మరో ఏడుగురిపై కూడా కేసు నమోదయ్యింది. మనోరమను పుణే కోర్టులో హాజరుపర్చారు. మరోవైపు పూజా ఖేద్కర్ తండ్రి దిలీప్ ఖేద్కర్‌కు సంబంధించి సంచలన విషయాలు వెలుగు లోకి వచ్చాయి. రెండుసార్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆయనపై కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది. అధికార దుర్వినియోగం, ఫేక్ సర్టిఫికేట్ల వ్యవహారంపై వివాదంలో ఇరుక్కున్న పూజా ఖేద్కర్‌పై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంది. ఐఏఎస్ ట్రయినింగ్‌ను నిలిపివేసి అకాడమీకి వెనక్కి పిలిపించారు.

# ఉపఎన్నికల వేళ యూపీ బీజేపీలో ముసలం



**విశ్వంభర, ఉత్తరప్రదేశ్:** ఉప ఎన్నికల వేళ ఉత్తర్ ప్రదేశ్ రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆ రాష్ట్ర బీజేపీలో ముసలం మొదలైంది. సీఎం యోగీ ఆదిత్యనాథ్కు షాక్ ఇచ్చేలా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో వైఫల్యంతో ఉత్తర్ ప్రదేశ్ బీజేపీలో చెలరేగిన కలకలం రోజురోజుకు ముదురుతోంది. ఓటమిపై ఇటీవల పార్టీ నేతల భిన్న వ్యాఖ్యలతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా అన్నట్లు తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య దిల్లీలో ఒంటరిగా భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు, మౌర్యకు మధ్య విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల వైఫల్యంతోపాటు రాష్ట్రంలో త్వరలో జరగనున్న 10 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలపై వారు చర్చించినట్లు సమాచారం. పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలను తొలగించేందుకు కృషి చేయాలని ఆయనకు నడ్డా సూచించినట్లు తెలిసింది. 'పార్టీ అనేది ప్రభుత్వం కంటే గొప్పది. కార్యకర్తల బాధే నా బాధ. ఏ ఒక్కరూ పార్టీ కంటే పెద్దవారు కాదు. కార్యకర్తలు పార్టీకి గర్వకారణం. నా ఇంటి తలుపులు ప్రతి ఒక్కరికీ తెరిచే ఉంటాయి. నేను ఉప ముఖ్యమంత్రి కావడం తరవాతి సంగతి. అంతకంటే ముందు నేను పార్టీ కార్యకర్తను. కార్యకర్తలను మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు గౌరవించాలి' అని ఎక్స్‌లో కేశవ్ ప్రసాద్ మౌర్య పోస్టు పెట్టారు.

# ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది

## వైసీపీ చీఫ్ జగన్



**విశ్వంభర, కడప :** ఆంధ్రప్రదేశ్ లో రాక్షస పాలన కొనసాగుతోందని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ చీఫ్ జగన్ మండిపడ్డారు. వినుకొండలో వైసీపీ కార్యకర్త రషీద్ హత్యపై జగన్ స్పందించారు. రషీద్ కుటుంబానికి సానుభూతి తెలిపారు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి నెలన్నర రోజులు మాత్రమే అయిందని గుర్తుచేశారు. ఈలోపే రాష్ట్రాన్ని హత్యలు, అత్యాచారాలకు కేరాఫ్ అడ్రస్ గా మార్చేశారంటూ టీడీపీ సర్కారుపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అన్నది ఎక్కడా కనిపించడంలేదని, ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ కరవైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని అణగదొక్కడమే లక్ష్యంగా ఈ దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.రాజకీయ కక్షతో దాడులకు తెగబడుతున్నారని జగన్ విమర్శించారు. వినుకొండలో బుధవారం రాత్రి జరిగిన హత్య రాజకీయ కక్ష సాధింపునకు పరాకాష్ఠ అని చెప్పారు. ఈ దారుణం ప్రభుత్వానికి సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి సహా బాధ్యతతో వ్యవహరించాల్సిన వ్యక్తులు రాజకీయ దురుద్దేశాలతో ఇలాంటి దారుణాలను ప్రోత్సహిస్తున్నారని జగన్ ఆరోపించారు. ఎవరి స్థాయిలో వాళ్లు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, పోలీసు సహా యంత్రాంగాలన్నింటినీ నిర్వీర్యం చేశారని అన్నారు. దీంతో నేరగాళ్లు, హంతకులు చెలరేగిపోతున్నారని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదని గుర్తెరిగి హింసాత్మక విధానాలు వీడాలని చంద్రబాబును జగన్ గట్టిగా హెచ్చరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలతో ప్రత్యేక విచారణ జరిపించాలని జగన్ డిమాండ్ చేశారు. ఏపీలో దిగజారిన శాంతిభద్రతల పరిస్థితులపై దృష్టిపెట్టాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా లకు విజ్ఞప్తి చేసినట్లు ట్వీట్ లో తెలిపారు. బాధితులకు పార్టీ తరఫున అండగా నిలబడతామని, అన్ని రకాలుగా ఆదుకుంటామని పార్టీ కార్యకర్తలకు జగన్ హామీ ఇచ్చారు.

## వంగలపూడి అనిత ముందు ఏడ్చేశా..

### హోంమంత్రిని కలిసిన అనంతరం శాంతి భర్త



**విశ్వంభర, మంగళగిరి :** సస్పెండైన దేవాదాయ శాఖ ఉద్యోగిని శాంతి భర్త మదన్ మోహన్ గురువారం సాయంత్రం ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితను కలిశారు. తన ప్రాణానికి, తన బిడ్డ ప్రాణానికి ముప్పు ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. మంత్రి అనితను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తనను, తన పిల్లల్ని కాపాడుకోవడానికే మీడియా ముందుకు వచ్చానన్నారు. తన కుటుంబానికి న్యాయం చేయమని మంత్రిని కోరినట్లు చెప్పారు.నాలుగు రోజులుగా జరుగుతున్న అంశాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తనతో చెప్పారన్నారు. తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదని మేడం గ్యారెంటీ ఇచ్చారన్నారు. ఓ సమయంలో ఎమోషనల్ అయి మేడం వద్దనే తాను ఏడ్చానని భావోద్వేగానికి లోనయ్యారు. తనకు గుర్తు తెలియని నెంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. తాను అమెరికాలో ఉన్నప్పుడు ఝాన్సీని తన బిడ్డగానే తన భార్య శాంతి చెప్పిందన్నారు. దీంతో ఆ బిడ్డతో ఎమోషనల్‌గా అటాచ్ అయ్యానన్నారు. తనను నయవంచనకు గురి చేశారన్నారు. ఐవీఎఫ్ ద్వారా బిడ్డను కన్నట్లు మొదట చెప్పిందని, ఆ తర్వాత మాటలు మార్చిందన్నారు. పూర్తిగా ఆరా తీయడంతో అసలు విషయం చెప్పిందన్నారు. ఏ భర్త కూడా బయటకు వచ్చిన తన భార్యపై అపనింద వేయరని గుర్తుంచుకోవాలన్నారు.

## శ్రీవాణి ఆఫ్‌లైన్ టిక్కెట్లు రోజుకు 1000



**విశ్వంభర, తిరుపతి :** తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి భక్తులకు కీలక అప్‌డేట్! ఇకపై, శ్రీవాణి ఆఫ్‌లైన్ టిక్కెట్ల కోటా 1000కి మాత్రమే పరిమితం చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరుడి దర్శనానికి పెరుగుతోన్న భక్తుల రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకు మరింత ప్రాధాన్యతను పెంచేందుకు వీలుగా టీటీడీ ఈ చర్యలు తీసుకుంది. జులై 22 నుంచి శ్రీవాణి దర్శన టిక్కెట్ల రోజువారి కోటాను వెయ్యికి పరిమితం చేసింది. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో 900 శ్రీవాణి టిక్కెట్లను మొదట వచ్చిన వారికి ఇస్తారు. మిగిలిన 100 టిక్కెట్లను శ్రీవాణి దాతలకు విమానాశ్రయంలోనే కరెంట్ బుకింగ్ కౌంటర్‌లలో అందుబాటులో ఉంచారు. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి విమానాశ్రయ కౌంటర్‌లో ఈ ఆఫ్‌లైన్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని టీటీడీ వెల్లడించింది.

## కోర్టులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి చుక్కెదురు



**విశ్వంభర, మాచర్ల:** మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టులో చుక్కెదురైంది. పిన్నెల్లికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. తనకు బెయిల్ ఇవ్వాలని పిన్నెల్లి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఎన్నికల సమయంలో జరిగిన హింసకు సంబంధించిన కేసులో ఆయన ప్రస్తుతం నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

## నాడు సీఐడీ కార్యాలయంలో నన్ను చంపేందుకు కుట్రపన్నారు: రఘురామకృష్ణరాజు

**విశ్వంభర, గుంటూరు :** వైసీపీ హయాంలో గుంటూరు సీఐడీ కార్యాలయంలో తనను చంపేందుకు కుట్ర పన్నారని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. కానీ మీడియా వల్లనే నాడు బతికిపోయానన్నారు. గురువారం ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... తన ఫిర్యాదు మేరకు సీఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్, విజయ్ పాల్, మాజీ సీఎం జగన్, జీజీహెచ్ ప్రభావతి మీద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు, పురోగతి తెలుసుకోవడానికి తాను వచ్చానన్నారు. తన దగ్గర ఉన్న సమాచారం అందించడానికి వచ్చానన్నారు. కేసు నమోదైందని... తనపై కుట్ర చేసిన సీఐడీ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో తాను సీఐడీ కార్యాలయానికి వచ్చినప్పుడు... అధికారులు బయటకు వెళ్లగానే ఐదుగురు వచ్చి కొట్టారని తెలిపారు. తనను చిత్రహింసలకు గురి చేసి ఏమీ తెలియనట్లు నటించారన్నారు.



## శాంతి వ్యక్తిగత జీవితంతో మాకు సంబంధం లేదు

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**విశ్వంభర, విశాఖపట్నం:** సస్పెండైన దేవాదాయ శాఖ ఉద్యోగి శాంతి వ్యక్తిగత జీవితంతో తమకు సంబంధంలేదని ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆమె అక్రమాలపై విచారణ జరుగుతోందన్నారు. ఆరోపణలపై కమిషనర్ స్థాయిలో అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నివేదించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెద్దల అండతో నివేదికలను తొక్కి పెట్టారని ఆరోపించారు. శాంతి గతంలో విశాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేసినట్లు తెలిపారు. ఆమె హయాంలో అవకతవకలు జరిగినట్లు గుర్తించి, విచారణ జరిపారని వెల్లడించారు. ఈ అవకతవకల నుంచి ఆమె తప్పించుకునే ప్రయత్నాలు చేసిందన్నారు. ఆమె తప్పు చేసినట్లుగా నివేదికలు చెప్పినప్పటికీ... ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో వాటిని తొక్కిపెట్టినట్లుగా కనిపిస్తోందన్నారు. ఆ నివేదికలను బహిర్గతం చేయలేదన్నారు.విశాఖలో ఆరేడు దేవస్థానాలలో విచారణ జరిపితే అవకతవకలు ఉన్నట్లుగా వెల్లడైందన్నారు. అయినప్పటికీ ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక నివేదికలు పరిశీలించి ఆమెపై చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. మొదట ఆమెపై ఇన్ని ఆరోపణలు రాలేదన్నారు. మొదట ఆమెను సస్పెండ్ చేశామని, ఆ తర్వాత ఎన్నో విషయాలు వెలుగు చూశాయన్నారు. తాము ఆలయానికి భూములు ఇస్తే వాటిని అమ్ముకున్నారని పలువురు ఆరోపించినట్లు తెలిపారు. శాంతి పని చేసిన ఆలయాల్లో జరిగిన అవకతవకలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించామన్నారు. నివేదిక వచ్చాక శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నివేదికలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

## అవినీతి గురించి వైఎస్ జగన్ మాట్లాడడం రోత పుట్టిస్తోంది

### మంత్రి నారా లోకేశ్



**విశ్వంభర, మంగళగిరి :** బాధితులనే నిందితులు చేసి ప్రభుత్వం ఉగ్రవాదానికి పాల్పడిన ఆ చీకటి రోజులు రాష్ట్రంలో పోయి నెల దాటిందని, మిగిలిన ఆ అరాచకపు ఆనవాళ్లను కూడా కూటమి ప్రభుత్వం కూకటివేళ్లతో పెకిలించి వేస్తోందని ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విమర్శించారు. హింస, విధ్వంసం, అరాచకం, అన్యాయం, అక్రమం, అవినీతి గురించి మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మాట్లాడడం రోత పుట్టిస్తోందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.ప్రజా తీర్పుతో ఉనికి కోల్పోయిన జగన్... తాను పేటెంటు పొందిన ఫేక్ ప్రచారాలతో అబద్ధపు పునాదులపై మళ్లీ నిలబడాలని చూస్తున్నాడని లోకేశ్ మండిపడ్డారు. అందుకే రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా హత్యా రాజకీయాలంటూ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ''శవాలతో రాజకీయాలు చేసే మీ విష సంస్కృతికి ప్రజలు ఇచ్చిన తీర్పే మొన్నటి ఎన్నికల ఫలితాలు అని ఇంకా అర్థం చేసుకోకపోతే ఎలా? నేరాలు చేసి మళ్లీ వాటిని వేరే వారిపై నెట్టడం అనే మీ కపట నాటకాలకు కాలం చెల్లింది. ప్రజల రక్షణకు కట్టుబడి ఉన్నాం. ఏ ఘటననూ ఉపేక్షించేది లేదు. ఏ నిందితుడినీ వదిలేది లేదు. బెంగళూరు యలహంక ప్యాలెస్‌లో కూర్చుని ఇక్కడ కుట్రలు అమలు చేయాలంటే కుదరదు. మీ హెచ్చరికలకు భయపడే ప్రభుత్వం కాదు. ప్రజలకు, వారి మాన ప్రాణాలకు జవాబుదారీగా ఉండే ప్రజా ప్రభుత్వం ఇది'' అని నారా లోకేశ్ అన్నారు.వినుకొండలో ఓ యువకుడి దారుణహత్యకు టీడీపీయే కారణమంటూ విపక్ష వైసీపీ అధినేత వైఎస్ జగన్ స్పందించిన నేపథ్యంలో కౌంటర్‌గా నారా లోకేశ్ ఈ విధంగా స్పందించారు.

## చంద్రబాబు సీఎంగా ఉంటే.. శాంతి భద్రతలు అదుపులో ఉన్నట్టే

### హోం మంత్రి అనిత



**విశ్వంభర, విజయవాడ:** చంద్రబాబు సీఎంగా ఉంటే..శాంతి భద్రతలు అదుపులో ఉన్నట్టే అన్నారు హోం మంత్రి అనిత. సైకో జగన్ పాలనలో శాంతి భద్రతలను ఎలా వాడుకున్నారో అందరికీ తెలుసు....కొన్ని అరాచక శక్తులు మా ప్రభుత్వ హయాంలో అశాంతి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో శాంతి భద్రతలు అదుపులో ఉంటాయని ప్రజలకు అందరికీ తెలుసు అని.. గత ఐదేళ్లలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో పాటు సాధారణ ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డారని వివరించారు హోం మంత్రి వంగలపూడి అనిత. గత ఐదేళ్లుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లాంటి నేతలకే ఇబ్బందులు ఎదురయ్యాయి....ప్రజలిచ్చిన మద్దతును ఓర్చుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. రెండు పార్టీల వ్యక్తులకు అప్పీల్ చేస్తున్నా అనవసరంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు.... చట్టం ఎవరికైనా ఒక్కటే టీడీపీ, వైసీపీ నేతలు, పార్టీల కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరారు హోం మంత్రి వంగలపూడి అనిత. జగన్ రాష్ట్రపతికి, హోం మంత్రికి రాసే లేఖలో తన బాబాయ్ హత్య కేసు, డ్రైవర్ సుబ్రమణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేసిన కేసు సహా వివిధ ఘటనలను కూడా ప్రస్తావించాలని తెలిపారు. గతం ప్రభుత్వ హాయంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అయ్యింది.... ఇప్పుడిప్పుడే పరిస్థితి మారుతోందని పేర్కొన్నారు. దేనికైనా సమయం వస్తుంది. అన్ని అంశాలు చట్టపరంగా చర్యలు ఉంటాయి.... చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారంటేనే సగం శాంతి భద్రతలు అదుపులో ఉన్నట్టే అని తెలిపారు హోం మంత్రి వంగలపూడి అనిత.

## 'ఏం జరిగినా ముందు టీడీపీ మీద తోసేయడమే..' అంటూ మండిపడిన టీడీపీ!



**విశ్వంభర, వినుగొండ:**

ఆంధ్రప్రదేశ్ లో ఏం జరిగినా ముందు టీడీపీ మీద తోసేయడమే పనిగా పెట్టుకుందని వైసీపీ పార్టీపై అధికార పార్టీ మండిపడింది. వినుకొండలో బుధవారం జరిగిన వైసీపీ కార్యకర్త రషీద్ హత్యపై ట్విట్టర్ లో స్పందించింది. 'పొద్దున్నే 3 గంటలకు ఫోన్ చేసి బాబాయ్‌ని లేపించి, చంద్రబాబు చంపాడని పేపర్ లో వేసిన నీచ చరిత్ర వీళ్ళది.. ఏది జరిగినా, ముందు టీడీపీ మీద తోసేయటమే' అంటూ టీడీపీ అధికారిక ట్విట్టర్ హ్యాండిల్ లో పోస్ట్ చేసింది. బుధవారం జరిగిన దారుణ హత్యలో చనిపోయిన రషీద్, చంపిన షేక్ జిలానీ.. ఇద్దరూ వైసీపీ కార్యకర్తలేనని ట్వీట్ లో పేర్కొంది. ఇద్దరూ వైసీపీ నేత, స్థానిక రౌడీగా పేరొందిన పీఎస్ ఖాన్ కు ప్రధాన అనుచరులేనని వెల్లడించింది. సదరు పీఎస్ ఖాన్ వైసీపీ చీఫ్ జగన్ కు ప్రధాన అనుచరుడని వివరించింది. అయితే, తప్పు ఎవరు చేసినా తప్పేనని, తప్పు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాల్సిందేనని స్పష్టం చేసింది. గడిచిన ఐదేళ్లలో విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ రెచ్చిపోయిన వైసీపీ సైకోలకు పట్టిన మదం దించి, వారు చేసే దారుణాలను ఆపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసింది. రాష్ట్రంలో గంజాయిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.



## జగన్ ధనదాహం వల్ల అంధకారంలోకి పేదలు: దేవినేని ఉమ

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ లోని పేదల జీవితాలను జగన్ తన అవినీతి, ధనదాహంతో అంధకారంలోకి నెట్టాడని టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వర రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతల దోపిడీతో పేదవారి సొంతింటి కల కళ్లముందే చెదిరిపోయిందన్నారు. పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో వారు వేల కోట్ల దోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు. వేల టన్నుల ఐరన్, సిమెంట్ దోచేశారని విమర్శించారు. ఇళ్లు కట్టకుండానే బిల్లులు కాజేశారని, కట్టిన కొన్ని ఇళ్లు కూడా నాసిరకంగా కట్టారని ఆరోపించారు. దీంతో గృహప్రవేశానికి ముందే కొన్ని ఇళ్లు కూలిపోయాయని అన్నారు. ఈ మేరకు గురువారం పేరేచర్లలోని జగనన్న కాలనీలో ఇళ్లను దేవినేని ఉమ పరిశీలించారు. ఏ ఇల్లు చూసినా నేడో రేపో కూలిపోయేలానే ఉందని ఆరోపించారు. కిచెన్, హాల్ లలో పునాది కుంగిపోవడం చూపిస్తూ.. పేదలంటే జగన్ కు ఎందుకంత అలుసని ప్రశ్నించారు. సిమెంట్ కు బదులు బూడిదను వాడి ఉంటారని, అందుకే గోడలు బీటలువారగా, పునాది కుంగిపోయిందని తీవ్ర విమర్శలు చేశారు. అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకుని, వారి నుంచి సొమ్ము రికవరీ చేయాలని ప్రభుత్వాన్ని ఉమ కోరారు.

## జనసేన వీర మహిళలను అవమానించిన వారిని వదిలేది లేదు :మంత్రి నాదేండ్ల మనోహర్



**విశ్వంభర, విజయవాడ:** జనసేన సభ్యత్వ నమోదులో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో వ్యూహంతో ముందుకు వెళ్ళాలి అని తెలిపారు.విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లో మంచి విజయం సాధించాలి.. అన్ని డివిజన్స్ ఒకే ఆలోచనతో ముందుకు వెళ్లాలి.. నామినేటెడ్ పోస్టుల గురించి హడావిడి పెరిగింది.. కష్టపడి పని చేసిన వారి సమాచారం పవన్ కళ్యాణ్ దగ్గర ఉంది అని అన్నారు. అంకితభావంతో పని చేసిన వారు ఫలితాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు అని చెప్పారు. నిజాయతీగా పని చేసిన వారికి గుర్తింపు ఉంటుంది.. తక్కువ సీట్లు అంటు అనేకమంది మాట్లాడారు అని..ఈరోజు ఇండియాలోనే నెంబర్ వన్ గా ఉన్నాం.. మండలిలో కూడా మనం ఉన్నామని మంత్రి నాదేండ్ల మనోహర్ వెల్లడించారు. ఇక, జనసేన పార్టీ అంచలంచెలుగా ముందుకు వెళ్తుంది అని తెలిపారు. విజయవాడలో మనకు జరిగిన నష్టాన్ని అధిగమిద్దాం.. పార్టీ బలోపేతం, కూటమి విజయం కోసం అందరూ నిలబడాలి.. గ్రూపు రాజకీయాలు వద్దు.. అందరూ కలిసికట్టుగా పనిచేయాలి అని ఆయన పిలుపునిచ్చారు. గతంలో జన సైనికులపై దాడి చేసిన వారిని వీర మహిళలను అవమానించిన వారిని వదిలేది లేదు అని వార్నింగ్ ఇచ్చారు .విజయవాడలో జనసేన పార్టీ బలోపేతం అవ్వాలి అని మంత్రి నాదేండ్ల పిలుపునిచ్చారు.

## పల్నాడు వైసీపీ నేత హత్య.. వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు

**విశ్వంభర, కడప:** పల్నాడు వైసీపీ నేత హత్యపై కాంగ్రెస్ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల స్పందించారు. నిన్నటి వినుకొండ హత్య ఘటన అత్యంత దారుణం అన్నారు. ప్రతి ఒక్కరూ గొంతెత్తి ఖండించాల్సిన చర్య అంటూ ఫైర్ అయ్యారు. ఇంకెంత క్షీణించాలి శాంతిభద్రతలు రాష్ట్రంలో! అంటూ ట్వీట్ చేశారు షర్మిల. నడిరోడ్డు మీద ఆటవికంగా నరుక్కుంటుంటే పోలీసులు ఏమి చేస్తున్నట్టు అని మండి పడ్డారు. ఇది వ్యక్తిగత కక్షల వల్ల అయితే నేరస్తుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఇది రాజకీయ హత్య అయితే, కూటమి సర్కారుకు ఇదే హెచ్చరిక అంటూ ఫైర్ అయ్యారు వైఎస్ షర్మిల. ఇటువంటి ఘటనలు ఆదిలోనే ఆపకపోతే ఇది మీకు, రాష్ట్రానికి మంచిది కాదన్నారు. నాగరిక సమాజంలో ఇలాంటి దుశ్చర్యలకు తావు లేదు. అటు చంద్రబాబు గారికి, ఇటు పవన్ కళ్యాణ్ గారికి మా డిమాండ్ ఇదే. వీటికి అడ్డుకట్ట వేస్తారా లేదా? రాష్ట్రం రావణకాష్టం అవుతుంటే మాత్రం చూస్తూ ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు వైఎస్ షర్మిల.

అమెరికాలో టీ20 ప్రపంచకప్..

# భారీ మూల్యం చెల్లించుకున్న ఐసీసీ..!

**విశ్వంభర, స్పోర్ట్స్** : టీ20 ప్రపంచకప్ 2024కు వెస్టిండీస్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చాయి. ఈ మెగాటోర్నీలో భారత జట్టు విజేతగా నిలిచింది. కాగా.. చాలా మ్యాచులకు అమెరికా ఆతిథ్యం ఇచ్చింది. భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సైతం అమెరికాలోని న్యూయార్క్ వేదికగానే జరిగింది. ఈ మ్యాచ్ మినహా మిగిలిన మ్యాచ్‌లకు ఆదరణ కరవైంది. అమెరికాలో క్రికెట్‌కు ఆదరణ పెంచాలన్న ఉద్దేశ్యంతో ఐసీసీ అమెరికాలో మ్యాచులను నిర్వహించింది. అయితే.. దీని వల్ల ఐసీసీకి పెద్ద మొత్తంలో నష్టం వచ్చినట్లుగా తెలుస్తోంది. సుమారు రూ.167 కోట్ల మేర అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కు నష్టం వచ్చిందని వార్తలు వస్తున్నాయి.శ్రీలంక రాజధాని కొలంబో వేదికగా శుక్రవారం నుంచి జరగనున్న వార్షిక సదస్సులో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనట్లుగా తెలుస్తోంది. ఈ సమావేశానికి బీసీసీఐ కార్యదర్శి జైషా హాజరు కానున్నారు. జూలై 19 నుంచి 22 వరకు జరగనున్న వార్షిక సమావేశాల్లో ఐసీసీ ఛైర్మన్ పదవి విషయంపైనా చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదే సమయంలో పాకిస్తాన్ ఆతిథ్యం ఇవ్వనున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం భారత జట్టు పాక్ వెళ్తుందా లేదా అన్న విషయాల పైనా చర్చ జరగనుంది. ఈ ఏడాది నవంబర్‌లో ఐసీసీ కొత్త ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. న్యూజిలాండ్‌కు చెందిన గ్రెగ్ బార్క్‌లే ప్రస్తుతం ఐసీసీ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన్ను 2025 వరకు కొనసాగించే అవకాశాలు లేకపోలేదు. బీసీసీఐ కార్యదర్శి జైషా ఐసీసీ ఛైర్మన్ పదవి రేసులో ఉన్నట్లు సమాచారం. ఒకవేళ జై షా కోరుకుంటే ఆయన ఐసీసీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బీసీసీఐ కార్యదర్శిగా ఆయన పదవి కాలం 2025లో ముగుస్తుంది.



# శ్రీలంక పర్యటన భారత జట్టు ప్రకటన

- టీ20ల్లో కెప్టెన్‌గా సూర్యకుమార్,
- వన్డే జట్టులో శ్రేయాస్‌కు చోటు



**విశ్వంభర, స్పోర్ట్స్ :**

శ్రీలంక పర్యటనకు భారత జట్టును భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ప్రకటించింది. అందరూ ఊహించినట్లుగానే సూర్యకుమార్ యాదవ్‌ను టీ20 కెప్టెన్‌గా నియమించింది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు వన్డేలకు అందుబాటులోకి వచ్చారు. వన్డే కెప్టెన్‌గా రోహిత్ శర్మనే కొనసాగనున్నాడు. ఇక ఆశ్చర్యకరంగా గిల్ ను రెండు ఫార్మాట్లకు వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరుపున అదరగొట్టి, జింబాబ్వే పర్యటనలో రాణించిన యువ ఆటగాడు రియాన్ పరాగ్ టీ20లతో పాటు వన్డే జట్టులోనూ చోటు సంపాదించాడు. యువ పేసర్ హర్షిత్ రాణా కు వన్డే జట్టులో అవకాశం దక్కింది. వ్యక్తిగత కారణాలతో హార్దిక్ పాండ్యా కేవలం టీ20 సిరీస్‌కు మాత్రమే అందుబాటులో ఉన్నాడు. సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయిన శ్రేయస్ అయ్యర్‌తో పాటు కేఎల్ రాహుల్‌లు వన్డే జట్టులో స్థానం దక్కించుకున్నారు. యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్ లు కేవలం టీ20 జట్టులోనే చోటు దక్కించుకున్నారు. రిషబ్ పంత్ రెండు ఫార్మాట్లలో ఆడనున్నాడు. మరోవైపు జింబాబ్వేలో సెంచరీ సాధించిన అభిషేక్ శర్మను పట్టించుకోలేదు.

**లంక పర్యటనకు భారత టీ20 జట్టు..**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రింకూ సింగ్, రియాన్ పరాగ్, రిషబ్ పంత్, సంజూ శాంసన్, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ సిరాజ్

**లంక పర్యటనకు భారత వన్డే జట్టు..**

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబె, కుల్‌దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, వాషింగ్టన్ సుందర్, అర్షదీప్ సింగ్, రియాన్ పరాగ్, అక్షర్ పటేల్, ఖలీల్ అహ్మద్, హర్షిత్ రాణా.

# లైన్‌లోకి వచ్చిన కోహ్లీ.. రియాన్ పరాగ్‌కు బంపర్ ఆఫర్!



**విశ్వంభర, స్పోర్ట్స్** : శ్రీలంకతో వచ్చే నెలలో జరగనున్న వన్డే సిరీస్‌కు తాము అందుబాటులో ఉంటామని సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)కి తెలియజేసినట్లు సమాచారం. వచ్చే ఏడాది జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆడాలనుకునే సీనియర్ ఆటగాళ్లు ఖచ్చితంగా శ్రీలంకతో వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండాలని కొత్త కోచ్‌గా బాధ్యతలు స్వీకరించనున్న గంభీర్ చేసిన అభ్యర్థనకు సీనియర్ ఆటగాళ్లు స్పందించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. ఛాంపియన్ ట్రోఫీకి ముందు భారత జట్టు కేవలం రెండు వన్డే సిరీస్‌లు మాత్రమే ఆడనుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే లంకతో మూడు వన్డేలతో పాటు ఇంగ్లాండ్‌తో మూడు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఈ క్రమంలో ఈ వన్డే మ్యాచుల్లో ఖచ్చితంగా సీనియర్ ఆటగాళ్లు ఆడాలని గంభీర్ సూచించాడు. తొలుత లంక పర్యటన వెళ్లొందని, విశ్రాంతి తీసుకోవాలని రోహిత్, కోహ్లీ భావించారు. అయితే గంభీర్ అభ్యర్థన మేరకు వీరిద్దరు మనసు మార్చుకున్నట్లుగా అర్థమవుతోంది.కాగా.. ఈ పర్యటనకు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. సెప్టెంబర్ నుంచి టెస్టు సీజన్ ఆరంభం కానుండడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇక హార్దిక్ పాండ్యా టీ20 సిరీస్‌కు మాత్రమే అందుబాటులో ఉండనున్నాడు. వ్యక్తిగత కారణాలతో వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండనని ఇప్పటికే బీసీసీఐకి హార్దిక్ సమాచారం ఇచ్చాడు. జూలై 27 నుంచి టీ20 సిరీస్, ఆగస్టు 2 నుంచి వన్డే సిరీస్ ఆరంభం కానున్నాయి. లంక పర్యటనకు సంబంధించి భారత జట్లను బీసీసీఐ ఒకటి లేదా రెండు రోజుల్లో ప్రకటించనుంది. వన్డేల్లో కెప్టెన్‌గా రోహిత్ శర్మనే వ్యవహరించనుండగా, టీ20ల్లో మాత్రం సూర్యకుమార్‌కు బాధ్యతలు అప్పగించనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. యువ ప్లేయర్ రియాన్ పరాగ్ టీ20లు, వన్డేలకు ఎంపిక కానున్నట్లుగా తెలుస్తోంది. అలాగే రోడ్డు ప్రమాదం కారణంగా 20 నెలలు వన్డేలకు దూరమైన పంత్ వన్డేల్లో లంక పర్యటనతో రీ ఎంట్రీ ఇవ్వనున్నాడు.

# శ్రీలంక పర్యటనలో సూర్యకుమార్ యాదవ్‌ను ఊరిస్తున్న భారీ రికార్డు



విశ్వంభర, స్పోర్ట్స్ : టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ 2024ను గెలవడంలో స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ తన వంతు పాత్ర పోషించాడు. పొట్టి ప్రపంచకప్ అనంతరం సూర్యకుమార్ యాదవ్ విశ్రాంతి తీసుకుంటున్నాడు. శ్రీలంక పర్యటనతో అతడు మైదానంలో అడుగుపెట్టనున్నాడు. అన్నీ అనుకూలించినట్లయితే.. అతడు లంక పర్యటనలో టీ20ల్లో టీమ్‌ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు వార్తలు వస్తున్నాయి.ఈ విషయాన్ని కాస్త పక్కన బెడితే.. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్‌ను ఓ అరుదైన రికార్డు ఊరిస్తోంది. లంకతో మూడు మ్యాచుల టీ20 సిరీస్‌లో సూర్య గనుక 160 పరుగులు చేస్తే.. అంతర్జాతీయ టీ20ల్లో టీమ్‌ఇండియా తరుపున 2500 పరుగులు చేసిన మూడో ఆటగాడిగా నిలవనున్నాడు. ఇప్పటి వరకు సూర్యకుమార్ 68 మ్యాచుల్లో 2340 పరుగులు చేశాడు.అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు మాత్రమే భారత్ తరుపున 2500 పరుగులు చేశారు. అంతేకాదండోయ్.. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లుగానూ వీరిద్దరే కొనసాగుతున్నారు. 159 టీ20 మ్యాచుల్లో 4231 పరుగులతో రోహిత్ శర్మ అగ్రస్థానంలో ఉండగా, 125 మ్యాచుల్లో 4188 పరుగులతో విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచాడు. ఇక వీరిద్దరి తరువాత పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజాం 123 మ్యాచుల్లో 4145 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. కాగా.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఇప్పటికే టీ20 క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# నటాషాతో విడాకులు.. అఫీషియల్‌గా ప్రకటించిన హార్దిక్ పాండ్యా..

**విశ్వంభర, స్పోర్ట్స్** : గత కొన్నాళ్లుగా టిమిండియా క్రికెటర్ హార్దిక్ పాండ్యా వ్యక్తిగత జీవితంపై అనేక రూమర్స్ వినిపించిన సంగతి తెలిసిందే. తన భార్య నటాషాతో హార్దిక్ విడిపోయారని.. వీరిద్దరు విడాకులు తీసుకున్నారంటూ ప్రచారం నడిచింది. అయితే ఇప్పుడు ఆ రూమర్స్ నిజమేనంటూ తేల్చేశారు హార్దిక్ పాండ్యా. భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన భార్య నటాషాతో విడాకులు తీసుకున్నట్లు ప్రకటించారు. డివోర్స్ విషయాన్ని వీరిద్దరు తమ సోషల్ మీడియా ఖాతాలలో అధికారికంగా వెల్లడించారు. ఇది తమకు చాలా కఠినమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఇద్దరూ విడిపోయినా.. తమ మూడేళ్ల కొడుకు అగస్త్య బాధ్యతలను తల్లిదండ్రులుగా కొనసాగిస్తామని తెలిపారు. "నాలుగు సంవత్సరాలు కలిసి ఉన్న తర్వాత, నటాషా, నేను పరస్పరం విడిపోవాలని నిర్ణయించుకున్నాము. మేము కలిసి ఉండేందుకు చాలా ప్రయత్నం చేసాము. మా ఇద్దరికి ఇది కఠినమైన నిర్ణయమే.. కానీ మా ఇద్దరికీ ఇది మంచి ప్రయోజనం



చేకూరుస్తుందని మేము నమ్ముతున్నాము. మేము కలిసి ఆనందించిన సమయం, పరస్పర గౌరవం, ఒక కుటుంబంగా ఎదిగాము. ఈ ప్రయాణాన్ని మేము సంతోషించాము. మా అబ్బాయి అగస్త్యకు మంచి కో పేరెంట్స్ గా ఉంటాం. అతడిని సంతోషంగా ఉంచడం కోసం ఏం చేయడానికైనా సిద్ధమే. ఈ కష్ట సమయంలో మా గోప్యతను గౌరవిస్తూ.. మద్దతు ఇవ్వాలని అందరిని కోరుకుంటున్నాను.. " అని పాండ్యా, నటాషా తమ ఇన్ స్టాలలో షేర్ చేశారు. ఇదిలా ఉంటే.. నటాషా తన ఇన్ స్టాలో పాండ్యా ఇంటి పేరుతోపాటు తమ పెళ్లి ఫోటోలను తొలగించినప్పటి నుంచి విడాకుల రూమర్స్ ఊపందుకున్నాయి. ఆ తర్వాత వీరిద్దరు కలిసి కనిపించలేదు. ఇటీవల టీ20 వరల్డ్ కప్ విజేతగా టీమిండియా నిలిచిన తర్వాత నటాషా తీరుపై నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ పెళ్లి వేడుకలలోనూ హార్దిక్ పాండ్యా ఒంటరిగా హాజరవ్వడంతో వీరిద్దరి విడాకుల రూమర్స్‌కు మరింత బలం చేకూరింది. ఇటీవలే తన కుమారుడు అగస్త్యను తీసుకుని నటాషా సెర్బియాకు వెళ్లిపోవడంతో విడాకులు నిజమేనని అందరూ ఫిక్స్ అయ్యారు. ఇప్పుడు తాము నిజంగానే విడిపోతున్నామంటూ అధికారికంగా ప్రకటించారు. కానీ వీరిద్దరు విడిపోవడానికి కారణాలు తెలియరాలేదు.

# బీఎస్ఎన్ఎల్ నుంచి మరో సూపర్ ప్లాన్.. తక్కువ ధరలో 28 రోజుల వ్యాలిడిటీ

**విశ్వంభర, బిజినెస్** : ప్రస్తుతం టెలికాం రంగంలో పోటీ పెరిగింది. ప్రముఖ ప్రైవేట సంస్థలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు భారీగా టారిఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇదే సమయంలో ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ యూజర్లను ఆకట్టుకుంటోంది. తక్కువ ధరలో రీఛార్జ్ ప్లాన్స్‌ను తీసుకొస్తోంది. ఇప్పటికే చాలా మంది ఇతర టెలికాం సంస్థల నుంచి బీఎస్ఎన్ఎల్‌లోకి పోర్ట్ అవుతున్న విషయం తెలిసిందే. యూజర్లను మరింత అట్రాక్ట్ చేసే క్రమంలో బీఎస్ఎన్ఎల్ తాజాగా మరో ఆసక్తికరమైన రీఛార్జ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. రూ. 139తో కొత్త రీఛార్జ్ ప్లాన్‌ను బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని నెట్‌వర్క్‌లకు అన్‌లిమిటెడ్ కాల్స్ చేసుకోవచ్చు. ప్రతీ రోజూ 1.5 జీబీ డేటా లభిస్తుంది. డేటా పూర్తయిన తర్వాత సెకనుకు 40 kbps వేగంతో డేటాను ఉపయోగించవచ్చు. మరే ఇతర టెలికాం రంగంలో ఇలాంటి రీఛార్జ్ ప్లాన్ లేదని చెప్పాలి. ఇదిలా ఉంఏ దీంతో పాటు బీఎస్ఎన్ఎల్ రూ. 197 ప్లాన్‌ను తీసుకొచ్చారు. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. అయితే రోజుకు 2 జీబీ డేటా పొందొచ్చు. రోజుకు 100 ఉచిత ఎస్ఎమ్ఎస్‌లు పొందొచ్చు. అన్‌లిమిటెడ్ కాల్స్ లభిస్తాయి. డేటా ఎక్కువగా కావాలనుకునే వారికి ఈ ప్లాన్ బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు. వీటితో పాటు బీఎస్ఎన్ఎల్ మరెన్నో అదిరిపోయే రీఛార్జ్ ప్లాన్‌స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాయి. వీటిలో కొన్ని బెస్ట్ ప్లాన్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఏడాది ప్లాన్ కోసం చూస్తున్న వారికి బీఎస్ఎన్ఎల్ మంచి ప్లాన్‌ను తీసుకొచ్చింది. రూ. 2399తో రీఛార్జ్ చేసుకుంటే 395 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. ఈ ప్లాన్‌లో రోజుకు 2 జీబీ డేటా లభిస్తుంది. వీటితో పాటు దేశంలోని అన్ని టెలికాం నెట్‌వర్క్‌లకు అన్‌లిమిటెడ్ కాల్స్ పొందొచ్చు. అలాగే ప్రతీ రోజూ 100 ఉచిత ఎస్ఎమ్ఎస్‌లను పొందొచ్చు. ఇదిలా ఉంటే బీఎస్ఎన్ఎల్ ప్రస్తుతం దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 4జీ సేవలను అందిస్తోన్న విషయం తెలిసిందే. మరికొన్ని రోజుల్లోనే దేశవ్యాప్తంగా 4జీ సేవలను విస్తరించి. 5జీ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. మరి బీఎస్ఎన్ఎల్ ఇస్తున్న పోటీని ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీలు ఎదుర్కోవడానికి ఎలా సిద్ధమవుతాయో చూడాలి.




# రూ.4.3 కోట్ల విలువైన డైమండ్ నెక్లెస్ ధరించిన ఓరీ

**విశ్వంభర, బిజినెస్** : సోషల్ మీడియా సెన్సేషన్ ఓరీ.. అలియాస్ ఓర్హాన్ అవత్రమణి. బాలీవుడ్ తారలతో క్రేజీగా ఫోటోలకు ఫోజులిచ్చి నెట్టింట చాలా ఫేమస్ అయ్యాడు. తక్కువ సమయంలోనే భారతదేశంలోని ప్రముఖ ఇంటర్నెట్ వ్యక్తులలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. బీటౌన్ బీఎఫ్ఎఫ్ గా పిలువబడే ఓరీ విలక్షణమైన శైలి, స్టార్ స్టడెడ్ ఈవెంట్లో తరచుగా హాజరవుతూ నెటిజన్స్ దృష్టిని ఆకర్షించారు. జాన్వీ కపూర్, అనన్య పాండే, దీపికా పదుకొణే, అనంత్ అంబానీ, నీతూ అంబానీ వంటి సెలబ్రెటీలతో క్లోజ్‌గా ఫోటోలకు ఫోజులిస్తుంటాడు. అలాగే ఓరీ స్టైల్, యాటిట్యూడ్, మేనరిజం నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తాయి. ఇటీవల జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ పెళ్లి వేడుకలలోనూ ఓరీ సందడి చేసిన సంగతి తెలిసిందే.తాజాగా ఓరీ ఖరీదైన సర్పెంటి డైమండ్ నెక్లెస్ ధరించిన కొత్త ఫోటోను ఇన్ స్టాలో షేర్ చేయడంతో నెట్టింట తెగ వైరల్ అవుతుంది. ఓరీ ధరించిన ఆ నెక్లెస్ ధర రూ.4.35 కోట్లు అని తెలుస్తోంది. ఓరీ సర్పెంటి డైమండ్ నెక్లెస్‌ను ధరించి ప్రత్యేకమైన ఫ్యాషన్ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఓర్రీ అనంత్ అంబానీ పెళ్లి వేడుకలలోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ హైప్రొఫైల్ ఈవెంట్‌లో అతని ఉనికి ఫ్యాషన్ ఐకాన్‌గా .. భారతదేశంలోని ఉన్నత సామాజిక వర్గాల్లో కోరుకునే అతిథిగా అతని స్థితిని మరింత పటిష్టం చేసింది.

# లాభాల పరంపర.. జీవితకాల గరిష్ఠ స్థాయిలో ముగిసిన దేశీయ మార్కెట్లు

**విశ్వంభర, బిజినెస్** : దేశీయ ఈక్విటీ మార్కెట్ల లాభాల పరంపర కొనసాగుతోంది. వరుసగా నాలుగవ రోజైన గురువారం కూడా లాభాలను నమోదు చేశాయి. ఐటీ, ఆయిల్, గ్యాస్, ఎఫ్ఎంసీజీ కంపెనీ షేర్లు లాభాల్లో పయనించడంతో ఇరు సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ సెన్సెక్స్ 626.91 పాయింట్లు అంటే 0.78 శాతం వృద్ధి చెంది 81,343.46 వద్ద ముగిసింది. సెన్సెక్స్ సూచీ 81 వేల మైలురాయిని తాకడం స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇదే తొలిసారి. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ రికార్డ్ స్థాయిలో ముగిసింది. గురువారం 187.85 పాయింట్లు అంటే 0.76 శాతం లాభపడి జీవితకాల గరిష్ఠ స్థాయి 24,800.85 వద్ద స్థిరపడింది. ఇంట్రాడే గరిష్ఠంగా 224.75 పాయింట్లు లాభపడి గరిష్ఠంగా 24,837.75ను తాకింది. ఐటీ రంగ షేర్లలో టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా గణనీయమైన లాభాల్లో ముగిశాయి. ఇక సూచీలో బడా కంపెనీ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేర్లలో కొనుగోళ్ల జోరు కూడా మార్కెట్ లాభాలకు దోహదపడింది. జూన్ త్రైమాసికంలో ప్రముఖ ఐటీ కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉండవచ్చనే



అంచనాలు, రూపాయి బలహీనపడటంతో ఈ రంగ షేర్లలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు మొగ్గుచూపారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. సెప్టెంబరు నాటికి అమెరికా ఫెడ్ రేటు తగ్గించవచ్చుననే అంచనాల నేపథ్యంలో యూఎస్ బాండ్ ఈల్డ్‌లకు బదులు భారతీయ ఈక్విటీలలోకి పెట్టుబడులకు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మొగ్గుచూపాయని చెప్పారు. కాగా మార్కెట్లు లాభాల్లో ముగిసినప్పటికీ ఏషియన్ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్ వంటి ప్రధాన షేర్లు నష్టాల్లో ముగిశాయి.

# సమీపిస్తున్న ఐటీఆర్ ఫైలింగ్ గడువు.. ఆలస్యమైతే ఏం జరుగుతుంది?

**విశ్వంభర, బిజినెస్ :**

ఆర్థిక సంవత్సరం 202324కు (మదింపు ఏడాది 202425) సంబంధించిన ఆదాయ పన్ను రిటర్న్స్ (ఐటీఆర్)2024 దాఖలుకు గడువు సమీపిస్తోంది. జులై 31 చివరి తేదీగా ఉంది. డెడ్‌లైన్‌లోగా ఐటీఆర్ ఫైలింగ్ చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే గడువు తేదీ తర్వాత ఐటీఆర్ దాఖలు చేస్తే చెల్లింపుదారులు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. జరిమానా ఎంతనేది ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. జరిమానాతో డిసెంబర్ 31, 2024 వరకు ఐటీఆర్ దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుంది.

**జరిమానా ఎవరికి ఎంత ఉంటుంది?**

ఆర్థిక సంవత్సరం 202324కు (మదింపు ఏడాది202425) సంబంధించి నికర పన్ను విధించాల్సిన ఆదాయం రూ. 5 లక్షల కంటే ఎక్కువగా ఉంటే చెల్లింపుదారులు రూ.5000 జరిమానా విధించి ఐటీఆర్ దాఖలు చేయవచ్చు. నికర పన్ను విధించాల్సిన ఆదాయం రూ. 5 లక్షలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే మాత్రం ఆలస్య ఐటీఆర్‌పై చెల్లింపుదారులు రూ.1,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. కాగా పన్ను విధించదగిన ఆదాయం బేసిక్ మినహాయింపు పరిమితి కంటే తక్కువగా ఉన్న వ్యక్తులు, కేవలం రీఫండ్ క్లెయిమ్ కోసం ఐటీఆర్ దాఖలు చేసేవారు ఎలాంటి ఆలస్య జరిమానా చెల్లించాల్సిన అవసరం ఉండదని




ఆదాయ పన్ను విభాగం నిబంధనలు చెబుతున్నాయి.కాగా ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరి అని ఆదాయ పన్ను విభాగం నిబంధనలు చెబుతున్నాయి. లేదంటే చెల్లింపుదారులు జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాదు అవసరమైతే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే సకాలంలో బాధ్యతగా ఐటీఆర్ ఫైలింగ్ చేయడం మంచిదని పన్ను నిపుణులు సూచిస్తున్నారు.



# గరుడవేగ కొత్త సీఈఓగా లక్కరాజు

విశ్వంభర, బిజినెస్ : గరుడవేగ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సతీష్ లక్కరాజు నియామకం కావడం విశేషం. లాజిస్టిక్స్ పరిశ్రమలో 30 సంవత్సరాల అనుభవంతో, విజ్ ఫ్రైట్, ఎజిలిటీ లాజిస్టిక్స్ మరియు డాచెర్ ఇండియాలో కీలక పాత్రలతో సహా, లక్కరాజు గరుడవేగకు నైపుణ్యం యొక్క సంపదను తీసుకువచ్చారు. "గరుడవేగలో చేరడం నాకు గౌరవంగా భావిస్తున్నాను మరియు ఆవిష్కరణ మరియు వృద్ధిని నడిపించడానికి ఎదురు చూస్తున్నాను" అని లక్కరాజు అన్నారు. గరుడవేగ భారతదేశం అంతటా 185+ స్థానాల్లో 400కి పైగా శాఖలను నిర్వహిస్తోంది, USA, UK, UAE, ఆస్ట్రేలియా, కెనడా మరియు మరిన్నింటికి వేగవంతమైన, విశ్వసనీయమైన మరియు తక్కువ ఖర్చుతో కూడిన అంతర్జాతీయ షిప్పింగ్ పరిష్కారాలను అందిస్తుంది. దాని పోటీ ధరలకు మరియు 24/7 కార్యకలాపాలకు ప్రసిద్ధి చెందిన గరుడవేగ ప్రపంచవ్యాప్తంగా భారతీయ వ్యాపారాలకు ఒక ముఖ్యమైన లింక్.

**ఉద్యోగుల సహకారాన్ని జరుపుకోవడం**

గరుడవేగలో సహృదయత, సమిష్టి కృషికి ఈ కార్యక్రమం నిదర్శనం. భారతదేశం అంతటా ఉద్యోగులు అనేక వినోద కార్యక్రమాలలో పాల్గొన్నారు మరియు ఎక్సలెన్స్ అవార్డుల వేడుకలో వారి అత్యుత్తమ సహకారానికి గుర్తింపు పొందారు. ఈ అవార్డులు గరుడవేగను ముందుకు నడిపించే ఉన్నత ప్రమాణాలు మరియు విలువలను ప్రతిబింబిస్తాయి.

## విశ్వక్ సేన్ రాకీ ది మెకానిక్ రిలీజ్ డేట్ ఖరారు



మాస్ క దాస్ విశ్వక్ సేన్ వరుస సినిమాలతో కెరీర్లో దూసుకు పోతున్నాడు. ఈ మధ్య కాలంలో గామి, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన విశ్వక్ ప్రస్తుతం మరో 2 సినిమాలతో బిజీగా ఉన్నాడు.ఇందులో విడుదలయ్యే మొదటి చిత్రం ' రాకీ ది మెకానిక్. ఇప్పటికే ఈ చిత్రం టైటిల్ ఫస్ట్ లుక్ రిలీజ్ కాగా.. తాజాగా రాకీ ది మెకానిక్ విడుదల తేదీ గురించి ప్రకటన వచ్చింది.డెబ్యూ డైరెక్టర్ రవితేజ్ ముళ్లపూడి దర్శకత్వంలో తెరకెక్కిన రాకీ ది మెకానిక్ సినిమా విడుదల తేదీని చిత్ర యూనిట్ ప్రకటించింది. దీపావళి కానుకగా అక్టోబర్ 31న సినిమా రిలీజ్ కానుంది. త్వరలోనే ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ రిలీజ్ కానుంది. ఈ చిత్రం పాన్ ఇండియా హక్కులను ఏషియన్, సురేష్ సంస్థలు సంయుక్తంగా అందుకున్నారు.ఎస్ఆర్టి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. జాక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

## జాన్వీ కపూర్ కు తీవ్ర అస్వస్థత..

బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ తీవ్ర అస్వస్థతకు లోనైంది. తాజాగా ఆమెను ముంబైలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్చినట్లు సమాచారం. ఫుడ్ పాయిజన్ వల్లే జాన్వీ హాస్పిటల్ లో అడ్మిట్ అయినట్లు తెలిసింది. కల్తీ ఆహారం తినడంతో జాన్వీ కపూర్ తీవ్ర అస్వస్థతకు లోనైందని.. దీంతో చికిత్స నిమిత్తం ఆమెను ముంబయిలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని చెప్పారు. కాగా ఈ బాలీవుడ్ బ్యూటీ ఎన్టీఆర్ సరసన 'దేవర' మూవీతో సౌత్ ఇండస్ట్రీ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇస్తోంది. సినిమాలో 'తంగం' అనే పాత్రలో కనిపించనుంది. ఈ మూవీ షూటింగ్ దశలో ఉండగానే గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తో 'RC16' ప్రాజెక్ట్ లో యాక్ట్ చేసే ఛాన్స్ అందుకుంది. ప్రస్తుతం 'దేవర' షూటింగ్ చివరి దశలో ఉంది. సెప్టెంబర్ 27 న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.



బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ శ్రద్ధా కపూర్ గురించి తెలిసిందే. 'ఆషికీ 2' సినిమాతో ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్ గా మారిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత పలు హిట్ మూవీస్ లో నటించింది. పాన్ ఇండియా హీరో ప్రభాస్ తో కలిసి 'సాహూ' సినిమా చేసి.. తెలుగు ప్రేక్షకులకు దగ్గరయింది. ఇక ఈ హీరోయిన్ బాలీవుడ్ లో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'స్త్రీ 2'. అమర్ కౌశిక్ దర్శకత్వం వహించిన ఆ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబయిలో 'ట్రైలర్ లాంచ్ ఈవెంట్' నిర్వహించారు. ఈ వేడుకకు హాజరైన శ్రద్ధా కపూర్‌ను ఓ విలేకరి పెళ్లి గురించి ప్రశ్నించగా.. ఆమె తనదైన శైలిలో సమాధానమిచ్చారు. సినిమాలోని క్యారెక్టర్‌ని ఉద్దేశిస్తూ..' స్త్రీ తనకు ఇష్టమున్నప్పుడు పెళ్లి చేసుకుంటుంది' అని అన్నారు. దీన్ని బట్టి శ్రద్ధా కపూర్ కు ఇప్పుడే పెళ్లి పై ఆసక్తి లేదని అర్థమవుతుంది. మరో వైపు గత కొన్ని నెలలుగా ఈ హీరోయిన్ స్క్రీన్ రైటర్, అసిస్టెంట్ డైరెక్టర్ రాహుల్ మోడీతో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారని వార్తలు ప్రచారమైన విషయం తెలిసిందే. అతనితో కలిసి దిగిన సెల్ఫీని శ్రద్ధ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో.. ఆ వార్తలకు బలం చేకూరినట్టైంది. ఇక 'స్త్రీ 2' విషయానికొస్తే.. 2018లో వచ్చిన హిట్ మూవీ 'స్త్రీ' కి సీక్వెల్‌గా 'స్త్రీ 2' వస్తోంది. రాజ్‌కుమార్ రావ్, పంకజ్ త్రిపాఠి, అభిషేక్ బెనర్జీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తమన్నా ప్రత్యేక గీతంతో అలరించనున్నారు.

## పెళ్లి పై క్లారిటీ ఇచ్చిన సాహో బ్యూటీ



## నాగ్ అశ్విన్‌కు నో చెప్పిన జాతిరత్నాలు హీరోయిన్

జాతిరత్నాలు సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించింది పొడుగుకాళ్ల సుందరి ఫరియా అబ్దుల్లా. ఈ సినిమాలో చిట్టి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే ఈ సినిమాలో చిట్టి పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించింది. తొలి సినిమాతోనే తన నటనతో ప్రేక్షకులకు దగ్గరయింది ఫరియా అబ్దుల్లా. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసింది ఈ ముద్దుగుమ్మ కానీ ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయింది ఈ బ్యూటీ. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసినా అవి అంతగా క్లిక్ అవ్వలేదు. అలాగే బంగార్రాజు సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ లో మెరిసింది ఈ బ్యూటీ. రీసెంట్ గా కల్కి సినిమాలో చిన్న మెరుపులా మెరిసింది. ఇటీవల అల్లరి నరేష్‌తో ` ఆ ఒక్కటి అడక్కు ` లో హీరోయిన్ గా ఆకట్టుకుంది. కానీ ఆ సినిమా అంతగా ఆడలేదు. అయితే జాతిరత్నాలు సినిమాకు నిర్మాతగా నాగ్ అశ్విన్ వ్యవహరించిన విషయం తెలిసిందే.. అయితే ఓ కాలేజ్ ఈవెంట్ లో ఫరియాను చూసిన నాగీ ఆమెను హీరోయిన్ గా చేస్తావా అని అడిగారట. అయితే అప్పటికే పూనే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌కి అప్లై చేసిందట ఈ బ్యూటీ. దాంతో ఆమె నాగ్ అశ్విన్ కు నో చెప్పిందట. అయితే ఆతర్వాత ఆమెకు పూనే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో సీట్ రాలేదు. దాంతో మరోసారి నాగ్ అశ్విన్ ను హీరోయిన్ ఛాన్స్ ఉందా అని అడిగిందట. లక్కీగా అప్పటికి ఎవరు ఫైనల్ కాకపోవడంతో ఫరియాను ఓకే చేశాడట.

## న్యాయవాదితో వివరణ పంపిన రాజ్‌తరుణ్..

గత పదిరోజులుగా సోషల్ మీడియాలో రాజ్ తరుణ్, లావణ్య వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. తనను ప్రేమించి, పెళ్లి చేసుకుని మోసం చేశాడంటూ లావణ్య అనే అమ్మాయి నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హీరోయిన్ మాల్వీ మల్హోత్రా వల్లే తనను దూరం పెడుతున్నాడని.. తనకు అబార్షన్ కూడా చేయించాడని.. అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలను పోలీసులకు అందించింది. కాగా ఈ కేసులో విచారణకు హాజరు కావాలంటూ రాజ్ తరుణ్ కు పోలీసులు నోటీసులు పంపించారు. జూలై 18 వరకు విచారణకు హాజరుకావాలనగా.. తాజాగా టాలీవుడ్ హీరో రాజ్ తరుణ్ తన న్యాయవాది ద్వారా పోలీసులకు వివరణ పంపించారు. గురువారం పోలీసులు ఎదుట హాజరుకావాలని నోటీసులు పంపించగా.. తాను అందుబాటులో లేనని..విచారణకు హాజారు కాలేనని తెలిపారు. కాగా రాజ్ తరుణ్ ను వ్యక్తిగతంగా విచారణ చేయాలనుకుంటున్న పోలీసులు.. మరోసారి ఆయనకు నోటీసులు పంపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## భారత్‌లో ప్రమాదకరమైన ఏడు క్యాన్సర్లు!



క్యాన్సర్ ఎంత ప్రమాదకరమైన వ్యాధో అందరికీ తెలిసిందే. ఈ రోజుల్లో ఎవరికైనా, ఏ వయసు వారికైనా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్ కారణంగా ప్రతి ఏటా మిలియన్ల మంది మరణిస్తున్నారు. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న మరణాల్లో క్యాన్సర్ రెండవ ప్రధాన కారణం.ఎలాంటి ప్రత్యేక కసరత్తులు చేయకుండానే 5 కేజీలకుపైగా బరువు తగ్గితే.. దాన్ని క్యాన్సర్‌కు తొలి సూచికగా భావించవచ్చని మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ, మెడికల్ ఆంకాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ మీనూ వాలియా తెలిపారు. క్లోమం, ఆహార నాళం, ఉదర, ఊపిరితిత్తులకు సంబంధించిన క్యాన్సర్లలో ఇది ప్రాథమిక లక్షణమని ఆయన తెలిపారు. పేగుల్లో ఉండే కణుతుల కారణంగా కొద్ది మోతాదులో ఆహారం తీసుకోగానే కడుపు నిండినట్లు అవుతుందని ఆయన తెలిపారు. పెద్ద పేగు క్యాన్సర్ కారణంగా మలబద్ధకం సమస్య తలెత్తుంది. వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే అందులో నుంచి బయటపడేందుకు 90 శాతానికపైగా అవకాశం ఉంది. అదే వ్యాధి ముదిరితే నయమయ్యే అవకాశాలు తగ్గిపోతాయి.రొమ్ము భాగంలో లేదా చంకల్లో చన్నుల కింది భాగంలో ఉబ్బినట్లుగా లేదా గడ్డలాగా కనిపిస్తే వెంటనే అప్రమత్తం కండి. చనుమొనల నుంచి రక్తంతో కూడిన ఏవైనా స్రావాలు వస్తున్నట్లయితే రొమ్ములపై చర్మంలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపిస్తే వెంటనే డాక్టర్ని సంప్రదించండి. శరీరంలో ఎక్కడైనా ఉబ్బినట్లుగా కనిపించినా.. వాటి ఆకారంలో, పరిమాణంలో మార్పు కనిపించినా ఏ మాత్రం ఆలస్యం చేయొద్దు.కొన్నిసార్లు పొత్తికడుపులో అసాధరణ రీతిలో ద్రవాలు ఉత్పత్తి అవుతాయి. దీన్నే జలోదరం అంటారు. దీని వల్ల పొట్టభాగం ఉబ్బరంగా మారుతుంది. దీని వల్ల బరువు పెరగడంతోపాటు నడుము భాగం అసాధారణంగా పెరిగిపోతుంది. వీటి వల్ల కాలేయ సంబంధ వ్యాధులు వస్తాయి. ఈ పరిస్థితుల్లో క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. పేగుల్లో ఏదో అడ్డుపడుతున్నట్లు అనిపించి.. ఆహారం తీసకున్నప్పుడు నొప్పిగా అనిపించినా జాగ్రత్తపడాలి. ఇలాంటి సమయంలో నొప్పి క్రమక్రమంగా పెరుగుతుంటుంది. శరీర భాగంలో ఎక్కడైనా నొప్పి విడవకుండా వస్తున్నా అది క్యాన్సరేమో అని అనుమానించాలి. అన్ని నొప్పులు క్యాన్సర్ కావు కానీ జగ్రత్త అవసరం. బోన్ క్యాన్సర్ లాంటి వ్యాధులు ప్రారంభ దశలో ఉన్నప్పుడు నొప్పి ఎక్కువగా ఉంటుంది. తలనొప్పి కూడా చాలా రోజులపాటు వేధిస్తుంటే.. సొంత వైద్యంతో సరిపెట్టకుండా వెంటనే డాక్టర్ని సంప్రదించండి. ఎందుకంటే అది బ్రెయిన్ ట్యూమర్ కావచ్చు. పెద్ద పేగు, పురీషనాళ, అండాశయ క్యాన్సర్లు వచ్చినప్పుడు బ్యాక్ పెయిన్ వేధిస్తుంది. కొందరికి నోట్లో ఎర్రటి లేదా తెల్లటి రంగులో పుళ్లు ఏర్పడుతుంటాయి. నాలుక లేదా టాన్సిల్స్ భాగంలో ఈ తరహా పుళ్లు ఏర్పడితే అవి ప్రాణాంతక ల్యూకోపాల్కియా లేదా ఎరిత్రోపాల్కియా లాంటి వ్యాధులు కావచ్చు. గొంతు బొంగురు పోవడం, మాట మారడం తదితర లక్షణాలు నాలుగు వారాల కంటే ఎక్కువ కాలం కొనసాగితే.. వెంటనే డాక్టర్ని కలవండి. పొగాకు, పాన్ నమిలే అలవాటు ఉన్న వాళ్లు నోరు తెరవడంలో ఇబ్బంది పడుతుంటే డాక్టర్ని సంప్రదించడం మంచిది.



గర్భధారణ సమయంలో డెంగీ జ్వరం వస్తే తల్లితో పాటు పిండంపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రకారం, గర్భధారణ సమయంలో డెంగీ కారణంగా ప్రసూతి మరణాల రేటు 15.9శాతం ఉన్నట్లు నివేదించింది. ఏడిస్ దోమ ద్వారా సంక్రమించే డెంగీ జ్వరం అనేక సవాళ్లను కలిగిస్తుంది. ఈ వైరల్ ఇన్ఫెక్షన్ తల్లి ఆరోగ్యాన్ని నెగిటివ్‌గా ప్రభావితం చేస్తుంది. గర్భాశయం లోపల అభివృద్ధి చెందుతున్న పిండానికి ప్రమాదం కలిగిస్తుంది.

## గర్భధారణ సమయంలో డెంగీ వస్తే దాని లక్షణాలు ఎలా ఉంటాయి?

సీజనల్ వ్యాధిగా పేరొందిన డెంగీ జ్వరం చాలా వేగంగా విస్తరిస్తోంది. ఇది పిల్లలు, వృద్ధులు, గర్భిణీలను సులభంగా ప్రభావితం చేస్తుంది. గర్భిణీలు ముఖ్యంగా ఇన్ఫెక్షన్లకు గురవుతారు. ఎందుకంటే వారి రోగనిరోధక వ్యవస్థ గర్భధారణ సమయంలో హెచ్చుతగ్గులకు గురవుతుంది. గర్భిణీలలో ఏదైనా ఆరోగ్య సమస్య పుట్టబోయే బిడ్డను కూడా ప్రభావితం చేస్తుంది. కాబట్టి డెంగీ జ్వరం చాలా వేగంగా విస్తరిస్తున్నందున గర్భిణీలు దాని గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**గరిష్ట ఉష్ణోగ్రత:**

అధిక ఉష్ణోగ్రతలు తరచుగా 104°F (40°C) కంటే ఎక్కువగా ఉండడంతో పాటు తీవ్రమైన తలనొప్పులు వస్తాయి. అలాగే నుదుటిపైన విపరీతమైన నొప్పి, కళ్ల వెనుక నొప్పి కూడా వస్తుందని చెప్పారు. అలాగే కండరాలు, కీళ్లలో తీవ్రమైన అసౌకర్యం ఉంటుంది. డెంగీ సాధారణ లక్షణాలలో ఒకటి వ్యాధి ప్రారంభ దశలో వాంతులు, వికారం. ఇక దద్దుర్లు సాధారణంగా కీళ్లపై ప్రారంభమవుతాయి. అది శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తాయి. కొంతమంది వ్యక్తులు చిగుళ్ళలో రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం లేదా శరీరం గాయపడిన ప్రాంతాల నుంచి తేలికపాటి రక్తస్రావం లక్షణాలను అనుభవించవచ్చు. గర్భిణీలకు కడుపు సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ఇది రక్తస్రావం, జీర్ణ అవయవాలలో రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం మొదలైన వాటికి కారణమవుతుంది. ఇవి గర్భిణీఆరోగ్యంపై ప్రభావం చూపినప్పుడు, శిశువు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది.

**గర్భిణీలకు ప్రమాదాలు:**

పొత్తి కడుపు నొప్పి, నిరంతర వాంతులు, ద్రవం చేరడం, శ్లేష్మ రక్తస్రావం, నీరసం, అశాంతి, కాలేయ విస్తరణ, తక్కువ ప్లేట్‌లెట్స్, డెంగీ హెమరేజిక్ ఫీవర్.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com